సోమవారం 12-2-2024

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 322



'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'



విజయానికి రామబాణం

రిస్క్ నిర్వహణ తెలియాలి.. నిపుణుల మార్గదర్శకం అవసరం

-13లో



కుర్రాళ్లు వదిలేశారు

అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో ఆసీస్ చేతిలో ఓడిన యువ భారత్

-12లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సంకీర్ణం దిశగానే పాక్..

పాక్ సార్వత్రిక ఎన్నికల్లో హంగ్ ఫలితాలు రావడంతో మూడు ప్రధాన పార్టీలు ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి.

- వివరాలు 6లో



రేపు రైతు సంఘాల 'ఢిల్లీ చలో'

రైతు సంఘాలు రేపు తలపెట్టిన 'ఢిల్లీ చలో' మార్చ్ నేపథ్యంలో ఢిల్లీ, హరియాణా సరిహద్దుల్లో బందోబస్తు కట్టుదిట్టం చేశారు.

- వివరాలు 6లో



ఎన్నికలప్పుడే పేదలు గుర్తొస్తారు

కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల సమయంలోనే గ్రామీణులు, రైతులు, పేదలు గుర్తొస్తారని ప్రధాని మోదీ ఎద్దేవా చేశారు.

- వివరాలు 6లో



ప్రేమ మన డీఎన్ఏలోనే..

దేశ డీఎన్ఏలోనే ప్రేమ ఉందని.. కానీ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు దేశంలో విద్వేషం వ్యాప్తి చేస్తున్నాయని రాహుల్ గాంధీ విమర్శించారు.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

గడువు పొడిగించేది లేదు



2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిస్కంల వార్షిక ఆదాయ అవసరాలు, టారిఫ్ ప్రతిపాదనలు సమర్పించేందుకు జనవరి 31తో గడువు ముగిసింది. దాన్ని మరో 3 నెలలు పొడిగించాలన్న డిస్కంల విజ్ఞప్తిని ఈఆర్‌సీ తోసిపుచ్చింది.

- వివరాలు 3లో▶


మే 23న ఎడ్‌సెట్.. జూన్ 4,5 తేదీల్లో ఐసెట్



రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి జూన్ 4, 5 తేదీల్లో ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఐసెట్) నిర్వహిస్తున్నట్లు ఉన్నత విద్యామండలి పేర్కొంది. అలాగే రెండేళ్ల బీఈడీ కోర్సుల్లో ప్రవేశం కోసం ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఎడ్‌సెట్)ను మే 23న నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఇందుకు సంబంధించి షెడ్యూల్‌ను ఆదివారం విడుదల చేసింది.

- వివరాలు 3లో▶

ప్రేమికులూ జరభద్రం!



'మీకు అత్యంత సన్నిహితులు వాలెంటైన్స్ డే సందర్భంగా మీకు సర్‌ప్రైజ్ గిఫ్ట్ పంపారు.. దాన్ని పొందాలంటే మేం చెప్పిన ఖాతాకు కస్టమ్స్ చార్జీల కింద కొంత మొత్తం పంపండి' అంటూ మెసేజ్‌లు, వెబ్ లింక్‌ల ద్వారా సైబర్ నేరగాళ్లు సరికొత్త మోసాలకు తెరతీస్తున్నారని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

- వివరాలు 14లో▶



'ఆరు'పై అయోమయం!

గ్యారంటీల అమలుపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తికర చర్చ

కాంగ్రెస్ మేనిఫెస్టో హామీలకు.. బడ్జెట్‌లో కేటాయింపులకు పొంతన లేదనే భావన

చెప్పినవి చెప్పినట్టు అమలు చేస్తే ఆరు గ్యారంటీలకు ఏటా రూ.1.36లక్షల కోట్లపైనే అవసరం

పరిమితంగా అమలు చేసినా రూ.80 వేల కోట్లపైనే కావాలనే అంచనాలో అధికారులు

బడ్జెట్‌లో సర్కారు చేసిన కేటాయింపులు రూ.53 వేల కోట్లే!

కొన్ని హామీల అమలుపై ఇంకా ఎలాంటి స్పష్టత ఇవ్వని సర్కారు

పూర్తి స్థాయిలో గ్యారంటీలను ఎలా అమలు చేస్తారనే సందేహాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులపై అటు అధికారిక వర్గాల్లో, ఇటు రాష్ట్ర ప్రజానీకంలో ఆసక్తికర చర్చ జరుగుతోంది. తాము కేటాయించిన నిధులతో ఆరు గ్యారంటీల అమలు జరిగి తీరుతుందని సర్కారు చెబుతోంటే.. మరికొన్ని నిధులు అవసరమని అధికార వర్గాలు లెక్కలు కడుతున్నాయి. మరోవైపు ఎన్నికల సమయంలో, మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను యథాతథంగా అమలు చేయాలంటే.. ఇప్పుడు బడ్జెట్‌లో పెట్టిన దానికి సుమారు మూడు రెట్లు ఎక్కువగా నిధులు అవసరమనే చర్చ జరుగుతోంది. హామీలను సంపూర్ణంగా అమలు చేయాలంటే ఏటా రూ.1.36 లక్షల కోట్లకుపైనే కావాల్సి ఉంటుందనే అంచనాలు వెలువడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన 2024–25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలకు రూ.53 వేల కోట్లను మాత్రమే కేటాయించింది. ఈ లెక్కలన్నీ చూస్తుంటే ఆరు గ్యారంటీల అమలు వ్యవహారం అయోమయంగా మారిందనే అభిప్రాయం

మిగతా 2వ పేజీలో ▶

మహాలక్ష్మి..

మహాలక్ష్మి పథకం కింద రాష్ట్రంలోని ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించింది. ఓటర్ల జాబితా ప్రకారం రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన మహిళలు కోటీ 65లక్షల మంది ఉన్నారు. ఇందులో సుమారు 26 లక్షల మంది ఇప్పటికే వితంతు, ఒంటరి, వృద్ధాప్య పింఛన్లు పొందుతున్నారు. వారిని మినహాయించినా మిగతా కోటీ 39లక్షల మందికి ప్రతీనెలా రూ.2,500 లెక్కన ఏటా రూ.41,700 కోట్లు కావాల్సి ఉంటుంది.

→ రాష్ట్రంలో మొత్తం 70లక్షల మంది మహిళల పేరిట వంటగ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. సిలిండర్ రూ.500కే ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఏడాదికి పన్నెండు సిలిండర్లు ఇస్తే.. ఏటా రూ.4,200 కోట్లు గ్యాస్ కంపెనీలకు చెల్లించాల్సి ఉంటుంది. ఆరు సిలిండర్లకే పరిమితం చేస్తే రూ.2,100 కోట్లు చెల్లించాలి.

→ ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలవుతోంది. దీనికోసం ప్రతి నెలా రూ.300 కోట్ల చొప్పున ఏటా ఆర్టీసీకి రూ.3,600 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది.

ఆదివారం ప్రజాభవన్‌లో సాగునీటి ప్రాజెక్టులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబుతో కలసి తిలకిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



నీళ్ల 'మంటలు'

కృష్ణా ప్రాజెక్టుల అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ సై అంటే సై

ప్రజాభవన్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేల భేటీ.. హాజరైన సీఎం రేవంత్

కృష్ణా ప్రాజెక్టులు, జలాలపై ఎమ్మెల్యేలకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

సాగునీటి ప్రాజెక్టులపై నేడు అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేసే అవకాశం

- నేడు రాష్ట్రవ్యాప్తంగా కేసీఆర్ దిష్టిబొమ్మల దహనానికి కాంగ్రెస్ కిసాన్ సెల్ పిలుపు
- రేపు మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు ఎమ్మెల్యేలు.. అసెంబ్లీకి సెలవు ఇచ్చి మరీ పర్యటన
- అదే రోజున నల్లగొండలో భారీ సభ నిర్వహణకు బీఆర్ఎస్ ఏర్పాట్లు.. కేసీఆర్ హాజరుకానుండటంతో పెద్ద ఎత్తున జన సమీకరణకు ప్లాన్
- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పైచేయి సాధించేందుకు ఇరు పార్టీల ప్రయత్నాలు

వివరాలు 3లో

తెలంగాణలో క్లీన్‌స్వీప్ చేస్తాం



17 ఎంపీ స్థానాల్లోనూ గెలుస్తాం 2లో

- 20 నుంచి విజయ సంకల్పయాత్ర
- పోస్టర్‌ను ఆవిష్కరించిన కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

వీరయ్యకు పార్టీ పర్యవేక్షణ బాధ్యతలు



సీపీఎం రాష్ట్ర కమిటీ కీలక నిర్ణయం

- అనారోగ్యానికి గురై విశ్రాంతిలో ఉన్న కార్యదర్శి తమ్మినేని
- రెండు ఎంపీ స్థానాల్లో పోటీ చేయాలని పార్టీ తీర్మానం

2లో

కాల్చేసే కాంతిపుంజం!

ఇజ్రాయెల్ అమ్ముల పొదిలో ఐరన్ బీమ్



లెబనాన్‌పై పూర్తిస్థాయి యుద్ధానికి ఇజ్రాయెల్ సిద్ధమవుతోందా? పక్కలో బల్లెంలా మారిన హెజ్బొల్లాను సమూలంగా తుడిచిపెట్టాలని నిర్ణయించుకుందా? హెజ్బొల్లా ఉగ్రవాదుల డ్రోన్లు, రాకెట్లను కూల్చడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ 'ఐరన్ బీమ్' తొలిసారిగా రంగప్రవేశం చేయనుందా? పాత పద్ధతులను పక్కన పెట్టి కొత్తగా కదం తొక్కనుందా? ఇజ్రాయెలీలకు ప్రభుత్వం జారీ చేస్తున్న హెచ్చరికలను చూస్తుంటే అవుననే అనిపిస్తోంది.

వివరాలు 6లో

క్లుప్తంగా...

డబుల్ ఇంజిన్ సర్కార్ కాంగ్రెస్‌దే

మంత్రి పొన్నం ప్రభాకర్



న్యాయయాత్రలో భాగంగా ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

కొత్తూరు: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని..డబుల్ ఇంజిన్ సర్కార్ పాలన సాగిస్తుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి ఆధ్వర్యంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధ్యక్షతన ఆదివారం రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్లలో నిర్వహించిన పాలమూరు న్యాయయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటై రెండు నెలలు కూడా కాలేదని.. అప్పుడే హామీలు ఎందుకు అమలు చేయడం లేదంటూ బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వం తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఆటో కార్మికులను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై చర్చ

సాక్షి, హైదరాబాద్: శాసనసభ సమావేశాల్లో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చ జరగనుంది. ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే టీఎస్ జెన్కో 2022 -23 వార్షిక నివేదికను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమర్పిస్తారు. అటవీ అభివృద్ధి సంస్థ 2020-21 వార్షిక నివేదికను మంత్రి కొండా సురేఖ సభకు సమర్పిస్తారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేలు బి.మశ్చేందర్‌రావు (సికింద్రాబాద్ కంటోన్మెంట్), పి.నర్సారెడ్డి (నిర్మల్), బిరుదు రాజమల్లు (పెద్దపల్లి) మృతి పట్ల సభాపతి స్థానం నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సంతాప ప్రకటన చేస్తారు. అనంతరం రాష్ట్రంలో సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల ప్రచార ప్రకటనల సవరణ బిల్లును సీఎం రేవంత్ సభకు సమర్పిస్తారు. ఈ బిల్లు ఆమోదం తర్వాత 2023 -24 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ అనుబంధ అంచనాల తీర్మానాన్ని భట్టి విక్రమార్క సభ ముందు పెడతారు. 2024 - 25 ఏడాదికి సంబంధించి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ తీర్మానాన్ని కూడా సభ ఆమోదం కోసం భట్టి సమర్పిస్తారు. ఈ తీర్మానంపై సభ చర్చించి ఆమోదించిన తర్వాత మంగళవారానికి వాయిదా పడనుంది.

రాముడిని రాజకీయం చేశారు

బీఆర్‌ఎస్ ఎంపీ కేశవరావు



సాక్షి, న్యూఢిల్లీ: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ, మోదీ ప్రభుత్వం రాముడిని, రామమందిరాన్ని రాజకీయం చేశాయని బీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు ఆరోపించారు. రామమందిరంపై పార్లమెంటులో చర్చించి తీర్మానం చేయడం తప్పన్నారు. ఆయన ఆదివారం ఢిల్లీలోని తన నివాసంలో విలేకరులతో మాట్లా డుతూ.. ప్రజా సమస్యలు పక్కనపెట్టి రామ మందిరంపై పార్లమెంటులో తీర్మానం చేయ డాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అయోధ్యకు రావాలని మోదీ ప్రభుత్వం ఆహ్వానాలు పంపిందని, రామాలయానికి వెళ్లని వారు దేశ వ్యతిరేకులా? అని ప్రశ్నించారు. రూ.500 కోట్లతో యాదాద్రిలో ఆలయం నిర్మిస్తే ప్రధాని మోదీ, కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. కాంగ్రెస్‌లో చేరిన పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత బీఆర్‌ఎస్‌పై తప్పుడు ఆరోపణలు చేశారని, బీఆర్‌ఎస్ బీజేపీ ఒక్కటే అని ఆయన చేసిన వ్యాఖ్యలు బాధపెట్టాయన్నారు.

ప్రాజెక్టులపై అఖిలపక్షానికి వినతి



సాక్షి, హైదరాబాద్: దశాబ్ద కాలంగా సాగునీటి ప్రాజెక్టులపై రూ.లక్షల కోట్లు వ్యయం చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు రాకపోవడం వల్ల.. సాగు నీటి వనరుల నిర్మాణంలో జరిగిన అవకతవకలను పరిశీలించడానికి అఖిలపక్ష కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యు డు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకల వల్ల కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్టులు దెబ్బతిన్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన కన్నెపల్లి పంపు హౌజ్ వద్ద గల రక్షణ గోడ కూలి 17 బాహుబలి పంపులు నీట మునిగినా ఇంతవరకు మరమ్మతులు పూర్తి కాలేదని పేర్కొన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి చెందిన 8 పంపులు శ్రీశైలంలో నీట మునిగాయని వివరించారు. ఈ సమస్యలపై చర్చించడానికి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వీరయ్యకు పార్టీ పర్యవేక్షణ బాధ్యతలు

సీపీఎం రాష్ట్ర కమిటీ కీలక నిర్ణయం

- అనారోగ్యానికి గురై విశ్రాంతిలో ఉన్న కార్యదర్శి తమ్మినేని
- రెండు ఎంపీ స్థానాల్లో పోటీ చేయాలని పార్టీ తీర్మానం



తమ్మినేని



వీరయ్య

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో సీపీఎం పర్యవేక్షణ బాధ్యతలు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్యకు అప్పగించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఉంటూ పార్టీని నడిపించాల్సిన బాధ్యతను ఆయనకు అప్పగిస్తూ సీపీఎం రాష్ట్ర కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 9, 10 తేదీల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గం, రాష్ట్ర కమిటీ సమావేశాలు జరిగాయి. ఆ భేటీల్లో ఈ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైన సంగతి తెలిసిందే. ఏఐజీలో ఆయన చికిత్స పొందారు. ఆయనకు మరింత విశ్రాంతి అవసరమని వైద్యులు చెప్పారు. ఈ నేపథ్యంలో రెండ్రోజులు జరిగిన పార్టీ సమావేశాలకు కూడా తమ్మినేని కొద్దిసేపు మాత్రమే హాజరయ్యారు. కాగా తమ్మినేని సలహాలు, సూచనలు, మార్గదర్శకత్వంలోనే వీరయ్య పనిచేయాలని స్పష్టం చేస్తూ రాష్ట్ర కమిటీ తీర్మానించింది. అవసరాన్ని బట్టి తమ్మినేని హైదరాబాద్‌లో, అలాగే ఖమ్మంలోనూ ఉంటారు. మూడు నెలల పాటు వీరయ్య ఈ బాధ్యతలు నిర్వర్తించాలని సీపీఎం నిర్ణయించింది. దీంతో వచ్చే లోక్‌సభ ఎన్నికల సమయంలో పార్టీని నడిపించాల్సిన బాధ్యత వీరయ్యపై పడింది. ఈయన గతంలో ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షుడిగా, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా, నవ తెలంగాణ ఎడిటర్‌గా పనిచేశారు.

రెండు ఎంపీ సీట్లలో పోటీ

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో రెండు స్థానాల్లో పోటీ చేయాలని పార్టీ నిర్ణయించినట్లు తమ్మినేని ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా కమిటీలతో చర్చించిన అనంతరం త్వరలో సీట్లను ఖరారు చేయాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఖమ్మం, మహబూబాబాద్, నల్లగొండ, భువనగిరి స్థానాల్లో ఏవో రెండింటిలో పోటీ చేయాలని సీపీఎం భావిస్తున్నట్టు తెలిసింది. నేతల గురి ప్రధానంగా మహబూబాబాద్, భువనగిరి స్థానాలపై ఉన్నట్లు సమాచారం. అయితే ఈసారి కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుని ముందుకెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేవలం ఒక స్థానమే ఇస్తాననడంతో పొత్తు కుదరలేదు. ఇక రెండ్రోజులు జరిగిన సమావేశాల్లో అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో రాజకీయ పరిస్థితి, లోక్‌సభ ఎన్నికలు, తదితర అంశాలపై సీపీఎం చర్చించింది. కాంగ్రెస్‌తో అవగాహన చేసుకొని ఉంటే సానుకూల ఫలితాలు వచ్చేవన్న అభిప్రాయం వ్యక్తమైనట్లు సమాచారం.

ఒక స్థానంలో సీపీఐ పోటీ!

సీపీఐ కనీసం ఒక లోక్‌సభ స్థానంలో పోటీ చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. అయితే లోక్‌సభ ఎన్నికలకు మద్దతు కోరి ఎమ్మెల్సీలు లేదా రాజ్యసభ సీటు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించవచ్చని అనుకుంటున్నారు.

16న సమ్మెకు మద్దతు

కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌కు పార్టీ మద్దతు ప్రకటించింది. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని, ప్రజలంతా పాల్గొనాలని తమ్మినేని విజ్ఞప్తి చేశారు.

బడ్జెట్‌లో కానరాని 'కల్యాణలక్ష్మి'

కాంగ్రెస్ హామీలిచ్చి మాట తప్పుతోంది: హరీశ్‌రావు



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్

సిద్దిపేట జోన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను బడ్జెట్‌లో విస్మరించిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేటలోని స్థానిక క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు నగదుతోపాటు తులం బంగారం ఇస్తామన్న కాంగ్రెస్ బడ్జెట్‌లో ఆ ఊసే ఎత్తలేదన్నారు. అలాగే మైనార్టీలకు పెద్దపీట వేస్తామని చెప్పి నిధుల కేటాయింపులో మొండి చెయ్యి చూపిందని విమర్శించారు. బడ్జెట్‌లో మైనార్టీలకు రూ.4 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి, నేడు రూ.2,200 కోట్లే కేటాయించిందని, రెండు నెలలుగా వృద్ధులకు పింఛన్లు కూడా అందడం లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 13 లక్షల పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు రూ.12 వేల కోట్ల ఆర్థిక సాయం చేసిందని గుర్తు చేశారు. వ్యవసాయానికి కనీసం 16 గంటలు కూడా విద్యుత్ ఇవ్వడం లేదని, పంటలు ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. సిద్దిపేట ప్రాంతానికి చెందిన మైనార్టీల ఉమ్రా యాత్ర కోసం తన సొంత డబ్బు వెచ్చిస్తున్నట్లు హరీశ్‌రావు తెలిపారు.

తెలంగాణ చరిత్రను కనుమరుగు చేసే కుట్ర

రాష్ట్ర చిహ్నం నుంచి కాకతీయ తోరణం, చార్మినార్ తొలగిస్తే ఊరుకోం: బోయినపల్లి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వ్యతిరేక శక్తుల డైరెక్షన్‌లోనే సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నట్లు అనుమానంగా ఉందని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నాన్ని మారుస్తామని, కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను రాష్ట్ర చిహ్నం నుంచి తొలగిస్తామని సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి మాట్లాడటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. కాకతీయులు 11, 12వ శతాబ్దాల్లో యావత్ దక్షిణ భారతదేశాన్ని పరిపాలించారని, వారు రాచరిక వ్యవస్థ నుంచి వచ్చిన వాళ్లు కాదని, పేదల కోసం పనిచేసిన వారని అన్నారు. ఎనిమిది వందల ఏళ్ల కాకతీయుల చరిత్రకు నిదర్శనమైన కళాతోరణం, 400 ఏళ్ల చరిత్ర ఉన్న చార్మినార్‌ను రాష్ట్రం చిహ్నం నుంచి తొలగిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.

మిషన్ లైఫ్‌తో పర్యావరణ విప్లవం

పీ3(ప్రో-ప్లానెట్-పీపుల్) మోడల్‌తో జీవనశైలిలో మార్పులు..

సెంట్రల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ హీరాలాల్ సమారియా



సాక్షి, హైదరాబాద్: భవిష్యత్ తరాలకు పర్యావరణ అనుకూల ప్రపంచాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సెంట్రల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ (సీఐసీ) హీరాలాల్ సమారియా పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం శ్రమిస్తున్న మిషన్‌లైఫ్‌కు ప్రపంచ దేశాల మద్దతు ఎంతో అవసరమన్నారు. పీ3 (ప్రో-ప్లానెట్-పీపుల్) మోడల్‌లో జీవనశైలిలో మార్పులను మిషన్‌లైఫ్ ప్రోత్సహిస్తుందని అయన వెల్లడించారు. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ), విద్యుత్ మంత్రిత్వ శాఖకు చెందిన మిషన్ లైఫ్‌కు చెందిన దక్షిణాది రాష్ట్రాలు/ యూటీల మీడియా అడ్వైజర్ ఎ.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంసీహెచ్‌ఆర్‌డీలో జరిగిన కార్యక్రమంలో హీరాలాల్ సమారియా ముఖ్య అతిథిగా ప్రసంగించారు. హైదరాబాద్‌లో మిషన్ లైఫ్ వంటి కేంద్ర ప్రభుత్వానికి చెందిన సంస్థ ప్రతిష్టాత్మక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో మరింత అవగాహన పెరుగుతుందన్నారు. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా మిషన్‌లైఫ్ లక్ష్యాలున్నాయన్నారు. పెరుగుతున్న పర్యావరణ సవాళ్ల నేపథ్యంలో సుస్థిరమైన, సామరస్యపూర్వకమైన సమాజం కోసం అన్ని దేశాల్ని ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చేందుకు మిషన్‌లైఫ్ ఒక మార్గదర్శిగా నిలుస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. 2028 నాటికి భారత్‌లోని 80 శాతం గ్రామాలు, పట్టణాలు, స్థానిక సంస్థల్లో పర్యావరణ అనుకూల పద్ధతుల్ని అవలంబించేలా ప్రోత్సహించడమే మిషన్ లైఫ్ లక్ష్యమని హీరాలాల్ స్పష్టం చేశారు. ఇంధన సామర్థ్య నిర్వహణపై దృష్టి సారిస్తూ అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నందుకు తెలుగు రాష్ట్రాలను సమారియా అభినందించారు. డా.మర్రిచెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్, నెడ్‌క్యాప్ సమన్వయంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎంసీఆర్ హెచ్‌ఆర్డీ డైరెక్టర్ జనరల్ డా.శశాంక్ గోయెల్, నెడ్‌క్యాప్ ఎండీ జానయ్య, సీనియర్ ఫ్యాకల్టీ డా.మాధవి తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కుల నేత రాజేశం అరెస్ట్

ఛత్తీస్‌గఢ్ దంతెవాడ జిల్లా గీదం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు..

పోలీసులను కిడ్నాపర్లుగా భావించి అడ్డగించిన బట్టపల్లి గ్రామస్తులు



సారంగాపూర్ (జగిత్యాల)/ సాక్షి, హైదరాబాద్: జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామానికి చెందిన పౌరహక్కుల నేత పోగుల రాజేశంను ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ జిల్లా పోలీసులు సివిల్ డ్రెస్‌లో ఆదివారం ఉదయమే ఓ రెండు వాహనాల్లో బట్టపల్లి గ్రామశివారుల్లోకి వచ్చారు. అదే సమయంలో బట్టపల్లికి గ్రామానికి చెందిన రైతులు పొలాలకు నీరు పెట్టేందుకు వెళ్తున్నారు. నలుగురు వ్యక్తులు ఒకే వాహనంలో ఉండటంపై వారికి అనుమానం వచ్చి వెంటనే గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు అక్కడికి చేరుకుని పోలీసులను కిడ్నాపర్లుగా భావించి వారిని గ్రామంలోపలికి రానివ్వకుండా కొద్దిసేపు అడ్డుకున్నారు. గ్రామస్తులు 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా సారంగాపూర్ పోలీసులు అక్కడికి చేరుకుని గ్రామస్తులతో కలిసి, వాహనాల్లో ఉన్నవారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. గుర్తింపు కార్డులు పరిశీలించాక వారిని ఛత్తీస్‌గఢ్ పోలీసులుగా నిర్ధారించారు. దీంతో అక్కడ్నుంచి ఛత్తీస్‌గఢ్ పోలీసులు నేరుగా రేచపల్లి గ్రామంలోని పోగుల రాజేశం ఇంటికి వెళ్లి ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులతో రాజేశం భార్య మల్లవ్వ, కుమారుడు శ్రీనివాస్ వాగ్వాదానికి దిగారు. 2023 ఫిబ్రవరి, మార్చిలో రాజేశంపై ఛత్తీస్‌గఢ్‌లోని గీదం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని, ఆ విషయంలో ఆయనను అరెస్టు చేస్తున్నట్లు వారికి వివరించారు. అయినా రాజేశంతో కలిసి మల్లవ్వ, శ్రీనివాస్ పోలీసు వాహనంలో కొద్దిదూరం వెళ్లారు. అయితే, రేచపల్లి గ్రామ శివారులో వారిని వదిలిపెట్టారు. కాగా, పోగుల రాజేశంను విడుదల చేయాలని పౌరహక్కుల సంఘం తెలంగాణ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

'ఆరు'పై అయోమయం!

▶ మొదటి పేజీ తరువాయి

వ్యక్తమవుతోంది. ఒకవేళ గ్యారంటీలను పూర్తి స్థాయిలో కాకుండా, కొందరికే పరిమితం చేసినా ఏటా రూ.80 వేలకోట్లకుపైనే అవసరమని అధికార వర్గాలు అంటున్నా.. దీనిపై స్పష్టత ఇవ్వడం లేదు.

రైతు భరోసా..: గత సర్కారు రాష్ట్రంలోని దాదాపు 1.52 కోట్ల ఎకరాలకు సంబంధించి సుమారు 69 లక్షల మంది రైతులకు ఏటా ఎకరానికి రూ.10,000 చొప్పున చెల్లించింది. కాంగ్రెస్ తాము అధికారంలోకి వచ్చాక ఎకరాకు రూ.15,000 ఇస్తామని ప్రకటించింది. దీనికి ఏటా రూ.22,800 కోట్లు అవసరం.

- రాష్ట్రంలో భూమి లేని కౌలు రైతులు 6.5 లక్షల మంది ఉన్నట్టు అంచనా. వారికి ఏటా రూ.15 వేల చొప్పున ఇచ్చేందుకు ఏటా రూ. 975 కోట్లు కావాలి.
- కాంగ్రెస్ కూలీలకు ఏటా రూ. 12 వేలు ఇస్తామని పేర్కొంది. రాష్ట్రంలో 52లక్షలకుపైగా ఉపాధి హామీ జాబ్‌కార్డులు ఉన్నా యాక్టివ్‌గా ఉన్న జాబ్‌కార్డులు దాదాపు 32 లక్షల మేర ఉన్నాయి. జాబ్‌కార్డులున్న అందరికీ పథకాన్ని వర్తింపజేస్తే ఏటా రూ.6,240 కోట్లు కావాలి, యాక్టివ్ వారికే ఇస్తే రూ.3,840 కోట్లు అవసరం.
- వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పేర్కొంది. రాష్ట్రంలో కొనుగోలు చేస్తున్న కోటీ 30లక్షల టన్నుల ధాన్యానికి బోనస్ ఇవ్వాలంటే రూ.6,500 కోట్లు అవసరం.

ఆరు గ్యారంటీల్లో.. 13 పథకాలు

కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు 'మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, రైతు భరోసా, చేయూత, యువ వికాసం ఉన్నాయి. ఈ ఆరు గ్యారంటీల పరిధిలో మొత్తం 13 పథకాలను అమలు చేయాల్సి ఉంది. వీటిని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు భారీ స్థాయిలో నిధులు అవసరం కానున్నాయి.

గృహ జ్యోతి..

ప్రస్తుతం రాష్ట్రంలో 200యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తున్న గృహ విద్యుత్ కనెక్షన్ల సంఖ్య 95.23 లక్షలు. ఆ కుటుంబాలు ఏటా దాదాపు 9,022 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్నాయి. ఒక్కో యూనిట్ విద్యుత్ కొనుగోలు వ్యయం సగటున రూ.7గా లెక్కించినా.. ఏటా గృహజ్యోతి అమలు కోసం సుమారు రూ.6,315 కోట్లను విద్యుత్ సంస్థలకు చెల్లించాల్సి ఉంటుంది.

ఇందిరమ్మ ఇళ్లు..

రాష్ట్రంలో సొంతిల్లు లేనిపేదలకు 20 లక్షల ఇళ్లు కట్టిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. అంటే ఏటా నాలుగు లక్షల ఇళ్ల నిర్మాణం కోసం నిధులు ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ఇస్తామన్న హామీ మేరకు.. 20లక్షల ఇళ్లకు మొత్తంగా రూ. లక్ష కోట్లు అవసరం. ఏటా బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయించాల్సి ఉంటుంది. అయితే సర్కారు తాజా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో రూ. ఏడు వేల కోట్లే కేటాయించింది.

చేయూత..

రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 43.68 లక్షల మంది వివిధ రకాల పింఛన్లు పొందుతున్నారు. ప్రస్తుతం ప్రతినెలా దివ్యాంగులకు రూ.4వేలు, ఇతర లబ్ధిదారులకు రూ.2 వేలు ఇస్తున్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు, ఇతర పింఛన్లను రూ.4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ లెక్కన ఏటా 5.5 లక్షల మంది దివ్యాంగుల పింఛన్లకు రూ.3,960 కోట్లు, సుమారు 38 లక్షల ఇతర పింఛన్లకు రూ.18,240 కోట్లు కేటాయించాల్సి ఉంటుంది.

యువ వికాసం..

యువ వికాసం పథకంపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత లేదు. విద్యార్థుల ఫీజులు, కోచింగ్ చెల్లింపుల కోసం రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు ఇస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రంలో ఏటా దాదాపు ఆరు లక్షల మంది విద్యార్థులు డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఇంటర్మీడియట్ వంటివి పూర్తి చేసుకుంటున్నారు. వీరికి విద్యా భరోసా కోసం బ్యాంకుల నుంచి లోన్లు తీసుకుని ఇస్తారా? ఎలా సర్దుబాటు చేస్తారు. లోన్లు తీసుకుని ఇస్తే వడ్డీ ఎవరు భరిస్తారన్నది తేలలేదు.

తెలంగాణలో బీజేపీ క్లీన్‌స్వీప్



మీడియాతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో మహేశ్వర్‌రెడ్డి, లక్ష్మణ్, జితేందర్‌రెడ్డి, రాణిరుద్రమ

17 ఎంపీ స్థానాల్లోనూ గెలుస్తాం

- ఈ నెల 20 నుంచి బీజేపీ విజయ సంకల్పయాత్ర
- యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించిన కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ క్లీన్‌స్వీప్ చేస్తుందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రంలో మూడోసారి బీజేపీని అధికారంలోకి తీసుకురావాలనే ఆలోచన ప్రజల్లో ఉందన్నారు. ఈనెల 20 నుంచి బీజేపీ చేపట్టనున్న విజయ సంకల్పయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆయన బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి తదితరులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బీజేపీకి సానుకూల వాతావరణం కనపడుతోందన్నారు. కేంద్రంలో ఏర్పాటయ్యే నరేంద్రమోదీ ప్రభుత్వంలో తెలంగాణ ప్రజలు భాగస్వామ్యమయ్యేలా, ప్రజల మద్దతు కూడగట్టేందుకు బీజేపీ రాష్ట్రశాఖ 5 బస్సు యాత్రలు నిర్వహిస్తుందన్నారు.

కాంగ్రెస్-బీజేపీ మధ్యనే పోటీ

ఈసారి హైదరాబాద్ ఎంపీ సీటును బీజేపీనే కైవసం చేసుకుంటుందని కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీ మధ్యే పోటీ ఉంటుందని చెప్పారు. నరేంద్రమోదీకి ఎదురు నిలబడే శక్తి ఏ కూటమికి లేదని, ఖమ్మం, నల్లగొండ ప్రాంతాల నుంచి కూడా మోదీకి 80 శాతం మంది ప్రజలు అండగా నిలుస్తున్నారన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, పార్టీ రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధులు ఎన్వీ సుభాష్, రాణిరుద్రమ తదితరులు పాల్గొన్నారు.

ఐదు యాత్రలు ఇలా...

విజయ సంకల్ప యాత్ర పేరుతో ఫిబ్రవరి 20వ తేదీన ఐదు బస్సు యాత్రలు ప్రారంభమై మార్చి 1వ తేదీ వరకు కొనసాగుతాయని కిషన్‌రెడ్డి చెప్పారు.

- మొదటిది కొమురం భీం యాత్ర కాగా.. ఇది ఆదిలాబాద్, పెద్దపల్లి, నిజామాబాద్ ఎంపీ సెగ్మెంట్‌లలో
- శాతవాహన యాత్ర కరీంనగర్, మెదక్, జహీరాబాద్, చేవెళ్ల సెగ్మెంట్‌లలో
- కాకతీయయాత్ర ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్‌లలో
- భాగ్యనగర యాత్ర భువనగిరి, హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరిలలో
- కృష్ణమ్మ యాత్ర మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నల్లగొండ ఎంపీ సెగ్మెంట్‌లలో ఉంటుందని, ఈ ఐదు యాత్రలు భాగ్యనగరంలో కలిసేవిధంగా ప్రణాళిక రూపొందించినట్టు కిషన్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్‌లోకి మాజీ మేయర్ బొంతు?

ముఖ్యమంత్రి రేవంత్‌ను కలిసిన రామ్మోహన్



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మాజీ మేయర్ బొంతు రామ్మోహన్

కుషాయిగూడ(హైదరాబాద్): తెలంగాణ ఉద్యమనేత, గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆదివా రం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు పలువురు కీలక నేతలు ముఖ్యమంత్రిని కలుస్తుండటం చర్చనీయాంశంగా మారింది. విద్యార్థి నాయకుడిగా తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన రామ్మోహన్‌కు తెలంగాణ ప్రభుత్వ ఏర్పాటు అనంతరం చాలాకాలం వరకు ఎలాంటి పదవులు దక్కలేదు. బొంతు అసంతృప్తిని గుర్తించిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయనను జీహెచ్‌ఎంసీ ఎన్నికల బరిలో నిలిపి తెలంగాణ ఏర్పడిన అనంతరం గ్రేటర్ హైదరాబాద్ మొదటి మేయర్‌గా అవకాశం కల్పించారు. అనంతరం తన సతీమణి బొంతు శ్రీదేవిని చర్లపల్లి కార్పొరేటర్‌గా గెలిపించుకున్నారు. మేయర్‌గా కొనసాగుతూ ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే స్థానంపై బొంతు కన్నేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలు కూడా ఉప్పల్ స్థానం కోసం పోటీపడగా కేసీఆర్ బండారికే టికెట్ ఖరారు చేశారు. పార్టీ టికెట్ ఇవ్వలేదని మనస్తాపం చెంది కొన్ని రోజులపాటు మౌనంగా ఉన్న రామ్మోహన్‌తో కేసీఆర్, కేటీఆర్ మాట్లాడి సర్దిచెప్పారు. త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాల్లో ఏదైనా ఒకచోట పోటీ చేసే అవకాశం కల్పించాలని బీఆర్‌ఎస్ పెద్దలను బొంతు కోరినప్పటికీ టికెట్ దక్కే చాన్స్ కనిపించడం లేదు. ఈ నేపథ్యంలోనే ఆయన ముఖ్యమంత్రిని కలిసినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో త్వరలోనే ఆయన కాంగ్రెస్ గూటికి చేరడం ఖాయమని స్పష్టమవుతోంది. సోమవారం తన మనసులో మాటను మీడియాకు వెల్లడించనున్నట్లు సమాచారం.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల దుష్ప్రచారం నమ్మొద్దు

- బీఆర్‌ఎస్ నాయకుల అవినీతిపై కాంగ్రెస్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు
- పాదయాత్రలో బండి సంజయ్



చందుర్తి మండలం కట్టలింగంపేటలో విలేకరులతో మాట్లాడుతున్న బండి సంజయ్

చందుర్తి (వేములవాడ): రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలను గెలుస్తుందని సర్వేలు చెబుతుండడంతో రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు కలిసి తమ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. దీనిని ప్రజలు నమ్మొద్దని ఆయన కోరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలంలో ఆదివారం బండి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కట్టలింగంపేటలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు కుట్రలు చేస్తున్నాయని, బీజేపీ, బీఆర్‌ఎస్ పొత్తు పెట్టుకుంటాయన్న ప్రచారం నమ్మొద్దని కోరారు. స్వయం ప్రకటిత మేధావి గత ఎన్నికల్లో ఎక్కడి నుంచో వచ్చి కరీంనగర్‌లో పోటీ చేశాడని, ఇప్పుడు సైతం ఇక్కడ ఎంపీగా గెలుస్తానని కలలు కంటున్నాడని విమర్శించారు. మేడిగడ్డ ప్రాజెక్టు నాణ్యత లోపించి కూలేందుకు సిద్ధమైందని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, అవినీతి, అక్రమాలకు పాల్పడిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదో రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ రెండు నెలల పాలనతో ప్రజలు విసిగిపోయారని, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మోసపోయామని భావిస్తున్నారని తెలిపారు. ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

రేవంత్‌పై కేసు నమోదు చేయండి

బీఆర్‌ఎస్ నేత బాల్క సుమన్ డిమాండ్



సుమన్‌కు నోటీసులు అందజేస్తున్న ఎస్సై మహేందర్

సాక్షి, హైదరాబాద్/ మంచిర్యాల క్రైం: తాను చేసిన వ్యాఖ్యలపై కేసులు పెట్టిన ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై చేసిన పరుష వ్యాఖ్యలపై కూడా కేసు నమోదు చేయాలని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ డిమాండ్ చేశారు. ఇటీవల మంచిర్యాల బీఆర్‌ఎస్ సమావేశంలో ముఖ్యమంత్రిని పరుష పదజాలంతో దూషిస్తూ చెప్పుతో కొడతానని వేదికపైనే చెప్పు చూపించడంపై నమోదైన కేసులో మంచిర్యాల ఎస్ఐ మహేందర్ ఆదివారం హైదరాబాద్ శివారులోని క్యాంప్ ఆఫీసులో సుమన్‌ను కలిసి 41ఏ సీఆర్‌పీసీ నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సుమన్ మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఒక క్రిమినల్ అని, ఓటుకు నోటు కేసులో దొరికిపోయిన దొంగ అని వ్యాఖ్యానించారు. ఈ కేసులో సుప్రీంకోర్టు ఆయనకు నోటీసు కూడా ఇచ్చిందని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యం ప్రజాపాలన అంటే నిర్బంధం, నయవంచన అన్నట్టుగా తయారైందని, ఈ రాజకీయ కక్ష సాధింపు చర్యలను ఇప్పటికైనా ఆపేయాలని అన్నారు. ఉద్యమ నాయకుడు కేసీఆర్‌పై అడ్డగోలుగా మాట్లాడితే ఊరుకునేది లేదని, కేసులకు భయపడేది లేదని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా...

మే 23న ఎడ్‌సెట్.. జూన్ 4,5 తేదీల్లో ఐసెట్

ఈ రెండు పరీక్షలకు షెడ్యూల్ విడుదల చేసిన ఉన్నత విద్యామండలి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి జూన్ 4, 5 తేదీల్లో ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఉన్నత విద్యా మండలి పేర్కొంది. ఇందుకు సంబంధించి షెడ్యూల్‌ను ఆదివారం విడుదల చేసింది. మార్చి 5న నోటిఫికేషన్, 7నుంచి ఏప్రిల్ 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. ఆలస్య రుసుముతో మే 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని షెడ్యూల్‌లో పేర్కొంది. పూర్తి వివరాల కోసం https://icet. tsche. ac.inను చూడవచ్చని తెలిపింది.

మే 23న ఎడ్‌సెట్

రెండేళ్ల బీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి ఉమ్మడి ప్రవేశ పరీక్షను మే 23న నిర్వహిస్తున్నట్లు ఉన్నత విద్యా మండలి పేర్కొంది. మార్చి 4న నోటిఫికేషన్, మార్చి 6 నుంచి మే 13 వరకూ దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని వెల్లడించింది. పరీక్ష మే 23న ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ, సాయంత్రం 2 నుంచి 4 గంటల వరకూ ఉంటుందని పేర్కొంది.

బదిలీలు, పదోన్నతుల తర్వాతే కొత్త నియామకాలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈఏ లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో నియామకాల ప్రక్రియ కంటే ముందుగా బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం(టీఎస్‌డబ్ల్యూఆర్‌టీఈఏ) అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ బాలరాజు, ఎస్.దయాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి లేఖ ద్వారా తమ సమస్య విన్నవించారు. కొత్త నియామకాలతో గురుకులాలు మరింత బలోపేతం అవుతాయని, ఏళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు చేపడితే సీనియార్టీ ఆధారంగా కొత్త స్థానాల్లోకి వెళ్లే అవకాశాలతోపాటు ఎక్కువ ఆప్షన్లు దక్కుతాయన్నారు. కొత్త నియామకాల ప్రక్రియ తర్వాత బదిలీలు, పదోన్నతులు చేపడితే సీనియర్లకు ఆప్షన్లు తగ్గుతాయని పేర్కొన్నారు.

తెలుగులోనూ సీఏపీఎఫ్ పరీక్ష

దేశవ్యాప్తంగా 120 పట్టణాల్లో నిర్వహణ



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర సాయుధ పోలీసుల బలగాల (సీఏపీఎఫ్)లో కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల నిమిత్తం రాతపరీక్షను తెలుగులోనూ నిర్వహించనున్నట్లు కేంద్ర హోంశాఖ తెలిపింది. దేశవ్యాప్తంగా 120 పట్టణాల్లో ఫిబ్రవరి 20 నుంచి మార్చి 7వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఆంగ్లం, హిందీ కాకుండా తెలుగు సహా మరో 12 ప్రాంతీయ భాషల్లో పరీక్ష నిర్వహించడం ఇదే తొలిసారి.

ఎన్టీపీసీ తెలంగాణ రెండో యూనిట్ ట్రయల్‌రన్ సక్సెస్

72 గంటల్లో 819.8 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసిన టీఎస్‌టీపీపీ రెండో యూనిట్



ట్రయల్ ఆపరేషన్ సంబరాలు చేసుకుంటున్న ఎన్టీపీసీ అధికారులు

జ్యోతినగర్ (రామగుండం): ఎన్టీపీసీ రామగుండంలో చేపట్టిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (టీఎస్‌టీపీపీ) రెండో యూనిట్ 72 గంటలపాటు నిరంతర విద్యుదుత్పత్తి చేసింది. ఈ నెల 8 నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు నిరంతరంగా 819.8 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసింది. 72 గంటల ఫుల్ లోడ్ ట్రయల్‌రన్ విజయవంతమైనట్లు రామగుండం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) తోపాటు ఉన్నతాధికారులు ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఈ మేరకు ప్లాంట్ ఆవరణలో సంబరాలు చేసుకున్నారు.

సీవోడీ ప్రకటన తర్వాత గ్రిడ్‌కు అనుసంధానం

రెండవ యూనిట్ వివిధ దశల అనంతరం ట్రయల్ ఆపరేషన్ విజయవంతమై వాణిజ్యపరమైన ఉత్పత్తికి అర్హత సాధించినట్లు ఈడీ తెలిపారు. కాగా, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (సీహెచ్‌పీ), యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఏహెచ్‌పీ), వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (డబ్ల్యూటీపీ)లను ఆయన పరిశీలించారు. రెండో యూనిట్‌ను మరికొద్దిరోజుల్లో కమర్షియల్ ఆపరేటింగ్ డేట్ (సీవోడీ)ను ప్రకటించే అవకాశాలున్నాయని తెలిపారు. కాగా, సీవోడీ ప్రకటన తర్వాత విద్యుత్ కేంద్రాన్ని గ్రిడ్‌కు అనుసంధానం చేస్తారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు సురేశ్, సంజీబ్ సాహా, సంతోశ్ తివారి, మోహన్‌రెడ్డి, అలోక్ కుమార్ త్రిపాఠి, రవీంద్ర పటేల్, సింగరాయ తదితరులు పాల్గొన్నారు.

నీళ్ల 'మంటలు'

కృష్ణా ప్రాజెక్టుల అంశంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ సై అంటే సై

- ప్రజాభవన్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేల భేటీ.. హాజరైన సీఎం రేవంత్
- కృష్ణా ప్రాజెక్టులు, జలాలపై ఎమ్మెల్యేలకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
- సాగునీటి ప్రాజెక్టులపై నేడు అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేసే అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అధికార, విపక్షాల మధ్య నీళ్ల మంటలు మొదలయ్యాయి. కొన్నిరోజులుగా రాష్ట్ర రాజకీయాల్లో కృష్ణా జలాలు, కాళేశ్వరం, ఇతర ప్రాజెక్టుల అంశంపై తీవ్ర చర్చ జరుగుతుండగా.. సోమ, మంగళవారాల్లో జరగనున్న పరిణామాలు మరింత వేడిని పెంచుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, పలు ప్రాజెక్టుల నిర్మాణంపై నిర్లక్ష్యమంటూ బీఆర్‌ఎస్‌ను, ఆ పార్టీ ముఖ్యులను కాంగ్రెస్ సర్కారు టార్గెట్ చేసింది. మరోవైపు కాంగ్రెస్ సర్కారు వచ్చిన రెండు నెలల్లోనే రాష్ట్ర ప్రాజెక్టులను కేంద్రానికి, కృష్ణాబోర్డుకు అప్పజెప్పి, ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తోందంటూ బీఆర్‌ఎస్ మండిపడుతోంది. ఈ అంశాలపై అసెంబ్లీలో, బయటా ఇరుపార్టీల నేతలు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. మొత్తమ్మీద లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో రాజకీయంగా పైచేయి సాధించేందుకు ఇరు పార్టీలు సై అంటే సై అంటున్నాయి.

నేడు అసెంబ్లీలో చర్చ?

ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై చర్చించేందుకు అసెంబ్లీ సోమవారం సమావేశం కానుంది. ఈ క్రమంలోనే సాగునీటి ప్రాజెక్టులపై శ్వేతపత్రాన్ని ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ సర్కారు నిర్ణయించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, కృష్ణా ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించే దిశగా జరిగిన పరిణామాలు, గత పదేళ్లలో సాగునీటి వైఫల్యాలపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చర్చను ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి.



ఆదివారం ప్రగతిభవన్‌లో ప్రాజెక్టులపై నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

ప్రజాభవన్‌లో 'ప్రజెంటేషన్'

మరోవైపు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సాగునీటి ప్రాజెక్టులు, జలాల అంశంపై ఆదివారం ప్రజాభవన్‌లో అవగాహన కల్పించారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మంత్రి ఉత్తమ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా.. కృష్ణా, గోదావరి బేసిన్లలో నీటి లభ్యత, తెలంగాణ వినియోగం, చేపట్టిన ప్రాజెక్టులు, వాటి పురోగతిని వివరించారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి, నిర్లక్ష్యం జరిగిందని వివరించారు. ఈ సమావేశం తర్వాత ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడారు. కృష్ణాజలాలపై సోమవారం అసెంబ్లీలో స్పష్టత ఇస్తామని, నల్లగొండలో బీఆర్‌ఎస్ సభ మొదలయ్యే లోపే తెలంగాణ ప్రజలకు వాస్తవాలను వివరిస్తామని చెప్పారు. కేసీఆర్ చేసిన అన్యాయంతో దక్షిణ తెలంగాణ ఎడారిగా మారే ప్రమాదం నెలకొందని ఆరోపించారు.

మేడిగడ్డ సందర్శనకు తీసుకెళ్తామంటూ..

బీఆర్‌ఎస్ నల్లగొండ సభకు కౌంటర్‌గా కాంగ్రెస్ సర్కారు ఎమ్మెల్యేల మేడిగడ్డ సందర్శన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించింది. కాళేశ్వరం అవినీతిపై చర్చను పక్కదోవ పట్టించేందుకే బీఆర్‌ఎస్ కృష్ణా ప్రాజెక్టుల అంశాన్ని లేవనెత్తుతోందని ఆరోపిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి.. కాళేశ్వరం అవినీతి అంశంపై క్షేత్రస్థాయిలో చర్చజరిగేలా చూడాలని ఇప్పటికే కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే మేడిగడ్డ పర్యటన ఏర్పాటుచేసి.. బ్యారేజీ సందర్శనకు రావాల్సిందిగా అసెంబ్లీలోని అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించారు. మంగళవారం (13న) ఉదయం అసెంబ్లీ నుంచే ప్రత్యేక బస్సుల్లో ఎమ్మెల్యేలను మేడిగడ్డకు తీసుకెళతామని చెప్పారు. ఈ సందర్శనకు వచ్చే విషయంలో కాంగ్రెస్, సీపీఐ మినహా ఇతర పార్టీలు బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం తమ నిర్ణయాన్ని వెల్లడించలేదు.

తప్పు కప్పిపుచ్చుకునే డ్రామాలు

తెలంగాణకు అన్యాయం చేసిన మాజీ సీఎం కేసీఆర్.. తన తప్పును కప్పిపుచ్చుకొనేందుకు సభలంటూ డ్రామాలు ఆడుతున్నారని టీపీసీసీ కిసాన్‌సెల్ మండిపడింది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా కేసీఆర్ దిష్టిబొమ్మల దహనానికి పిలుపునిచ్చింది.

నల్లగొండ బీఆర్‌ఎస్ సభకు చురుగ్గా ఏర్పాట్లు

కృష్ణా ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించడాన్ని నిరసిస్తూ.. మంగళవారం నల్లగొండ పట్టణ శివార్లలోని మర్రిగూడ బైపాస్‌రోడ్డు వద్ద సభ నిర్వహించాలని బీఆర్‌ఎస్ నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనికి చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఈ సభకు హాజరవుతుండటంతో పెద్ద ఎత్తున జన సమీకరణ కోసం గులాబీదళం ప్రయత్నిస్తోంది. నల్లగొండతోపాటు మహబూబ్‌నగర్, ఖమ్మం, గ్రేటర్ హైదరాబాద్ పరిధి నుంచి జనాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత కేసీఆర్ తొలిసారి సభలో ప్రసంగించనుండటంతో.. ఆయన ఏం మాట్లాడతారన్నది ఆసక్తిగా మారింది.



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి

కేసీఆర్ క్షమాపణలు చెప్పాకే నల్లగొండకు రావాలి

గత పదేళ్లలో జిల్లాలోని ప్రాజెక్టులేవీ పూర్తిచేయలేదు: కోమటిరెడ్డి బ్రదర్స్

నల్లగొండ/ చండూరు: కేసీఆర్ పదేళ్ల పాలనలో నల్లగొండ జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేయకుండా మోసం చేశారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఆయన సోదరుడు, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మండిపడ్డారు. మొదట కేసీఆర్ నల్లగొండ జిల్లా ప్రజలకు క్షమాపణలు చెప్పాకే నల్లగొండకు రావాలని వ్యాఖ్యానించారు. నల్లగొండలోకి క్యాంపు కార్యాలయంలో వెంకటరెడ్డి మీడియాతో మాట్లాడారు. కుర్చీ వేసుకుని కూర్చుని ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేస్తానని కేసీఆర్ మాట ఇచ్చి తప్పారని.. అది పూర్తయి ఉంటే నల్లగొండ జిల్లాకు ఇలాంటి కరువు పరిస్థితులు వచ్చేవి కావని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ సభ నిర్వహించే రోజే నల్లగొండ పట్టణంలోని గడి యారం సెంటర్‌లో కుర్చీ వేసి, దానిమీద గులాబీ కండువా కప్పి, కేసీఆర్ చిత్రం పెట్టి నిరసన తెలుపుతామన్నారు.

బీఆర్‌ఎస్ సభను బహిష్కరించండి: రాజగోపాల్‌రెడ్డి

ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడానికే కేసీఆర్ నల్లగొండలో సభ పెడుతున్నారని.. ఆ సభను పార్టీలకు అతీతంగా బహిష్కరించాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా చండూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్‌కు నైతిక విలువలేమైనా ఉంటే రాజకీయాల నుంచి తప్పుకోవాలన్నారు. కాగా.. కాంగ్రెస్ ముఖ్యుల పిలుపు మేరకు బీఆర్‌ఎస్ సభకు నిరసనగా జిల్లా కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి.

చేనేతకు పూర్వ వైభవం తీసుకొస్తాం

చేనేత, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కాచిగూడ (హైదరాబాద్): చేనేత రంగాన్ని ఆదుకోవడంతో పాటు పూర్వ వైభవం తీసుకొస్తామని రాష్ట్ర చేనేత, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం నారాయణ గూడ పద్మశాలి భవన్‌లో జరిగిన తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్ష ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కమర్తపు మురళి పద్మశాలి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మంత్రి మాట్లాడారు. గత ప్రభుత్వానికి భిన్నంగా చేనేత కార్మికుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తుందని అన్నారు. చేనేత కార్మికుల సమస్యలను సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి మాట్లాడుతూ.. ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల కోసం సంఘ ప్రతినిధులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎల్.రమణ, గడ్డం జగన్నాథం, రాపోలు ఆనంద భాస్కర్, గుండు సుధారాణి, ఈరవత్రి అనిల్, పొన్నాల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సోదరుడిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు

- బాధితుడి పరిస్థితి విషమం
- ఆస్తి తగాదాలే కారణం



శ్రీనివాస్‌కు నిప్పంటిస్తున్న వినోద్

కంటోన్మెంట్(హైదరాబాద్): ఆస్తి తగాదాలతో వరుసకు సోదరుడైన ఒక వ్యక్తిపై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన సికింద్రాబాద్ ప్రాంతంలోని బోయిన్‌పల్లి పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. 70 శాతం గాయాలతో గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. బోయిన్‌పల్లి కంసారిబజార్ రామమందిరం సమీపంలో కందికొండ సత్తయ్య, ముత్తయ్యలకు నివాసస్థలం ఉంది. ముత్తయ్య కుమారుడు శ్రీనివాస్(62) ఇటీవల తన తండ్రి ద్వారా సంక్రమించిన స్థలంలో ఇంటినిర్మాణం చేపట్టి అద్దెకు ఇచ్చాడు. తాను సమీపబస్తీలో నివాసం ఉంటున్నాడు. కంసారి బజార్‌లో తన ఇంటి పక్కనే వరుసకు సోదరుడైన వినోద్ (సత్తయ్య కుమారుడు) మరో ఇంటిలో నివాసముంటున్నాడు. వీరిద్దరి ఇళ్ల నడుమ ఉన్న చిన్నపాటి సందు గుండానే శ్రీనివాస్ ఇంటికి దారి ఉంది. ఈ స్థలం విషయంలోనే వీరి మధ్య వివాదం నెలకొంది. ఈ క్రమంలో ఆదివారం శ్రీనివాస్ అద్దె వసూలు నిమిత్తం తన ఇంటికి వచ్చి తిరిగి వెళ్తుండగా వినోద్ అతడిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. తన అన్నను చంపానంటూ అరుస్తూ పారిపోయాడు. శ్రీనివాస్‌ను గాంధీ ఆసుపత్రికి తరలించారు. గాంధీ ఆసుపత్రిలో శ్రీనివాస్ వాంగ్మూలం ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్



బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ డిగ్రీ (బీఏ/బీకాం/బీఎస్సీ) కోర్సులు, పీజీ (ఎంఏ/ఎంకాం/ ఎంఎస్సీ) కోర్సులు, బీ.లిస్క్, ఎం.లిస్క్, పీజీ డిప్లొమా, పలు సర్టిఫికెట్ కోర్సుల్లో 2023-24 విద్యా సంవత్సరం ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల అయినట్లు విద్యార్థి సేవల విభాగ డైరెక్టర్ డాక్టర్ ఎల్వీకే రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కోర్సుల్లో చేరడానికి విద్యా ర్హతలు, ఫీజు, కోర్సులు తదితర వివరాలను www.braouonline.in, www.braou.ac.inలో పొందవచ్చని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ చివరి తేదీ ఫిబ్రవరి 29 అని, అలాగే రూ. 200ల ఆలస్య రుసుముతో మార్చి 31 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా డిగ్రీ, పీజీ ప్రవేశాల కోసం నమోదు చేసుకోవాలని సూచించారు. అడ్మిషన్/ ట్యూషన్ ఫీజును క్రెడిట్/డెబిట్ కార్డు ద్వారా లేదా టీఎస్/ఏపీ ఆన్‌లైన్ ఫ్రాంఛైజ్ సెంటర్ల ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు. పూర్తి సమాచారం కోసం సమీపంలోని అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని లేదా విశ్వవిద్యా లయ హెల్ప్‌డెస్క్ నెంబర్లు 73829 29570/ 580, 040-23680222/333/555లో సంప్రదించవచ్చని సూచించారు.

బడ్జెట్‌లో బీసీ సబ్‌ప్లాన్ ఊసేదీ?

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మహాత్మా జ్యోతిబా పూలే పేరుతో బీసీ సబ్‌ప్లాన్‌ను తీసుకొస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో వాగ్దానం చేసినా.. రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ సబ్‌ప్లాన్ ఊసే లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సంక్షేమానికి ప్రతి ఆర్థిక సంవత్సరంలో రూ.20 వేల కోట్ల చొప్పున అయిదేళ్లలో రూ.లక్ష కోట్లు కేటాయిస్తామని కాంగ్రెస్‌పార్టీ హామీ ఇచ్చిందని ఆదివారం ఒక ప్రకటనలో గుర్తు చేశారు. రాష్ట్రంలో 60% జనాభా ఉన్న బీసీల సంక్షేమానికి రూ.8000 కోట్లు కేటాయించారని, ఇది బీసీల అభివృద్ధికి ఏమాత్రం సరిపోదని అభిప్రాయపడ్డారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో పోలిస్తే కాంగ్రెస్ పార్టీ బీసీల సంక్షేమానికి నిధులు పెంచినా ఆశించిన మేర లేవన్నారు. బీసీ గురుకులాల సొంత భవనాలకు రూ.1,500 కోట్లు కేటాయించడం అభినందనీయమని పేర్కొన్నారు.

'ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక' అధ్యక్షురాలిగా అనిశెట్టి రజిత



అనిశెట్టి రజిత



మానస ఎండ్లూరి

ఖమ్మం గాంధీచౌక్: ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్ర.ర.వే.) జాతీయ, రెండు తెలుగు రాష్ట్రాల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఖమ్మంలో జరిగిన మహాసభల్లో ఎన్నుకున్నారు. వేదిక జాతీయ కమిటీ అధ్యక్షురాలిగా అనిశెట్టి రజిత, కార్యదర్శిగా మానస ఎండ్లూరి, సమన్వయకర్త పి.రాజ్యలక్ష్మి, కోశాధికారిగా రామలక్ష్మి కొమ్రాజు ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలిగా తిరునగరి దేవకీదేవి, కార్యదర్శిగా కాత్యాయనీ విద్మహే, సమన్వయకర్తగా బండారి సుజాత, నియామక ప్రతినిధిగా తాళ్లపల్లి యాకమ్మ, కార్యవర్గ సభ్యులుగా శాంతి ప్రబోధ, షమనాజ్ బేగంను, ఏపీ అధ్యక్షురాలిగా పి.అమర జ్యోతి, కార్యదర్శిగా కేఎస్ మల్లీశ్వరి, సమన్వయకర్తగా కావూరి శారద, నియామక ప్రతినిధిగా జహా ఆరా, కార్యవర్గ సభ్యులుగా మందరపు హైమావతి, రచన శృంగవరపు, లక్ష్మీ సుహాసిని ఎన్నికయ్యారు. ట్రోలింగ్‌లో తాము ఎదుర్కొన్న సమస్యలు, వాటిని అధిగమించిన తీరు గురించి పలువురు ప్రతినిధులు వెల్లడించారు. ట్రోలింగ్‌పై ఆర్థిక, రాజకీయాల ప్రభావం ఉందన్నారు. ట్రోలింగ్‌కు కొన్ని వర్గాలు పైకాన్ని కూడా చెల్లిస్తున్నాయని, ఒక్కో తిట్టుకు రూ.12 నుంచి రూ.18 చొప్పున ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. చర్చల్లో రచయిత్రులు రాజ్యలక్ష్మి, సుజాత సూరేపల్లి, తులసి చందు, వనజ, మెర్సీ మార్గరెట్, కేఎస్ మల్లీశ్వరీ, శాంతి ప్రబోధ, అరుణగోగుల్ మండ, స్వేచ్ఛ, సత్యవతి, శ్రీదేవి, బైరి నరేశ్ మాట్లాడారు.

గడువు పొడిగించేది లేదు

డిస్కంలకు ఈఆర్‌సీ ఝలక్! ● జనవరి 31తో ఏఆర్‌ఆర్, టారిఫ్ ప్రతిపాదనలకు ముగిసిన గడువు

- సత్వరమే ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశం
- రోజుకి రూ.5000 చొప్పున జరిమానా చెల్లించక తప్పని పరిస్థితి


సాక్షి, హైదరాబాద్: ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు పొడిగించేది లేదంటూ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్‌సీ) ఝలక్ ఇచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిస్కంల వార్షిక ఆదాయ అవసరాలు(ఏఆర్‌ఆర్), టారిఫ్ ప్రతి పాదనలు సమర్పించేందుకు జనవరి 31తో గడువు ముగిసింది. మరో మూడు నెలలు పొడిగించాలని డిస్కంలు చేసిన విజ్ఞప్తిని ఈఆర్‌సీ తోసిపుచ్చింది. మల్టీ ఈయర్ టారిఫ్(ఎంవైటీ) రెగ్యులేషన్స్ ప్రకారం సత్వరమే ఏఆర్‌ఆర్, టారిఫ్ ప్రతిపాదనలు సమర్పించాలని డిస్కంలకు ఆదేశించింది. ఏఆర్‌ఆర్, టారిఫ్ ప్రతిపాదనలు గడువులోగా సమర్పించడంలో విఫలమైతే డిస్కంలపై రోజుకు రూ.5000 చొప్పున జరిమానా విధించాలని ఎంవైటీ రెగ్యులేషన్స్ స్పష్టం చేస్తున్నాయి.

ఇప్పటికే రెండుసార్లు పొడిగింపు

ప్రతి ఏటా నవంబర్ 31లోగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఏఆర్‌ఆర్, టారిఫ్ ప్రతిపాదనలు ఈఆర్‌సీకి డిస్కంలు సమర్పించాలి. దాని ఆధారంగా వినియోగదారులకు ఎన్ని మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేయాలి? దానికి ఎంత అవుతుంది ? ప్రస్తుత విద్యుత్ టారిఫ్‌తోనే వినియోగదారుల నుంచి బిల్లులు వసూలు చేస్తే వచ్చే ఆదాయం ఎంత? అవసరమైన ఆదాయం, వచ్చే ఆదాయం మధ్య ఉండే వ్యత్యాసం(ఆదాయ లోటు) ఎంత? రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే విద్యుత్ సబ్సిడీలు పోగా, మిగిలే ఆదాయలోటు భర్తీ చేసేందుకు ఏ మేరకు విద్యుత్ చార్జీలు పెంచాలి ? వంటి అంశాలు ఏఆర్‌ఆర్, టారిఫ్ ప్రతిపాదనల్లో ఉంటాయి. ఈ ప్రతిపాదనలపై ఈఆర్‌సీ రాతపూర్వకంగా అభ్యంతరాలు స్వీకరించడంతో పాటు హైదరాబాద్, వరంగల్‌లో బహిరంగ విచారణ నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతుంది. అనంతరం కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందు ఆ సంవత్సరంలో వసూలు చేయాల్సిన విద్యుత్ టారిఫ్ ఉత్తర్వులు జారీ చేస్తుంది. వినియోగదారుల కేటగిరీల వారీగా పెరిగిన/తగ్గిన విద్యుత్ చార్జీల పట్టిక ఇందులో ఉంటుంది. గతేడాది నవంబర్ 31లోగా ఏఆర్‌ఆర్, టారిఫ్ ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉండగా, రాష్ట్ర శాసనసభ ఎన్నికల పేరుతో అప్పట్లో డిస్కంలు డిసెంబర్ 2 వరకు గడువు పొడిగింపు పొందాయి. విద్యుత్ టారిఫ్ ఖరారుకు సంబంధించిన కీలకమైన మార్గదర్శకాలతో మల్టీ ఈయర్ టారిఫ్ రెగ్యులేషన్స్‌ను ఆ తర్వాత కాలంలో ఈఆర్‌సీ ప్రకటించింది. ఈ కొత్త మార్గదర్శకాలపై అధ్యయనం జరిపి ఏఆర్‌ఆర్, టారిఫ్ ప్రతిపాదనలు సమర్పించడానికి జనవరి 31వరకు రెండోసారి గడువు పొడిగించింది.

డిస్కంల యాజమాన్యాలు తర్జనభర్జన

రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐఏఎస్ అధికారులను సీఎండీలుగా నియమించింది. మరో రెండు నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. దీనికి తోడు కొత్త ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచడానికి అనుమతించినట్టు తప్పుడు సంకేతాలు పోతాయని ప్రభుత్వవర్గాల్లో ఆందోళన నెలకొని ఉంది. డిస్కంల ఆర్థిక నష్టాలు రూ.50,275 కోట్లకు, అప్పులు రూ.59,132 కోట్లకు పెరిగినట్టు ఇటీవల రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టిన శ్వేతపత్రంలో ప్రభుత్వం వెల్లడించింది. ఈ నేపథ్యంలో విద్యుత్ చార్జీల పెంపు అనివార్యంగా మారిందని అధికారులు అంటున్నారు. మరోవైపు కొత్త ప్రభుత్వం నుంచి అనుమతి పొంది ప్రతిపాదనలు సమర్పించే విషయంలో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.



వాస్తవాలు లేవు.
ఉన్నవల్లా వ్యాఖ్యానాలు మాత్రమే!
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి

సోమవారం, 12 ఫిబ్రవరి 2024

పాటకు పట్టం

'పాట' అనే మాటలో ఎన్ని ఉద్వేగాల ఊటలో! ఎన్ని ఉద్రేకాల తంత్రులో! ఎగిసిపడి ఎదను రసప్లావితం చేసే ఎన్నెన్ని పారవశ్యాల జలయంత్రాలో! ప్రతి రాత్రీ వసంతరాత్రిగా, ప్రతి గాలీ పైరగాలిగా, బతుకంతా పాటలా సాగాలంటాడు ఒక కవి. ఏదో ఒక పాట వింటూనే జీవితం గడుపుతాం. చెవులను, మనసును తాకి హాయి గొలిపే పాటల తుంపరలలో తడుస్తూనే జీవన రహదారిలో సాగుతాం. మరి, బతుకే పాటైన మేటి పాటగాళ్ళ సంగతేమిటి! కాలికి గజ్జె కట్టి బుజాన కంబళి వేసుకుని జీవితమే ఆటగా, పాటగా గడిపిన గద్దర్లు; పాటల వియద్గంగలో జీవితాంతం మునకలేసిన వంగపండులు, పలుకే పాటై జీవనదిలా ప్రవహించే అందెశ్రీలు, పాటను పుక్కిటపట్టి రాగమే జీవనరాగంగా బతుకును పండించుకుంటున్న గోరటి వెంకన్నలు... చెప్పుకుంటూ వెడితే ఒకరా ఇద్దరా! ఆపైన, సినీగీతాన్ని వినీలాకాశానికెత్తిన కృష్ణశాస్త్రులు, శ్రీశ్రీలు, ఆత్రేయలు, సినారేలు, ఆరుద్రలు, వేటూరులు..!

పేరుకు పాటైనా తీరులు ఎన్నో! కొన్ని పాటలు జాతి మొత్తంలో ఉత్తేజపు విద్యుత్తును నింపి ఉద్వేగాల అంచుల వైపు నడిపిస్తాయి. జనగణమన లాంటి అలాంటివి జనరంజకమై జాతి గళమెత్తి పాడుకునే గీతాలు అవుతాయి. తెలంగాణ ఉద్యమంతోపాటు ఉవ్వెత్తున ఎగసిన ఉద్రేకపు పొంగు పాటగా మారి అందెశ్రీ ఆలపించిన 'జయజయహే తెలంగాణ' గీతానికి ఇటీవల తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రగీతం ప్రతిపత్తిని ఇచ్చి తనను తాను గౌరవించుకుంది. పాటలో పలికించలేని రసమే లేదు. ప్రజోద్యమాల అగ్నిశిఖలలోంచి నిప్పురవ్వల్లా పుట్టుకొచ్చిన పాటే ప్రేయసీప్రియుల యుగళగీతంగా మారి మోహరాగాలతో విరితావులనీనగలదు. 'నీవే నేనుగా ఒకటైన చోట' 'వలపుల పూదోట' పూయించగలదు. మనిషైతే మనసుంటే కనులు కరగాలని, కరుణ కురియాలని, జగతి నిండాలని ప్రబోధిస్తూ; ప్రకృతి సమస్తంలో ఇమిడి ఉన్న కారుణ్యాన్ని జాలిజాలిగా కరిగే నీలిమేఘం మీదుగా రూపుగట్టి మనల్ని నిలువునా కదిలించి కరిగించగలదు. తూరుపు సిందూరపు మందారపు వన్నెలలోని ఉదయరాగానికి చూపుల్ని, హృదయగానానికి చెవుల్ని అప్పజెబుతూనే కాలగర్భం లోలోతులకు వెళ్లి వేనవేల వత్సరాల కేళిలో మానవుడుదయించిన శుభవేళను – మలయ మారుతాలతో, పుడమి పలుకు స్వాగతాలతో, తారకలే మాలికలై మలచిన కాంతితోరణాలతో ఉత్సవీకరించి మన కళ్ళముందు నిలపగలదు. 'చిరునవ్వు వెన్నెల్లు చిలికేటి వాడా, అరుదైన చిరుముద్దు అరువియ్య రారా' అంటూ; 'అల్లారు ముద్దుకదే, అపరంజి ముద్దకదే... ఒంటరి బతుకైనా ఓపగలుగు తీపికదే' అంటూ పాట లాలిగా జోలగా మారి వాత్సల్య రసంలో ఓలలాడించగలదు.

పాటను కైకట్టిన ఆదికవి 'అమ్మ' అంటారు అందెశ్రీ. నేల పొరలను చీల్చుకుని విత్తనం రెండు ముక్కలుగా పగిలి మొలకెత్తినట్లుగా ప్రకృతిమాత పొత్తిళ్ళల్లో కవలశిశువులుగా ప్రాణి పుట్టుక, పాట పుట్టుక అంటూ పాటను సృష్ట్యాదిన ప్రతిష్ఠిస్తారు. గగనాంతరసీమ గానసమూహమై పాటందుకుంటే, నేల రంగస్థలమై ఆటందుకుందంటారు. ప్రకృతి పురుషులు కేళీవిలాసాల్లో తేలుతున్న వేళ జంతుధ్వనుల నుంచి పుట్టిన సప్తస్వరాల అన్వయింపే ఏ పాట అయినా అంటూ పాటల భిన్నత్వంలోనే ఏకత్వాన్ని రూపిస్తారు. పురామానవ పరిణామ కోణం నుంచి గ్రీకు సాహిత్యాన్ని, ఇతర యూరోపియన్ భాషల సాహిత్యంతో బేరీజు వేస్తూ చర్చించిన జార్జి థామ్సన్ అనే పండితుడు కూడా విచిత్రంగా ఇలాగే పాటను సాహిత్యపు ఆదిమదశలో నిలుపుతాడు. ఆధునిక ఇంగ్లీష్ కవిత్వానికి భిన్నంగా గ్రీకు కవిత్వం పాడుకోవడానికి వీలుగా ఉంటుంది. గ్రీకు మహాకవి హోమర్ కవిత్వం మన వాల్మీకి రామాయణంలానే తంత్రీలయ సమన్వితంగా ఉంటుంది. వ్యాసభారతం కూడా వాగ్రూపంలో విస్తరించి చివరికి లిఖితరూపం పొందినదే. అలా చూసినప్పుడు నేటి మన పాటకవులందరూ వ్యాసవాల్మీకి పరంపరలోకే వస్తారు. లిఖితరూపంలోకి వచ్చాక కవిత్వం కాళిదాసాదులతో భిన్నమైన మలుపు తిరిగింది.

తెలుగులో ఆధునిక కవిత్వం ఆదిలో పాటకు ప్రతిరూపంగా ఎలా వెలువడిందో వివరిస్తూ, అనంతరకాలంలో తెలుగునాట పాటకు ప్రచురణార్హత, కవితకు శ్రవ్యార్హత లేకుండా చేశారని అంబటి సురేంద్రరాజు ఆవేదన వ్యక్తం చేస్తారు. కంటితో చదవడం కన్నా, చెవితో వినడమే కవితకు స్వాభావికమంటాడు. నిన్నమొన్నటి వరకు ఐరిష్ కవిత్వం ప్రధానంగా ఆశుసంప్రదాయాన్నే అనుసరించిందని జార్జి థామ్సన్ కూడా చెబుతూ; మొదట అచ్చులో చదివిన కొన్ని ఐరిష్ కవితలను ఆ తర్వాత ఒక రైతుగాయకుని నోట వినడం తనకు అపూర్వమైన అనుభవంగా వర్ణిస్తాడు. నిరక్షరాస్యులైన ఐరిష్ గ్రామీణుల పెదాలపై కవిత్వం నర్తిస్తూ ఉంటుందని, వారు మాట్లాడే మామూలు మాటలు కూడా కవితాత్మకంగా మారిపోతాయని అంటాడు. సామూహిక శ్రమలో భాగంగా పుట్టిన వాక్కు కవితాత్మకంగా మారి శ్రమకు చోదకంగా మారిందనీ, ఆదిమ కాలంలో పనిలో భాగంగా పాట పుట్టింది తప్ప కేవలం తీరిక సమయాల్లో పాడుకునేందుకు కాదంటాడు.

పూర్తిగా లిఖిత సంప్రదాయంలో పెరిగిన కవిత్వం ఆలోచనామృతం కావచ్చు కానీ, సద్యస్పందన కలిగించే పాట ఆలోచనామృతమే కాక ఆపాతమధురం కూడా. ప్రజాక్షేత్రంలో, ప్రజలే ప్రభువులుగా ఉన్న ప్రజాస్వామ్యంలో సామాన్యజనం సహా అందరినీ ఉర్రూతలూగించే పాటకు పట్టం కట్టడం ఎంతైనా సముచితమూ, స్వాగతార్హమూ. పాట కవులందరికీ కోటిదండాలు.

లౌకిక వాదానికి హిందుత్వ వారధి

కామెంట్



కరణ్ థాపర్

'భారతరత్న' లభించడంతో వార్తలలోకి వచ్చిన బీజేపీ రాజకీయ దిగ్గజం లాల్ కృష్ణ అద్వానీ విలక్షణమైన నాయకుడు. ఆయన మాటల్లో దాపరికాలు ఉండవు. తన తప్పును అంగీకరించడానికి భేషజ పడటం ఉండదు. అవసరం అయితే క్షమాపణ అడిగేందుకు కూడా సుముఖంగా ఉంటారు! స్వచ్ఛమైన, సరళమైన జాతీయవాదం కోసం నిలబడిన నాయకుడాయన. హైందవ దుస్తుల్ని తొలగించుకున్న దిగంబర జాతీయవాదం అర్థం లేనిదని ప్రగాఢంగా విశ్వసిస్తారు. ఆయనంతటి ఆత్మనిశ్చయం గల శక్తిమంతులు ఓ గుప్పెడు మంది మాత్రమే కనిపిస్తారు. పరస్పర వైరుధ్యం కలిగిన హిందుత్వానికి, లౌకికవాదానికి మధ్య వారధి నిర్మించే ప్రయత్నంలో అద్వానీ... లోకమాన్య తిలక్, గాంధీజీల దృక్పథాన్ని అనుసరించారు.

నాకు చాలాకాలంగా, అతి సన్నిహితంగా పరిచయం ఉన్న భారతీయ జనతా పార్టీ నాయకుడు – ఆయన ద్వారా ఆయన కుటుంబం కూడా – లాల్ కృష్ణ అద్వానీ అని నేను నిస్సందేహంగా చెప్పగలను. ఒక కాలం ఉండేది... నేను ఆయన విశ్వాసాన్ని స్పష్టంగా గెలుపొందిన కాలం; కొన్ని ప్రత్యేకమైన సందర్భాలలో నా సలహాను సైతం ఆయన తీసుకున్న కాలం. ఆ క్రమంలో ఆయన నన్ను భారత రాజకీయాలలోని గుంభనమైన అంతర్గత కార్యకలాపాలపైన కూడా నా దృష్టి చొరబాటును అనుమతించారు.

ఇప్పుడు ఆయనకు 'భారతరత్న' లభించడంతో ఆయనతో నా మొదటి ఇంటర్వ్యూ నా మదికి, మననానికి వచ్చింది. ఆయన్ని నిజమైన ప్రత్యేక రాజకీయ నాయకుడిగా మార్చిన ఆయనలోని లక్షణాలను సంగ్రహించిన ఇంటర్వ్యూ అది. తన మాటల్లో దాపరికాలు లేకుండా, నిజాయితీగా ఉండే నాయకుడు మాత్రమే కాదాయన... తన తప్పుల్ని అంగీకరించడానికి సైతం సుముఖంగా ఉండేవారు. అవసరం అయితే 'మన్నింపు'ను కోరేవారు. ఆయన లాంటి రాజకీయ నాయకులు అతికొద్ది మంది మాత్రమే నాకు తెలుసు.

1990లో అద్వానీ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఆ ఇంటర్వ్యూ జరిగింది. అప్పుడు నేను – ఆ ముందరే ఇండియాకు తిరిగి వచ్చిన – ఒక అనామక జర్నలిస్టుని. 'హిందూస్థాన్ టైమ్స్ ఐవిట్నెస్' ప్రారంభ ఎపిసోడ్ కోసం ఆ ఇంటర్వ్యూను చేశాన్నేను. డిసెంబరు నాటి ఒక అహ్లాదకరమైన అపరాహ్నవేళ అద్వానీ పండారా పార్క్ నివాసంలో ఆయనతో కలిసి కూర్చున్నాను. మరీ దీర్ఘంగా ఏం కాదు, బహుశా కేవలం పది నిముషాలు మా మధ్య సంభాషణ జరిగినట్లుంది. అందులోని చిన్న భాగం ఇది:

కరణ్ థాపర్: మీరు అధికారంలో ఉండి ఉంటే కనుక ఇండియాను హిందూ దేశంగా మార్చేవారా? ఒక అధికారిక హిందూ దేశంగా?

ఎల్.కె. అద్వానీ: ఇంగ్లండ్ క్రైస్తవ దేశం అయినట్లే, ఇండియా హిందూ దేశం అని నేను నమ్ముతాను. ఇందులో ఎక్కువ తక్కువలేం లేవు.

''మీరు మాటలతో ఆడుకుంటారనే భావన చాలామందిలో ఉంది. కాబట్టి హిందుత్వం అంటే అర్థం ఏంటో చెప్పండి? హిందుత్వం కోసం మీరు నిలబడతారా, లేక తడబడతారా? హిందుత్వానికి మీరు అనుకూలమేనా?''

''నేను స్వచ్ఛమైన, సరళమైన జాతీయవాదం కోసం నిలబడతాను. కానీ తన హైందవ దుస్తుల్ని తొలగించుకున్న దిగంబర జాతీయవాదం అర్థం లేనిదని నమ్ముతాను. ఇంతకు మించి చెప్పేదేం లేదు.''



ఎల్.కె. అద్వానీకి ప్రధాని మోదీ శుభాభివందనాలు (ఫైల్ ఫొటో)

''ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడుకుందాం. కచ్చితంగా ఇదీ అని చెప్పండి. మీరు కోరుకుంటున్నది లౌకిక భారతదేశాన్నా లేక హిందూ భారతదేశాన్నా?''

''నిశ్చయంగా, నిజాయితీగా నేను లౌకిక భారతదేశం కోసమే నిలబడతాను.''

''అక్కడే సమస్య వస్తోంది మిస్టర్ అద్వానీ. చాలామంది ప్రజలు మీరు అనుకూలంగా ఉన్న హిందుత్వకు, మళ్లీ మీరే అనుకూలంగా ఉన్న లౌకికవాదానికి మధ్య తీవ్రమైన వైరుధ్యాన్ని చూస్తున్నారు. ఎక్కువ మంది ప్రజలు మీరు వంతెన వేయలేరని అనుకుంటున్న వాటికి మీరు వంతెన వేయటానికి ప్రయత్నిస్తున్నారు.''

''నేను విశ్వసిస్తున్నది లౌకికవాదం పట్ల నెహ్రూకి, లేదా సర్దార్ పటేల్‌కు ఉన్న దృక్పథాన్ని కాదు. లోకమాన్య తిలక్‌కు, గాంధీకి ఉన్నటువంటి దానిని. అయితే ఈ దృక్పథాన్ని గత నాలుగు దశాబ్దాలలో ఎన్నికల ప్రయోజనాలు వక్రీకరిస్తూ వచ్చాయి.''

''భారతదేశంలోని పది కోట్లమంది ముస్లింల పట్ల మీ వైఖరి ఏమిటి? వారు ఈ దేశంలోని విడదీయరాని భాగం అని మీరు విశ్వసిస్తారా?''

''కచ్చితంగా. కచ్చితంగా. నిస్సంకోచంగా.''

''అప్పుడైతే, దేశంలోని దాదాపు 3,000 మసీదులను కూల్చివేసి వాటి స్థానంలో దేవాలయాలు నిర్మించాలనే వీహెచ్‌పీ డిమాండ్‌కు వ్యక్తిగతంగా మీరు వ్యతిరేకం అని నేను నమ్మొచ్చా?''

''నేను వ్యతిరేకమే.''

''పూర్తిగా?''

''పూర్తిగా.''

కావలిస్తే ఈ సంభాషణను మళ్లీ చదవండి. ప్రశ్నల దృఢత్వాన్ని, జవాబులలోని నిజాయితీని గమనించండి. అద్వానీ తర్వాతి నాయకులలో ఎవరితోనైనా ఇలాంటి సంభాషణ ఈరోజు సాధ్యం అవుతుందని నేను అనుకోను. వాళ్లు దీనిని ఏమాత్రం సహించలేరు. లేచి వెళ్లిపోతారు.

అయితే అసలు విషయం, ఇంటర్వ్యూ తర్వాత ఏం జరిగిందన్నది. తర్వాత నేను అద్వానీని కలిసినప్పుడు ''ఇంటర్వ్యూ గురించి మీరేమనుకుంటున్నారు?'' అని అడిగాను. అందుకు ఆయన కఠినమైన పలుకులతో... అదొక హాస్యాస్పదం అని కొందరు తనతో అన్నట్లు చెప్పి, ఒక్కసారిగా వెనుదిరిగి అక్కడి నుంచి వెళ్లిపోయారు!

ఆయన ప్రవర్తన నన్ను నిరుత్తరుడిని చేసింది. ఆయనకు ఇంటర్వ్యూ వీడియోను పంపి, స్వయంగా తననే చూడమని కబురు పెట్టాను. ఆయన్ని ఎవరో తప్పుదారి పట్టించారని నా నమ్మకం.

వారాలు, నిజానికి నెలలు గడిచినా ఆయన్నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. నేను కూడా వస్తుందని ఎదురు చూడటం మానేశాను. హఠాత్తుగా... చీకటి పడుతున్న ఒక వేసవి సాయంత్రం నా ఫోన్ మోగింది. అటువైపు ఎల్.కె. అద్వానీ.

''కరణ్, నేనిప్పుడే ఇంటర్వ్యూ చూశాను. అందులో కొంచెం కూడా నాకు తప్పు కనిపించలేదు. కానీ నాకు తప్పుడు సమాచారం ఇచ్చారు. దానిని సాకుగా చూపడం నా వయసుకు తగినది కాదు. మనం చివరిసారి కలుసుకున్నప్పుడు నీతో అనుచితంగా ప్రవర్తించాను. క్షమాపణలు చెప్పడానికే నీకిప్పుడు ఫోన్ చేశాను'' అన్నారాయన.

తప్పును అంగీకరించడానికి ఏ సంకోచమూ లేని సంసిద్ధతే బహుశా అద్వానీలోని గొప్ప గుణంగా తక్షణం ఆయన పట్ల నాకు ఆకర్షణ కలిగేలా చేసింది. ఆయన తర్వాత మళ్లీ అతి కొద్దిమంది రాజకీయ నాయకులు ఓ గుప్పెడు మంది భేషజాలు లేకుండా తమ తప్పును ఒప్పుకుని క్షమాపణ అడగగల శక్తిమంతులు ఉన్నారు. అద్వానీ గురించి ఇంకా మీరేం అనుకున్నా – ఆయనపై ఇతరులకు భిన్నాభిప్రాయాలు ఉంటాయని నేను అంగీకరిస్తాను – ఒక మంచి మనిషి మాత్రమే అలా ఉండగలరు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఆరోగ్య భారతం



140 కోట్ల మంది భారతీయుల్ని ఆరోగ్యవంతుల్ని చేయడం ఎలా? ప్రపంచ మధుమేహ రాజధానిగా కాకుండా, ఆరోగ్య రాజధానిగా చేయలేమా? నాకు తోచిన నాలుగు మార్గాలు ఇవీ: పెద్ద ఆహార కంపెనీలను జవాబుదారీగా నిలబెట్టడం; పాఠశాల కరిక్యులమ్‌లో ఆహారాన్ని ప్రవేశపెట్టడం; ప్యాకేజీల మీద స్పష్టమైన లేబ్లింగ్ చేసే బలమైన ఆహార విధానం తేవడం; సృజనాత్మక పరిష్కారాల కోసం టెక్నాలజీని వాడుకోవడం.

– రేవంత్ హిమత్‌సింగ్కా, ఆహార యాక్టివిస్ట్

పేరు పోయేలా...



ఆర్థిక, సాంస్కృతిక అంశాల్లో తమ పాతపేరును పోగొట్టుకునేలా తోడ్పడే అంతర్జాతీయ ప్రజా సంబంధాల కోసం... పాశ్చాత్య మీడియా, ఇంకా ఇన్‌ఫ్లుయెన్సర్ల మీద సౌదీ అరేబియా భారీగా ఖర్చు చేస్తోంది. కానీ బిన్ లాడెన్, వహాబిజంల బరువైన వారసత్వం ఉన్న ఆ దేశం ఇందులో ఎంతమేరకు సఫలీకృతం కాగలదో!

– జోసెఫ్ టి. నూనీ, థింకర్

మంచి డ్రైవర్లు



బస్ స్టాప్ కంటే పది మీటర్ల ముందే పార్క్ చేసే... పాదచారుల పక్కన నడిపినప్పుడు వేగాన్ని తగ్గించే... రోడ్డు మీద అనవసరంగా హారన్లు కొట్టకుండా ఉండే డ్రైవర్లు అందరిపట్లా నాకు చాలా గౌరవం!

– రుజుతా దివేకర్, న్యూట్రిషనిస్ట్

చూసి నేర్చుకుంటారు



ఏక ప్రభుత్వ ప్రపంచం ఉండకుండా, బహుళ దేశాలు ఉండటం వల్ల ఒక సానుకూలత ఏమిటంటే – ఒక దేశం ఏదైనా తప్పు చేస్తే, మిగిలినవి అది చేయకుండా ఉండగలగడం!

– పాల్ గ్రాహమ్, శాస్త్రవేత్త

అదే ముఖ్యం



మీరు ఎంత చదువుకున్నవాళ్లయినా, ఎంత ధనవంతులైనా, ఎంత ప్రతిభావంతులైనా... మీరు జనానితో ఎలా వ్యవహరిస్తారు అన్నదే మొత్తంగా మీ గురించి చెబుతుంది.

– వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

వెలిగే బంధం



మానవ సంబంధాలు విద్యుత్ ప్రవాహాల లాంటివి. తప్పుడు కనెక్షన్లు జీవితాంతం షాకులు కలిగిస్తుండవచ్చు, కానీ సరైనవి మీ జీవితాన్ని వెలిగిస్తాయి.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

డార్విన్ సిద్ధాంతానికి రుజువులు

పందొమ్మిదో శతాబ్దం తొలి దశాబ్దాల్లో బ్రిటిష్ వాళ్ళు వివిధ ఖండాల ప్రకృతి వనరులనూ, వ్యాపార సాధ్యాసాధ్యాలనూ, ఓడ రేవులనూ సర్వే చేసేందుకు నౌకాయాత్రలు చేపట్టేవారు. దక్షిణ అమెరికా తీర ప్రాంత పరిశీలనకై అలా బయలుదేరినదే హెచ్‌ఎంఎస్ బీగిల్ అనే నౌక. ప్రకృతి పరిశీలకుడుగా ఆ నౌకపై పనిచేసిన వాడు చార్లెస్ డార్విన్. ఆ యాత్ర డార్విన్ జీవితాన్ని మలుపు తిప్పింది. ముఖ్యంగా పసిఫిక్ మహాసముద్రంలో అగ్ని పర్వతాలు పేలటం వలన ఏర్పడిన గొలుసు దీవులు 'గేలా పాగోస్ దీవులు'. జీవ వైవిధ్యానికి స్వర్గధామంగా ఉన్న ఆ దీవుల్లో తారసపడిన 'ఫించ్ పక్షులు' ప్రపంచ దృష్టి కోణాన్ని సైతం మార్చివేసేలా డార్విన్ ఆలోచనలను ప్రభావితం చేశాయి. అవి ప్రధాన భూభాగంపై ఉండే పక్షుల్లాగే ఉన్నా ఒక్కో దీవిపై ఒక్కో ప్రత్యేకతను కనబరిచాయి. సృష్టికర్త ఆ యా దీవులకు ఒక్కో రకం పక్షుల్ని సృష్టించాడా? అనుకున్నాడు. ముఖ్యంగా వాటి ముక్కుల్లో కనిపించిన వైవిధ్యం! ఆహారాన్ని సంపాదించుకునే క్రమంలో ఈ మార్పులు రాలేదు కదా! ముక్కు ఆకారానికి, ఆహారానికీ మధ్య సంబంధం ఏమైనా ఉందా? ఈ ఆలోచనలే జీవ పరిణామ సిద్ధాంతానికి తొలి బీజాలు.



తన నౌకాయాత్రలో సేకరించిన వేలాది నమూనాలు ఆధారంగా చేసుకుని 1859లో డార్విన్ 'జీవజాతుల పుట్టుక' (The Origin of Species) రాశాడు. దానిలోనే 'ప్రకృతి ఎంపిక' ద్వారా దగ్గర లక్షణాలున్న జాతి నుండి కొత్త జాతి ఆవిర్భవిస్తుందని ప్రతిపాదించాడు. ఇది కేవలం భౌతిక ప్రక్రియ అనీ, ఈ మార్పునకు ఏ అతీత శక్తుల ప్రమేయం అవసరం లేదనీ తేల్చాడు. ఇప్పుడెలా ఉన్నాయో అలానే జాతులు సృష్టి చేయబడినాయనీ, వాటిలో ఏ రకమైన మార్పూ ఉండదనే సృష్టివాదుల నమ్మకం. ఇందుకు విరుద్ధంగా వచ్చిన పరిణామ సిద్ధాంతం తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవలసి వచ్చింది. తన ఐదేళ్ల నౌకాయాత్రలో సేకరించిన ఆధారాలను రెండు దశాబ్దాలపాటు సానబట్టి జీవ పరిణామ సూత్రాన్ని కనుగొన్నాడు డార్విన్.

పారిశ్రామిక విప్లవం నేపథ్యంలో బ్రిటన్‌లో ఏర్పడిన కాలుష్య ప్రభావానికి లోనై తమ రంగు మార్చుకున్న సీతాకోక చిలుకలను ప్రకృతి ఎంపికకు ఒక ఉదాహరణగా పేర్కొంటారు. ఇటీవలి కాలంలో వెల్లువెత్తిన జీనోమ్ విజ్ఞానం సైతం డార్విన్ సిద్ధాంత విశిష్టతను చాటుతోంది. ఫించ్ పక్షుల్లో త్వరిత గతిన జరిగే జీవపరిణామాన్ని తెలియజెప్పిన పీటర్ గ్రాంట్, రోజ్‌మేరీ గ్రాంట్ దంపతులు టెక్సాస్ వ్యవసాయ, వైద్య యూనివర్సిటీకి చెందిన లీఫ్ ఆండర్సన్ బృందంతో కలిసి చేసిన ఫించ్ పక్షుల జీనోమ్ అధ్యయనం మరో కొత్త ఆవిష్కరణను 2023 సెప్టెంబర్‌లో వెల్లడించింది. పక్షి ముక్కు వైవిధ్యానికి కారణమైన జన్యువులు ఆరు స్థానాల్లో కేంద్రీకృతమై ఉన్నట్లు కనుగొన్నారు. నాలుగు జన్యువులు కలసి ఏర్పడిన 'సూపర్ జన్యువు'పై ప్రకృతి ఎంపిక పనిచేసి ఒకే మూల జాతి 18 జాతులుగా పరిణామం చెందిన వైనాన్ని నిరూపించారు. జీవుల డీఎన్ఏలో అణు పరాన్న జీవులుగా పిలవబడే ట్రాన్స్‌పోసాన్లు లేదా దూకుడు జన్యువులు జాతి మూలాలు తెలుసుకోవటంలో తోడ్పడతాయి. ఒకే రకం దూకుడు జన్యువు రెండు జంతువుల్లోనూ ఒకే ప్రదేశంలో ఉన్నట్లయితే అవి ఒకే మూలం నుండి వచ్చాయని అర్థం. నోరిహిరో ఒకాడా బృందం ఈ జన్యువులను బట్టి తిమింగలాలు, పార్పాయిస్ చేపల పరిణామ సంబంధాలను అంచనా వేసింది. మనుషులంతా ఒక్కటే జాతి అనీ, ఆ మాట కొస్తే సకల జీవులు పరస్పర సంబంధం కలిగి ఉన్నాయనీ డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం చెబుతోంది.

– ప్రొ॥ కట్టా సత్యప్రసాద్, జన విజ్ఞాన వేదిక (ఉమ్మడి) రాష్ట్ర మాజీ అధ్యక్షులు
(నేడు డార్విన్ జయంతి)

వక్రీకరణల వంకరలు తీసే యత్నం

గమ్యం అదే అయినా గమనం ఎలా సాగింది? లక్ష్యం అదే అయినా పయనించిన దారులు ఏమిటి? చేరుకున్న తీరాలేమిటి? ఆయా నేతల వ్యక్తిత్వాలు, దృక్కోణాలు, పాటించిన విలువలు, అవి తెలుగు జన జీవితాలపై, అభివృద్ధిపై వేసిన ముద్రలు ఏమిటి? విశాల ప్రజా హితానికి ఒనగూర్చిన ప్రయోజనాలేమిటి? చివరకు చిట్టాలో మిగిలిందేమిటి? నిగ్గు తేలిన నిజాలేమిటి?

జగమెరిగిన జర్నలిస్టు, పొలిటికల్ ఎనలిస్టు దేవులపల్లి అమర్... ఐదు దశాబ్దాల పాత్రికేయ అనుభవంతో, తెలుగు రాష్ట్రాల రాజకీయ, సామాజిక పరిణామాల ప్రత్యక్ష సాక్షిగా అనేకానేక విషయాలను క్రోడీకరించుకుని వ్యయప్రయాసలతో వెలువరించిన పుస్తకం 'మూడు దారులు'. రాజకీయ రణరంగాన భిన్న ధ్రువాలు అనేది ఉపశీర్షిక.

ప్రధానంగా వైఎస్ రాజశేఖర రెడ్డి, నారా చంద్రబాబు నాయుడు, వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి వ్యక్తిత్వాల వ్యత్యాసాలనూ, వారు అనుసరించిన రాజకీయ మార్గాన్నీ సమగ్రంగా, ఆసక్తిదాయకంగా విశ్లేషించారు. 'ది దక్కన్ పవర్ ప్లే' పేరిట ఇంగ్లీషులోనూ ఇదే పుస్తకాన్ని వెలువరించారు. సమకాలిక రాజకీయ చరిత్రలోని వక్రీకరణల వంకర్లను సరిచేసి భావితరాలకూ, దేశ ప్రజానీకానికీ వాస్తవాలను అందించేందుకు ఈ పుస్తకంలో గట్టి ప్రయత్నమే చేశారు అమర్.

డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి, చంద్రబాబు నాయుడు 1978లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా ఒకే రోజు అసెంబ్లీలోకి అడుగు పెట్టారు. ఆ తర్వాత వైఎస్ పూర్తిగా కాంగ్రెస్‌కే అంకితమై తన నాయకత్వ సామర్థ్యంతో పార్టీని ముందుకు నడిపించి రాష్ట్ర సారథి అయ్యారు. 'మాట తప్పడు, మడమ తిప్పడు' అనే పేరూ పొందారు. సంక్షేమ పథకాల అమలులోనూ కొత్త పుంతలు తొక్కి 'రాజన్న రాజ్యం' అనే చెరగని ముద్ర వేయగలిగారు. వై.ఎస్. చేపట్టిన సుదీర్ఘ పాదయాత్ర ఆయన ఆలోచనలనూ, వ్యవహార సరళినీ పూర్తిగా మార్చేసింది.

మరోవైపు చంద్రబాబు నాయుడు రాజకీయ జీవితం పూర్తిగా భిన్నమైనది. తనకు రాజ



కీయ భిక్ష పెట్టిన కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పి, మామ ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో చేరి, చివరకు ఆ మామనే వెన్నుపోటు పొడిచి అధికారం హస్తగతం చేసుకున్న ఘన చరిత్ర ఆయనకే సొంతం. ఏ దశలోనూ తన బలంతో కాకుండా, పరాన్నజీవిలా ఇతర పార్టీల పొత్తులతో, జిత్తులతో నెట్టుకొస్తున్న ట్రాక్ రికార్డు చంద్రబాబుది. ఆయన ఏమిటో అమర్ ఇలా చెప్తారు: 'జిత్తుల మారి రాజకీయాలకు చంద్రబాబు పెట్టింది పేరు. రాజకీయ సోపాన పటంలో పైకి పాకేందుకు ఆయన ఎంచుకున్న దారి ఇదే. తన ఎదుగుదలకు అడ్డువచ్చే వారిని సహించలేకపోవడం ఆయన బలహీనత. బంధువులైనా, స్నేహితులైనా సామదాన భేదోపాయాలతో వారిని తన దారి నుంచి తప్పించగల రాజకీయ చతురత ఆయన సొంతం. ఆది నుంచి ఆయన అవకాశవాద రాజకీయాల ఆసరాతోనే ఎదిగారన్నది సుస్పష్టం'.



వైస్రాయ్ హోటల్ వేదికగా చంద్రబాబు నడిపిన వెన్నుపోటు కుట్రలను ఎంతో భావోద్విగ్నంగా, 'ఆ తొమ్మిది రోజుల్లో ఏం జరిగింది?' అనే అధ్యాయంలో అమర్ పొందుపరిచారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ నిష్క్రియాపరత్వం, ముప్పు ముంచు కొస్తున్నా పసిగట్టలేకపోవడం గురించి కూడా వివరంగా రాశారు.

చంద్రబాబును దొడ్డిదారిన అధికారంలోకి తేవడంలో ఎంతో మంది పత్రికాధిపతులు, ఎడిటర్లు పోషించిన పాత్రను కూడా నీళ్లు నమలకుండా చెప్పారు. అప్పట్లో 'ఆంధ్రప్రభ'లో బ్యూరో చీఫ్‌గా ఉన్నారు. జరిగింది జరిగినట్లుగా నివేదించేందుకు తన ఎడిటర్లను కన్విన్స్ చేయడానికి అమర్ చేయని ప్రయత్నం లేదు. కానీ, అమర్ హిత బోధలను కీలక స్థానాల్లో ఉన్నవారు పెడచెవిన పెట్టడంతో ఉద్యోగ ధర్మంగా సర్దుకపోక తప్పని పరిస్థితులు.

ఆ తదనంతర కాలంలో వైఎస్ ఆకస్మిక మరణంతో అనివార్యంగా రాజకీయ రంగ ప్రవేశం చేసిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎవరికీ తలవంచక, కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి సొంతదారి నిర్మించుకున్నారు. తన తండ్రి వైఎస్ ఆశయాలూ, లక్ష్యాల బాటలోనే నడుస్తూ ప్రజా సంక్షేమం, అభివృద్ధిని జోడు గుర్రాల్లా పరుగులు తీయిస్తూ తండ్రికి మించిన తనయుడనిపించుకుంటున్నారు.

తెలుగువారి సమకాలిక రాజకీయ చరిత్రలోని అసలు కోణాలనూ, వాస్తవాలనూ తెలుసుకోవాలన్న జిజ్ఞాస ఉన్న ప్రతి ఒక్కరూ తప్పక చదవవలసిన పుస్తకం ఇది.

– గోవిందరాజు చక్రధర్
వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

మితాహారం

యోగ సాధన చేయగోరే వారు అలవరచుకోవలసిన లక్షణాలను గురించి ప్రస్తావిస్తూ, 'అతిగా తినే వారికి (అత్యశ్నతః) యోగసాధనలు సాధ్యం కావు. అలాగని బొత్తిగా ఆహారం తీసుకోని వాళ్ళకు (ఏకాంతం అనశ్నతః) కూడా అవి సాధ్యం కావు' అంటుంది భగవద్గీత (6–16).

యోగశాస్త్రం మాట అలా ఉంచినా, ఆహార విషయంలో పరిమితులలో ఉండకపోతే, ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని ఆధునిక వైద్య శాస్త్రం కూడా హెచ్చరిస్తూనే ఉంటుంది. వ్యక్తుల శరీర తత్త్వాలు వేరు వేరుగా ఉంటాయి గనక, మనిషన్నవాడు ఇన్ని గ్రాముల ఆహారం తీసుకోవాలని పరిమితి నిర్ణయించడం కుదరదు. అయితే అవసరం మేరకే ఆహారం తీసుకోవాలన్న స్పృహ ఉన్న వాళ్ళకు, వాళ్ళకు వర్తించే పరిమితి ఏమిటో, అనుభవం ద్వారా వాళ్ళకే తెలుస్తుంది... కడుపు నిండినపుడు కడుపు నిండిన విషయం తెలిసినట్టే!



గీతలో పై శ్లోకానికి భాష్యం చెప్తూ, ఆదిశంకరులు రెండు ప్రాచీన సూత్రాలను ఉటంకించారు. ఒకటి, శతపథ బ్రాహ్మణంలో మాట. ఈ బ్రాహ్మణం నేటికి సుమారు మూడు వేల ఏళ్ల నుంచి జగమెరిగి ఉన్న శ్రుతి. 'శరీర అవసరాలకు సరిపడేట్టుగా భుజించే అన్నం రక్షిస్తుంది. అది బాధించదు (యదుహ వా ఆత్మ సమ్మితం అన్నం తత్ అవతు, తత్ న హినస్తి). అంతకంటే ఎక్కువ భుజిస్తే, అది బాధిస్తుంది. అలాగే, అంతకంటే తక్కువ ఆహారం తీసుకొంటే అది రక్షించలేదు, బాధిస్తుంది' అని.

ఎంత ఆహారం అయితే మితాహారం అవుతుంది అనే ప్రశ్నకు సమాధానంగా, ఆచార్యుల వారి భాష్యం మరో ప్రాచీన శ్లోకాన్ని ఉటంకిస్తుంది. అర్ధం సవ్యంజనం అన్నస్య, తృతీయం ఉదకస్య చ, / వాయోః సంచరణార్థం తు, చతుర్థం అవశేషయేత్– ఉదరంలో సగభాగం అన్నానికీ కూరలకూ, మూడో పావు నీటికీ. నాలుగో పావు వాయు సంచారానికీ వదిలి వేయాలి – అని.

ఏ ఆహారమైనా, ఎంత స్వీకరించినా అదేదో రోజుకు రెండు సార్లు మాత్రమే స్వీకరించి మిగతా సమయంలో కేవలం జలం మాత్రమే పుచ్చుకోవడం మంచిదనీ, అలా చేసే వాడు నిత్యోపవాసి కింద భావించబడతాడనీ మహాభారతంలో భీష్ముడు చెప్పిన ధర్మాలలో కనిపిస్తుంది. ఆహార సూత్రాలు అప్పట్నించే ఉన్నాయి. ఆచరించే క్రమశిక్షణకే ఇప్పటికీ కొరత.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** శు.తదియ రా.10.40 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** పూర్వాభాద్ర రా.7.40 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** తె.4.37 నుండి 6.09 వరకు (తెల్లవారితే మంగళవారం), **దుర్ముహూర్తం:** ప.12.36 నుండి 1.21 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.40 వరకు, **అమృతఘడియలు:** ప.12.11 నుండి 1.40 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.35, **సూర్యాస్తమయం:** 5.53.

ఇద్దరు వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్‌పై వేటు

- ప్రభుత్వం ఆస్పత్రి సూపరింటెండెంట్ సరెండర్
- రోగిని ఎలుక కరవడంపై ప్రభుత్వం సీరియస్

కామారెడ్డి టౌన్: కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో శనివారం ఓ రోగిని ఎలుక కరిచిన సంఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ ఆదివారం కామారెడ్డికి వచ్చి విచారణ జరిపి, ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఐసీయూ విభాగంలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు వసంత్‌కుమార్, కావ్యతో పాటు నర్సింగ్ ఆఫీసర్ జి.మంజులను సస్పెండ్ చేస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) అధికారి బి.త్రివేణి ఆదివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రాథమిక విచారణ అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మిని ప్రభుత్వానికి సరెండర్ చేశారు. కాగా రోగులను ఎలుకలు కరిస్తే వైద్యులపై చర్యలు తీసుకోవడం వివాదాస్పదమవుతోంది. ఈ చర్యలపై వైద్యులు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని ప్రభుత్వ వైద్యులు ప్రకటించారు.

మా పిల్లల ప్రాణాలకు గ్యారంటీ ఇవ్వండి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

సూర్యాపేట రూరల్: సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీల పథకాల కంటే ముందు రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలైన తమ పిల్లల ప్రాణాలకు గ్యారంటీ ఇవ్వాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కోరారు. సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండలంలోని ఇమాంపేట గురుకుల పాఠశాలలో వైష్ణవి మృతికి పాఠశాల ప్రిన్సిపాల్, ఆర్సీఓలే కారణమని తల్లిదండ్రులు ఆ పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనకు ప్రవీణ్‌కుమార్ హాజరై తల్లిదండ్రులను ఓదార్చిన అనంతరం మాట్లాడారు. 'సీఎం ఆరు గ్యారంటీలు అమలు చేయకపోయినా మాకు నష్టం లేదు. ఇందుకోసమేనా కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించి మిమ్మల్ని అధికారంలోకి తీసుకొచ్చింది. ఆదాయం వచ్చే శాఖలకు మంత్రులను కేటాయించారే గానీ గిరిజన సంక్షేమ శాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించకపోవడం బాధాకరం. భువనగిరి గురుకులంలో ఇద్దరు విద్యార్థినులు చనిపోతే రెండు నిమిషాలు కూడా మౌనం పాటించకపోవడం హేయమైన చర్య' అని ఆవేదన వ్యక్తంచేశారు. వైష్ణవి మృతిపై విచారణ జరిపి ఘటనకు బాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలన్నారు. మృతురాలి కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. 3 గంటలకు పైగా ఆందోళన కొనసాగడంతో 3 కి.మీ. మేర ట్రాఫిక్ స్తంభించింది. కలెక్టర్ పాఠశాల వద్దకు రావాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఎస్పీ నాగభూషణం, సీఐ రాజశేఖర్‌తో పాటు మరో ఇద్దరు సీఐలు, ఎస్సైలు గురుకుల పాఠశాల వద్దకు వచ్చారు. వైష్ణవి కుటుంబానికి న్యాయం చేస్తామని ప్రవీణ్‌కుమార్‌కు వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చి ఆందోళనను విరమింపజేశారు.



విద్యార్థిని వైష్ణవి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆందోళన చేస్తున్న ప్రవీణ్ కుమార్

మా కూతురు మరణంపై అనుమానాలున్నాయి

- న్యాయ విచారణ జరిపించాలంటూ తల్లిదండ్రుల డిమాండ్
- విద్యార్థినుల వరుస ఆత్మహత్యలతో కలకలం

సూర్యాపేట రూరల్: గురుకుల విద్యార్థిని వైష్ణవి ఆత్మహత్యకు గల కారణాలేమిటో ఇంకా తెలియరాలేదు. అయితే తమ కూతురు మృతిపై అనుమానాలు ఉన్నాయని, న్యాయవిచారణ జరిపించాలని ఆ విద్యార్థిని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. సూర్యాపేట మండలం ఇమాంపేట గురుకులంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దగ్గుపాటి వైష్ణవి శనివారం రాత్రి ఫేర్‌వెల్ డే లో పాల్గొంది. అయితే సాయంత్రం వీడియో కాల్ చేసి సంతోషంగానే మాట్లాడినట్టు తల్లిదండ్రులు చెబుతున్నారు. అలంకరణ వస్తువులు కావాలని కోరితే తండ్రి వెంకన్న గురుకులానికి వచ్చి ఇచ్చి వెళ్లాడు. అంతలోనే ఏమైందో తెలియదు కానీ వైష్ణవి వేడుక మధ్యలోంచి హాస్టల్‌కు వెళ్లింది. రాత్రి భోజనం చేసిన తర్వాత హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన తోటి విద్యార్థినులు ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. కొన ఊపిరితో ఉన్న వైష్ణవిని సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించి, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. చికిత్స అందిస్తుండగానే వైష్ణవి మృతి చెందింది. వారం రోజుల క్రితం భువనగిరిలోని ఎస్సీ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న ఘటన మరువకముందే సూర్యాపేటలో మరో విద్యార్థిని వైష్ణవి మృతిచెందడం కలకలం రేపింది. పోస్టుమార్టం అనంతరం వైష్ణవి అంత్యక్రియలు ఆదివారం సూర్యాపేట పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో జరిగాయి. ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న వైష్ణవి మొదటి సంవత్సరంలో మూడు సబ్జెక్టులు తప్పిందని, మళ్లీ పరీక్షలు సమీపిస్తుండడంతో ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకుని ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇంకా ఏమైనా కారణాలు ఉన్నాయా అన్న కోణంలో కూడా ఆరా తీస్తున్నారు.



వైష్ణవి

ప్రిన్సిపాల్, ఆర్సీఓ వేధించడంతోనే..

హాస్టల్‌లో భోజన సదుపాయం సరిగా లేదని పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతోనే ప్రిన్సిపాల్ ఝాన్సీ, ఆర్సీఓ అరుణ తమ కుమార్తె వైష్ణవిపై కక్ష పెంచుకున్నారని మృతురాలి తల్లిదండ్రులు భాగ్యమ్మ, వెంకన్న ఆరోపించారు. వారిద్దరి వేధింపుల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని వాపోయారు.

భారీగా ఎంపీడీవోల బదిలీ

- రాష్ట్రవ్యాప్తంగా 395 మందికి స్థానచలనం
- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వివిధ శాఖల్లో బదిలీల పర్వం

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో..రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా ఆదివారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ (పీఆర్ ఆర్‌డీ)కు చెందిన 395 మంది మండల పరిషత్ అభివృద్ధి అధికారులను (ఎంపీడీవో) ట్రాన్స్‌ఫర్ చేశారు. మూడేళ్ల పాటు ఒకేచోట పనిచేస్తున్న వారిని, తమ సొంత జిల్లాల్లో పనిచేస్తున్న ఎంపీడీవోలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు జారీ చేస్తున్న మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా బదిలీ అయిన ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు ఇవ్వాలని జిల్లా కలెక్టర్లకు సూచించింది. సోమవారం ఎంపీడీవోలను ప్రస్తుతం పని చేస్తున్న చోట్ల నుంచి కలెక్టర్లు రిలీవ్ చేశాక, పోస్టింగ్ ఇచ్చిన జిల్లాల్లో మంగళవారం జాయిన్ అయ్యేలా చూడాలని కలెక్టర్లు, జెడ్పీ సీఈవోలకు శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ ఆదేశాలిచ్చారు. ఇలావుండగా పీఆర్ ఆర్‌డీ శాఖ పరిధిలోని సీఈవోలు, డిప్యూటీ సీఈవోలు, డీపీవోలు, డీఎల్‌పీవోలను ఆదివారం రాత్రికి లేదా సోమవారం బదిలీ చేసేందుకు కసరత్తు పూర్తయినట్టు తెలుస్తోంది. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలు బదిలీలు చేపట్టాయి. శనివారం రెవెన్యూ శాఖ పరిధిలోని 132 మంది తహసీల్దార్లు, 32 మంది డిప్యూటీ కలెక్టర్లను ట్రాన్స్‌ఫర్ చేశారు. ఈ క్రమంలో సోమ, మంగళవారాల్లో మరిన్ని శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులను బదిలీ చేసే అవకాశం ఉందని సమాచారం.

కార్యదర్శులను కూడా బదిలీ చేయండి: శాఖలోని సీఈవో మొదలు ఇతర స్థాయిల్లోని అధికారులు, ఉద్యోగులను బదిలీ చేస్తున్న నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులను కూడా బదిలీ చేయాలని తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇ.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

ఆర్ఎఫ్‌సీఎల్‌లో నిలిచిన యూరియా ఉత్పత్తి

ఫెర్టిలైజర్ సిటీ (రామగుండం): రామగుండం ఫెర్టిలైజర్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్) కర్మాగారంలో ఆదివారం యూరియా ఉత్పత్తి నిలిచిపోయింది. కర్మాగారంలోని స్టీమ్ పైప్‌లైన్‌లో లోపంతో అధికారులు కర్మాగారాన్ని షట్‌డౌన్ చేశారు. మరమ్మతులు పూర్తికావడానికి సుమారు 15 రోజుల సమయం పడుతుందని అధికారులు అంచనా వేశారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో యూరియా డిమాండ్ అధికంగా ఉన్న సమయంలో ఉత్పత్తి నిలిచిపోవడం ఆందోళన కలిగిస్తోంది. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు తెలిపారు.

కాల్చేసే కాంతిపుంజం!



ఇజ్రాయెల్ అమ్ములపొదిలో ఐరన్ బీమ్ | హెజ్బొల్లాను చావుదెబ్బ తీసే యోచన!

లెబనాన్‌పై పూర్తిస్థాయి యుద్ధానికి ఇజ్రాయెల్ సిద్ధమవుతోందా? పక్కలో బల్లెంలా మారిన హెజ్బొల్లాను సమూలంగా తుడిచిపెట్టాలని నిర్ణయించుకుందా? హెజ్బొల్లా ఉగ్రవాదుల డ్రోన్లు, రాకెట్లను కూల్చడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ 'ఐరన్ బీమ్' తొలిసారిగా రంగప్రవేశం చేయనుందా? ఇజ్రాయెలీలకు ప్రభుత్వం జారీ చేస్తున్న హెచ్చరికలను చూస్తుంటే అవుననే అనిపిస్తోంది. హెజ్బొల్లాతో యుద్ధం మొదలైతే ఇజ్రాయెల్ ప్రజలకు కొన్ని రోజులపాటు విద్యుత్ సంక్షోభం తప్పదన్న హెచ్చరికల పత్రం దేశ న్యాయ శాఖలో రౌండ్లు కొడుతున్నట్టు 'ద జెరూసలెం పోస్ట్' ఓ కథనం ప్రచురించింది. చాలా ప్రాంతాల్లో ఒకటి నుంచి మూడు రోజుల దాకా కరెంటు సరఫరా ఉండకపోవచ్చని ఇజ్రాయెల్ నేషనల్ ఎమర్జెన్సీ అథారిటీ కూడా పేర్కొంది. ప్రజలు ఆహారం, నీరు, బ్యాటరీ వంటివి దగ్గరుంచుకోవాలని సూచించింది...!

ప్రపంచంలోనే తొలిసారి!

ఐరన్ బీమ్. ఉగ్రవాదుల రాకెట్లను గాల్లోనే తుత్తునియలు చేసి క్షణాల్లో కాల్చి బూడిదగా మార్చే అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థ. తీవ్రమైన కాంతిపుంజపు ఉష్ణశక్తితో కూడిన ఈ వినూత్న సాంకేతిక ఆయుధాల గురించి వినడమే తప్ప ఇప్పటిదాకా ఏ దేశమూ ప్రయోగించలేదు. చెప్పాలంటే ప్రయోగాత్మక దశలో ఉన్న టెక్నాలజీ ఇది. ఇజ్రాయెల్ రఫేల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్ ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసింది. ఇది స్టార్ ట్రెక్, స్టార్ వార్స్ వంటి సైన్స్ ఫిక్షన్ సినిమాల్లోని ఆయుధాల్లా ఉంటుందంటే అతిశయోక్తి కాదు. 'డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్'గా వ్యవహరించే ఈ కొంగొత్త వ్యవస్థను 2014 ఫిబ్రవరి 11న సింగపూర్ ఎయిర్ షోలో ప్రదర్శించారు. పాలస్తీనా హమాస్, లెబనీస్ హెజ్బొల్లా ఉగ్ర సంస్థలతో తాజా ఘర్షణలు, యుద్ధం నేపథ్యంలో దీన్ని ఇజ్రాయెల్ రంగంలోకి దించనుందని తెలుస్తోంది.

ఇలా పని చేస్తుంది...

యారో–2, యారో–3, డేవిడ్స్ స్లింగ్, ఐరన్ డోమ్ తర్వాత ఇజ్రాయెల్ అమ్ములపొదిలో సరికొత్త ఆగ్నేయాస్త్రం ఐరన్ బీమ్. ఇది ఫైబర్ లేజర్ ఆధారంగా పనిచేస్తుంది. ఐరన్ డోమ్తో పోలిస్తే ఐరన్ బీమ్ చిన్నది, తేలికైనది. రహస్యంగా ప్రయోగించడానికి, ఒక చోట నుంచి మరో చోటికి తరలించడానికి మరింత అనువైనది. ఐరన్ డోమ్ కూడా ఇజ్రాయెల్ స్వల్పశ్రేణి క్షిపణి రక్షణ వ్యవస్థే. కానీ ఇటీవలి హమాస్ రాకెట్ దాడులను నిలువరించడంలో విఫలమైంది. ఇప్పుడు డోమ్‌కు బీమ్‌ను జతచేసి సత్ఫలితాలు రాబట్టాలని ఇజ్రాయెల్ భావిస్తోంది. అయితే ఐరన్ బీమ్‌కూ పరిమితులు లేకపోలేదు. తడి వాతావరణ పరిస్థితుల్లో ఈ లేజర్ వ్యవస్థ పనిచేయదు. ఎంతటి సానుకూల పరిస్థితులున్నా వాతావరణంలోని తేమ వల్ల 30% నుంచి 40% వరకు శక్తిని లేజర్ కోల్పోతుంది. అలాగే ధ్వంసం చేయాల్సిన లక్ష్యం ఐరన్ బీమ్ దృష్టి రేఖకు సూటిగా ఉండాలి. నేరుగా కంటికి కనిపించకుండా, బీమ్‌కు సూటిగా కాకుండా లక్ష్యం ఎక్కడో నక్కి ఉంటే లేజర్ కిరణాలతో నాశనం చేయడం అసాధ్యం. పైగా ఐరన్ బీమ్ ఫైరింగ్ రేటు కూడా తక్కువ. లక్ష్యాన్ని ధ్వంసం చేయడానికి సరిపోయేంత లేజర్ శక్తిని ప్రయోగించాలంటే కనీసం 5 సెకన్లు, అంతకు మించి సమయం కావాలి. అయినప్పటికీ శత్రు క్షిపణులను గగనతలంలోనే అడ్డుకుని కూల్చేసే సంప్రదాయ ఇంటర్‌సెప్టర్ క్షిపణులతో పోల్చితే ఐరన్ బీమ్ వ్యవస్థ అత్యంత శక్తిమంతమైనది. 'ఖర్చు తక్కువ, పనితీరు ఎక్కువ' అన్నది దీని సూత్రం. పైగా దీన్ని ఎన్నిసార్లైనా పేల్చవచ్చు. ఒక్కో షాట్‌కు అయ్యే వ్యయమూ తక్కువ. ఐరన్ డోమ్‌లో ఒక్కో ఇంటర్సెప్టర్ రాకెట్‌కు 60 వేల డాలర్ల దాకా అవుతుండగా ఐరన్ బీమ్‌లో మాత్రం ఆ ఖర్చు కేవలం కొన్ని డాలర్లే. అంతేకాదు, ఈ వ్యవస్థలో శత్రు క్షిపణిని ఢీకొట్టాక ఇంటర్‌సెప్టర్ శకలాలు పడే ముప్పు కూడా ఉండదు. 7 కిలోమీటర్ల పరిధిలోని క్షిపణులు, మానవరహిత వైమానిక వాహనాలు, మోటార్ షెల్స్ వంటివాటిని ఐరన్ బీమ్ క్షణాల్లో నిర్వీర్యం చేయగలదు. దీన్ని 2025 నాటికి మోహరించాలని ఇజ్రాయెల్ భావించినా యుద్ధం అవసరాలతో ఇప్పుడే రంగంలో దించేలా ఉంది.

ఐరన్ బీమ్ Vs లైట్ బీమ్!

ఈ రెండు హై ఎనర్జీ లేజర్ వ్యవస్థలనూ రఫేల్ సంస్థే అభివృద్ధి చేస్తోంది. లైట్ బీమ్ 7.5 కిలోవాట్ల ఇంటర్‌సెప్టర్. రెండు కిలోమీటర్ల దూరంలోని చిన్నపాటి మానవరహిత వైమానిక వాహనాలు, నేలమీద అత్యాధునిక మందుపాతరలు, పేలని మందుగుండు తదితరాలను ఇది నిర్వీర్యం చేయగలదు. ఐరన్ బీమ్ 100 కిలోవాట్ల తరగతికి చెందిన హై ఎనర్జీ లేజర్ సిస్టమ్. ఇది రాకెట్లు, శతఘ్నులు, యూఏవీలను కూల్చగలదు.

- జమ్ముల శ్రీకాంత్



ట్రైన్ రిసార్ట్

చుట్టూ పచ్చని పచ్చికబయళ్లు, వన్యప్రాణులు. నాలుగు అడుగులేస్తే మన కోసమే ప్రత్యేకంగా ఈతకొలను. ఇంకాస్త పక్కకెళితే ప్రకృతి రమణీయతను చూసేందుకు విడిగా వ్యూ డెక్కులు, మనం ఉన్నచోటు కిందే ఉరకలెత్తుతూ సాగే నది, సకల సౌకర్యాలతో సిద్ధంగా ఉన్న విలాసవంతమైన గది. ప్రకృతి ఒడిలో ఆహ్లాదకర జీవనానికి చిరునామాగా నిలిచే ఇలాంటి చోట కొంతకాలమైనా గడపాలని ఎంతో మంది ఆశ పడతారు. అలాంటి ప్రకృతి ప్రేమికుల కోసం ఒక రైలును సర్వాంగసుందరంగా తీర్చిదిద్ది ఒక పాత వంతెనపై హోటల్‌గా మార్చారు. ప్రపంచ వారసత్వ సంపదల్లో ఒకటిగా పేరొందిన దక్షిణాఫ్రికాలోని క్రూగర్ జాతీయ వనంలో ఈ 'ది ట్రైన్ ఆన్ ది బ్రిడ్జ్' హోటల్ ఉంది. ఈ కదలని రైలు అరుదైన అనుభూతిని పంచుతుంది. ఇందులో పర్యాటకుల కోసం అన్ని సౌకర్యాలతో 31 సూట్‌లు సిద్ధం చేశారు. అన్ని రకాల వంటకాలతోపాటు స్థానిక రుచులనూ ఆస్వాదించవచ్చు. గైడ్‌ల సాయంతో అడవిలోకెళ్లి స్వేచ్ఛగా సింహం, చిరుతపులి, ఏనుగు, నీటిగుర్రం, అడవి బర్రెలను దగ్గర్నుంచి చూసిరావచ్చు. ఒక ట్విన్(జంట)రూమ్‌లో పర్యాటకులు ఒక రాత్రి గడపాలంటే ఒక మనిషికి దాదాపు రూ.44,000 రుసుము వసూలుచేస్తారు. 100 ఏళ్లకు పైబడిన ఈ వంతెనపై గతంలో స్టీమ్ రైళ్లు నడిచేవి. వారసత్వంగా నిలిచిన ఈ వన వంతెనను విభిన్నంగా వినియోగిద్దామని ఈ హోటల్‌కు రూపకల్పన చేశామని మోట్సామయి టూరిజం గ్రూప్ సీఈవో జెరీ మబేనా చెప్పారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

అమెరికాలో హెలికాప్టర్ కూలి... ఆరుగురి దుర్మరణం

కాలిఫోర్నియా: అమెరికాలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో నైజీరియాకు ప్రముఖ ఏక్సెస్ బ్యాంకు సీఈవో, ఆయన భార్య, కొడుకు సహా ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. పామ్ స్ప్రింగ్స్ ఎయిర్‌పోర్టు నుంచి శుక్రవారం రాత్రి 8.45 గంటలకు బయలుదేరిన యూరోకాప్టర్ ఈసీ 120 రకం హెలికాప్టర్ నెవడాలోని బౌల్డర్ సిటీకి వెళుతుండగా మొజావ్ ఎడారిలోని ఇంటర్‌స్టేట్ 15 రహదారి సమీపంలో 10.30 గంటల సమయంలో కూలిపోయింది. ఘటనలో అందులో ఉన్న యాక్సెస్ బ్యాంక్ సీఈవో హెర్బర్ట్ విగ్వే(57), ఆయన భార్య, కొడుకుతోపాటు మొత్తం ఆరుగురూ మృత్యువాతపడ్డారు. నైజీరియాలోని రెండు అతిపెద్ద బ్యాంకుల్లో ఏక్సెస్ బ్యాంకు ఒకటి.

రేపు రైతు సంఘాల 'ఢిల్లీ చలో'

భారీ భద్రతతో దుర్భేద్యంగా ఢిల్లీ, హరియాణా సరిహద్దులు

న్యూఢిల్లీ/చండీగఢ్: రైతు సంఘాలు మంగళవారం తలపెట్టిన 'ఢిల్లీ చలో'మార్చ్ నేపథ్యంలో దేశ రాజధానితో పాటు హరియాణా సరిహద్దుల్లో అధికారులు భారీగా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. నిషేధాజ్ఞలను అమలు చేయడంతో పాటు వాహనాల ప్రవేశాన్ని అడ్డుకునేందుకు కాంక్రీట్ దిమ్మెలు, స్పైక్ బారియర్లు, ముళ్లకంచెలను ఏర్పాటు చేశారు. టొహానా బోర్డర్ వద్ద ఇసుక కంటెయినర్లను, కాంక్రీట్ బారికేడ్లను, మేకులను రోడ్డుపై ఏర్పాటు చేశారు. సోమవారం చర్చలకు రావాల్సిందిగా రైతు సంఘాలను కేంద్రం ఆహ్వానించింది. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత వంటి డిమాండ్లతో సంయుక్త కిసాన్ మోర్చా, పలు ఇతర రైతు సంఘాలు ఢిల్లీ మార్చ్‌కి పిలుపివ్వడం తెలిసిందే. దాంతో ట్రాక్టర్ ట్రాలీ మార్చ్ సహా ఎటువంటి నిరసనలు చేపట్టరాదంటూ హరియాణా ప్రభుత్వం 15 జిల్లాల పరిధిలో సెక్షన్ 144 విధించింది. శంభు వద్ద పంజాబ్‌తో సరిహద్దును మూసివేసింది. ఏడు జిల్లాల్లో ఇంటర్నెట్ సర్వీసులను, బల్క్ ఎస్ఎంఎస్‌లను మంగళవారం దాకా నిషేధించింది. 2020–21లో రైతులు ఏడాదికి పైగా నిరసనలు కొనసాగించిన సింఘు, ఘాజీపూర్, తిక్రీ సరిహద్దుల్లో బారికేడ్లనే ఏర్పాటు చేసి, తనిఖీలను ముమ్మరం చేశారు. ఢిల్లీలోని ఈశాన్య జిల్లాలో కూడా నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నారు. నిరసనకారులు ఢిల్లీలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకుంటున్నారు. యూపీ, పంజాబ్ సరిహద్దుల్లో 5 వేల మంది పోలీసులను నియోగించారు. మెట్రో స్టేషన్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. నిరసనకారులు బారికేడ్లను తొలగించుకుని లోపలికి రాకుండా ఘగ్గర్ ఫ్లై ఓవర్ వద్ద రోడ్డుకు ఇరువైపులా ఇనుపషీట్లను అమర్చారు. ఏదేమైనా కనీసం 20 వేల మంది రైతులు ఢిల్లీ తరలుతారని రైతు సంఘాలంటున్నాయి. మోదీ సర్కారు నిరంకుశత్వంతో రైతులను అడ్డుకోజూస్తోందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ మండిపడ్డారు. దాన్ని ఢిల్లీ నుంచి శాశ్వతంగా పారదోలాలని పిలుపునిచ్చారు.

ఎన్నికలప్పుడే పేదలు గుర్తొస్తారు

కాంగ్రెస్‌పై మోదీ ధ్వజం
- బీజేపీకి 370 దాటడం ఖాయం
- ఎన్డీయేకు 400 దాటుతాయని విపక్ష నేతలే అంటున్నారు
- మధ్యప్రదేశ్ సభలో ప్రధాని

భోపాల్: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 370కిపైగా స్థానాలు కచ్చితంగా గెలుచుకుంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో అధికార ఎన్డీయేకు 400కు పైగా స్థానాలు లభిస్తాయని సాక్షాత్తూ ప్రతిపక్ష నేతలే చెబుతున్నారని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఝాబూవా జిల్లాలో ఆదివారం గిరిజనుల బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన గిరిజన సంప్రదాయ దుస్తులు ధరించారు. కాంగ్రెస్ గిరిజన వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. ఆ పార్టీకి గ్రామీణులు, రైతులు, పేదలు కేవలం ఎన్నికల సమయంలోనే గుర్తుకొస్తారని ఎద్దేవా చేశారు. కొన్ని రోజుల క్రితం దక్షిణాది రాష్ట్రాల్లో శ్రీరాముడితో సంబంధం ఉన్న ఆలయాలను దర్శించుకున్నానని, స్థానిక ప్రజల నుంచి తనకు అపరిమితమైన ప్రేమ లభించిందని చెప్పారు.

కాంగ్రెస్ తుడిచిపెట్టుకుపోవడం ఖాయం

వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు గ్రహించాయని, అందుకే దింపుడు కళ్లం ఆశతో కుటిల ప్రయత్నాలకు పాల్పడుతున్నాయని ప్రధాని మోదీ ఆరోపించారు. లూటీ చేయడం, ప్రజలను విభజించడం.. ఇదే కాంగ్రెస్ విధానమని మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు జనం సొమ్ము దోచుకోవడం, అధికారం పోయాక భాష, ప్రాంతం, కులం పేరిట విడదీయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిపోయిందన్నారు. అవినీతి, విభజన రాజకీయాలు అనే ఆక్సిజన్‌తో కాంగ్రెస్ బతుకుతోందన్నారు. ప్రజలకు నిజాలు తెలుసని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఆటలు సాగనివ్వబోమని తేల్చిచెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని అన్నారు. గిరిజనులు, పేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నందుకే ప్రతిపక్షాలు తనను దూషిస్తున్నాయని ఆరోపించారు.

ప్రతి బూత్‌లో అదనంగా 370 ఓట్లు

గత లోక్‌సభ ఎన్నికల కంటే ఈసారి ప్రతి పోలింగ్ బూత్‌లో బీజేపీకి అదనంగా 370 ఓట్లు వేయాలని ప్రజలను నరేంద్ర మోదీ కోరారు. మొత్తం 543 లోక్‌సభ సీట్లకు గాను తమకు 370కిపైగా సీట్లు కట్టబెట్టాలన్నారు. మధ్యప్రదేశ్‌లో డబుల్ ఇంజన్ ప్రభుత్వం డబుల్ స్పీడ్‌తో పని చేస్తోందని హర్షం వ్యక్తం చేశారు. రూ.7,550 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఈ సందర్భంగా మోదీ ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ గిరిజనులను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తోందని ఆక్షేపించారు. గిరిజన మహిళ ద్రౌపదీ ముర్ము రాష్ట్రపతి కాకుండా అడ్డుకొనేందుకు కాంగ్రెస్ ప్రయత్నించిందని ధ్వజమెత్తారు.

విలువలతో కూడిన విద్య కావాలి

భారతీయ విలువల ఆధారిత విద్యా వ్యవస్థ తక్షణావసరమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆర్య సమాజ్ వ్యవస్థాపకుడు స్వామి దయానంద సరస్వతి 200వ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని మోర్బీ జిల్లా తాంకారాలో ఆదివారం వేడుకల్లో ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. భారతీయ వ్యవస్థ వేదాల వైపు మళ్లాలంటూ దయానంద సరస్వతి పిలుపునిచ్చారని గుర్తుచేశారు. ఆయన గొప్ప సామాజిక సంస్కర్త అని కొనియాడారు. సమాజం నుంచి బానిసత్వం, మూఢనమ్మకాలను తొలగించేందుకు కృషి చేశారని తెలిపారు. ఆర్య సమాజ్ ఆధ్వర్యంలోని పాఠశాలలు విలువలతో కూడిన విద్యనందిస్తున్నాయని ప్రశంసించారు. 21వ శతాబ్దంలో జాతి నిర్మాణం అనే బాధ్యత చేపట్టాలని ఆర్య సమాజ్‌కు విజ్ఞప్తి చేశారు. దయానంద సరస్వతి జన్మించిన గుజరాత్‌లో తాను కూడా జన్మించడం అదృష్టంగా భావిస్తున్నానని మోదీ అన్నారు.



దేశ గౌరవం పెంచిన మోదీ: అమిత్ షా

మైసూరు: ''అయోధ్యలో రామమందిర నిర్మాణంతోపాటు ప్రముఖ పుణ్యక్షేత్రాలను ప్రధాని నరేంద్ర మోదీ అభివృద్ధి చేశారు. తద్వారా అంతర్జాతీయ వేదికలపై దేశ సాంస్కృతిక గౌరవాన్ని ఇనుమడింపజేశారు. దేశాన్ని సురక్షితంగా, సుభిక్షంగా తీర్చిదిద్దడంతోపాటు యోగ, ఆయుర్వేద, భారతీయ భాషల పరిరక్షణకు మోదీ చర్యలు తీసుకుంటున్నారన్నారు'' అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఆదివారం ఆయన మైసూరు సమీపంలోని సుత్తూరు జాతరలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మైసూరులోని చాముండి హిల్స్‌పై కొలువుదీరిన చాముండేశ్వరీ మాతను దర్శించుకుని పూజలు చేశారు.

నాకు ఓటేయకుంటే తిండి మానండి

అమ్మానాన్నల్ని బెదిరించండి.. చిన్నారులకు ఎమ్మెల్యే ఉద్బోధ

ముంబై: తల్లిదండ్రులు తనకు ఓటేయకుంటే రెండు రోజులపాటు అన్నం మానేయాలంటూ మహారాష్ట్రలో అధికార శివసేన ఎమ్మెల్యే ఎమ్మెల్యే సంతోష్ బంగార్ చిన్నారులకు చెప్పడం వివాదాస్పదంగా మారింది. ఎన్నికల సంబంధ కార్యక్రమాల్లో చిన్నారులను ఉపయోగించుకోరాదంటూ ఎన్నికల కమిషన్ ఇటీవలే మార్గదర్శకాలు జారీ చేయడం తెలిసిందే. బంగార్ ఇటీవల ఓ జిల్లా పరిషత్ పాఠశాలలో పదేళ్లలోపు చిన్నారులతో ముచ్చటిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ''మీరేమీ తినకుండా ఉంటే ఏమైందని అమ్మానాన్న అడుగుతారు. బంగార్‌కే ఓటేయండి. అప్పుడే తింటాం అని చెప్పండి'' అన్నారు. వచ్చే ఎన్నికల్లో తనకే ఓటేయాలని తల్లిదండ్రులకు చెబుతామంటూ పిల్లలతో వల్లె వేయించారాయన. దీనిపై విపక్షాలన్నీ మండిపడ్డాయి.

చిన్నారిని ఓవెన్‌కు బలి చేసుకుంది...

కాన్సాస్ సిటీ: నిద్ర పుచ్చేందుకు ఉయ్యాలలో ఉంచాల్సిన శిశువును పొరపాటున ఓవెన్‌లో పెట్టింది ఓ తల్లి. తప్పు గ్రహించేలోగానే ఆ శిశువు తీవ్రంగా కాలిన గాయాలతో తనువు చాలించింది. ఈ విషాద ఘటన అమెరికాలోని మిస్సోరి రాష్ట్రం కాన్సాస్ సిటీలో చోటుచేసుకుంది. నగరానికి చెందిన మరియా థామస్ శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో తన శిశువును ఉయ్యాల తొట్టిలో పడుకోబెట్టి నిద్ర పుచ్చాలనుకుంది. అయితే, చిన్నారిని పొరపాటున ఓవెన్‌లో ఉంచి, ఆన్ చేసింది. తప్పు తెలుసుకునే సరికే చిన్నారి ఒళ్లు తీవ్రంగా కాలిపోయింది. ఆస్పత్రికి తరలించగా అప్పటికే శిశువు చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఎన్సీపీని లాగేసుకున్న ఈసీ: పవార్

పుణే: ఎన్సీపీని ఎన్నికల సంఘమే తమనుంచి లాగేసుకుందని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు శరద్ పవార్ వాపోయారు. ఎన్సీపీ పేరును, గుర్తును అజిత్ పవార్ వర్గానికి ఈసీ కేటాయించడం తెలిసిందే. ఆదివారం పుణేలో జరిగిన శరద్ పవార్ ఒక కార్యక్రమంలో దీనిపై స్పందించారు. ఎన్సీపీని స్థాపించి, బలోపేతం చేసిన వారి చేతుల్లో నుంచి లాగేసుకోవడమే గాక ఇతరులకు అప్పగిస్తూ ఈసీ తీసుకున్న నిర్ణయం ఆశ్చర్యం కలిగించిందన్నారు. దీన్ని ప్రజలు హర్షించరని నమ్మకం తనకుందని చెప్పారు.

జేడీ(యూ) ఎల్పీ భేటీకి ఎమ్మెల్యేలు డుమ్మా

పట్నా: సీఎం నితీశ్ కుమార్ సర్కారుపై అసెంబ్లీలో సోమవారం జరిగే విశ్వాస పరీక్షలో నెగ్గుతామని అధికార జేడీయూ ధీమా వ్యక్తం చేసింది. శనివారం సీఎం నితీశ్ ఇచ్చిన విందుకు కొందరు డుమ్మా కొట్టిన విషయం తెలిసిందే. అలాగే, ఆదివారం మంత్రి విజయ్ కుమార్ చౌదరి అధ్యక్షతన జరిగిన పార్టీ శాసనసభా పక్షం భేటీకి సైతం కొందరు గైర్హాజరవడం కలకలం రేపింది. ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేలు తప్పనిసరి పరిస్థితుల్లో గైర్హాజరయ్యారని చౌదరి చెప్పారు. తొలుత ఆర్జేడీకి చెందిన స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం, అనంతరం ప్రభుత్వంపై విశ్వాస పరీక్షలో వారంతా ఓటేస్తారన్నారు. స్వతంత్ర ఎమ్మెల్యే సుమిత్ కుమార్ జేడీయూ ఎల్పీ భేటీలో పాల్గొనడం విశేషం. సోమవారం వామపక్ష సభ్యులతో కలిసి ఆర్జేడీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి చేరుకుంటారని తెలిసింది. వారం రోజులుగా హైదరాబాద్‌లో మకాం వేసిన 19 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆదివారం పట్నా చేరారు.



ప్రేమ మన డీఎన్ఏలోనే ఉంది

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

రాయ్‌గఢ్: మన దేశ డీఎన్ఏలోనే ప్రేమ ఉందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ మాత్రం దేశంలో విద్వేషం వ్యాప్తి చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఆయన భారత్ జోడో న్యాయ్ యాత్ర రెండు రోజుల విరామం తర్వాత ఆదివారం ఛత్తీస్‌గఢ్‌లో మొదలైంది. రాయ్‌గఢ్ ర్యాలీలో రాహుల్ మాట్లాడారు. ''భారత్‌లో భిన్న మతాలు, భిన్న సంప్రదాయాల ప్రజలు పరస్పరం ప్రేమతో శాంతియుతంగా జీవిస్తున్నారు. కానీ బీజేపీ, ఆర్ఎస్ఎస్ విద్వేష రాజకీయాల వల్ల ప్రతి ప్రాంతంలో విద్వేషం, హింస పెరిగిపోతున్నాయి. భాష ఆధారంగా కొందరు, రాష్ట్రాన్ని బట్టి ఇంకొందరు ఇతరులను ద్వేషిస్తామంటున్నారు'' అని ఆవేదన వెలిబుచ్చారు. విద్వేషం, హింసకు తావులేని హిందుస్తాన్‌ను భవిష్యత్ తరానికి అందించడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు.

అయోధ్యలో యూపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

అయోధ్య/లక్నో: ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిపి సుమారు 325 మంది అయోధ్యలో రామ్‌లల్లా దర్శనం చేసుకున్నారు. ఆదివారం ఉదయం లక్నో నుంచి 10 బస్సుల్లో, కొందరు తమ కార్లలో బయలుదేరి అయోధ్యకు చేరుకున్నారు. నగరంలో వారికి ఘన స్వాగతం లభించింది. పుణేలో ఉన్న సీఎం యోగి ఆదిత్యనాథ్ అయోధ్యకు చేరుకుని వారితో కలిశారు. కొందరు శాసనసభ్యులు తమ కుటుంబసభ్యులతో కలిసి వచ్చారు. అంతా కలిపి సుమారు 400 మంది విడతల వారీగా సుమారు రెండున్నర గంటల సమయంలో బాల రాముడి దర్శనం చేసుకున్నారు. దర్శనం తర్వాత గ్రూప్ ఫొటోలు తీసుకున్నారు. రాముడిని దర్శించుకున్న వారిలో బీజేపీ మిత్ర పక్షాల శాసనసభ్యులతోపాటు కాంగ్రెస్, బీఎస్పీకి చెందిన వారు కూడా ఉన్నారు. ప్రధాన ప్రతిపక్షం సమాజ్ వాదీ పార్టీ ఎమ్మెల్యేలెవరూ ఈ కార్యక్రమానికి రాలేదు. ప్రస్తుతం యూపీ శాసనసభలోని 399 మందిలో బీజేపీకి 252 మంది, మిత్రపక్షాలకు 19 మంది సభ్యుల బలముంది. ప్రతిపక్షంలో ఎస్పీకి 108 మంది, ఇతరులకు 20 మంది ఎమ్మెల్యేలున్నారు. ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి సైతం ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ హాజరుకాలేదు.

సంకీర్ణం దిశగానే పాక్...

ఎంక్యూఎం–పీతో నవాజ్ పార్టీ పీఎంఎల్ పొత్తు చర్చలు సఫలం

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. గురువారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజార్టీ రాకపోవడం తెలిసిందే. మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ సారథ్యంలోని పీఎంఎల్ (ఎన్) 75 సీట్లతో ఏకైక అతిపెద్ద పార్టీగా నిలిచింది. బిలావల్ భుట్టో సారథ్యంలోని పీపీపీకి 54, ముత్తాహిదా ఖ్వామి మూవ్‌మెంట్ పాకిస్తాన్ (ఎంక్యూఎం–పీ)కి 17, ఇతరులకు 12 సీట్లొచ్చాయి. 101 స్థానాల్లో ఇమ్రాన్ ఖాన్ మద్దతుదారులు గెలిచారు. ప్రభుత్వ ఏర్పాటు యత్నాల్లో నవాజ్ ముందంజలో ఉన్నారు.ఇతర పార్టీలతో చర్చల బాధ్యతను సోదరుడు షహబాజ్ షరీఫ్‌కు అప్పగించారు. ఆయన ఆదివారం ఎంక్యూఎం–పీతో ఆదివారం చర్చలు జరిపారు. అనంతరం కలిసి పని చేయాలని అంగీకారానికి వచ్చినట్లు సమాచారం. నవాజ్ షరీఫ్ పార్టీతోనే తమకు పొత్తు సౌకర్యంగా ఉంటుందని భావిస్తున్నామని ఎంక్యూఎం–పీ నాయకుడు హైదర్ రిజ్వీ చెప్పారు. పీపీపీ మాజీ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీతో కూడా షెహబాజ్ షరీఫ్ ఇప్పటికే చర్చలు జరిపారు. కానీ ప్రధానమంత్రి పదవిని తన కుమారుడు బిలావల్ భుట్టోకే కట్టబెట్టాలని జర్దారీ షరత్ విధించారు. అందుకు పీఎంఎల్–ఎన్ అంగీకరించడం లేదు. పాకిస్తాన్‌లో పార్టీల మధ్య పొత్తులు, ప్రభుత్వ ఏర్పాటుపై రెండు మూడు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉందంటున్నారు. నవాజ్ షరీఫ్‌కు పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసీమ్ మునీర్ కూడా మద్దతు పలుకుతున్నారు.

పాక్ జాతీయ అసెంబ్లీలో 266 స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా అభ్యర్థి మరణంతో ఒక చోట పోలింగ్ వాయిదా పడింది. రిగ్గింగ్ ఆరోపణలతో కొన్ని స్థానాల్లో తుది ఫలితాలను ఎన్నికల సంఘం ఇంకా ప్రకటించలేదు. ప్రభుత్వ ఏర్పాటుకు కనీసం 133 సీట్లు అవసరం.

సత్తా చాటిన ఇమ్రాన్ మద్దతుదారులు

అవినీతి ఆరోపణలతో జైలుపాలైనా పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ (పీటీఐ) అధినేత ఇమ్రాన్ ఖాన్ ఈ ఎన్నికల్లో సత్తా చాటారు. ఆయన పార్టీ అధికారికంగా పోటీలో లేదు. దాంతో ఆయన మద్దతుదారులు స్వతంత్ర అభ్యర్థులుగానే పోటీ చేశారు. వారికి ఎన్నికల సంఘం ఉమ్మడి గుర్తు కూడా కేటాయించలేదు. అయినా జాతీయ అసెంబ్లీలో ఏకంగా 101 స్థానాలను గెలుచుకుని సత్తా చాటారు. ఈ ఫలితాలు తమకు నైతిక విజయమంటూ ఇమ్రాన్ జైలునుంచే ప్రకటన విడుదల చేశారు.

సాక్షి
కరీంనగర్
సోమవారం ; 12 ; ఫిబ్రవరి ; 2024



చాంపియన్ కరీంనగర్

యాదాద్రి జిల్లాకేంద్రం భువనగిరిలో ఈనెల 9నుంచి జరుగుతున్న 56వ సీనియర్ తెలంగాణ రాష్ట్రస్థాయి ఖోఖో చాంపియన్ షిప్ 2023–24 పోటీలు ఆదివారం ముగిశాయి. పురుషుల విభాగంలో కరీంనగర్ జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వీరారెడ్డి బహుమతులు అందించారు.

న్యూస్‌రీల్

పారదర్శకంగా ఈవీఎంల ఎఫ్‌ఎల్‌సీ



ఈవీఎంల తీరును వివరిస్తున్న డీఆర్వో పవన్‌కుమార్

కరీంనగర్ అర్బన్: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం యంత్రాల మొదటి స్థాయి తనిఖీ పారదర్శకంగా ఇంజినీర్ల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి పవన్ కుమార్ తెలిపారు. ఈవీఎం గోడౌన్లో నిర్వహిస్తున్న ఈవీఎం యంత్రాల ఎఫ్‌ఎల్‌సీని ఆదివారం పరిశీలించారు. వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో ఈసీఐఎల్ ఇంజనీర్ల బృందం ఎఫ్‌ఎల్‌సీ చేపడుతుందని వివరించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, తెదేపా పార్టీల ప్రతినిధులు మడుపు మోహన్, సత్తినేని శ్రీనివాస్, సత్యనారాయణ రెడ్డి, కల్యాడపు ఆగయ్య పాల్గొన్నారు.

'ఎంపీ సంజయ్‌పై మంత్రి పొన్నం వ్యాఖ్యలు అర్థరహితం'



మాట్లాడుతున్న గుగ్గిళ్లపు రమేశ్

కరీంనగర్ టౌన్: అసెంబ్లీ వేదికగా కరీంనగర్ స్మార్ట్‌సిటీ విషయంలో ఎంపీ బండి సంజయ్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన ఆరోపణలు అర్థరహితమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేశ్ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం మాట్లాడుతూ.. ఇన్నేళ్లుగా కరీంనగర్ స్మార్ట్‌సిటీ పనుల్లో జరిగిన అక్రమాలపై పోరాటం చేసింది బీజేపీ పార్టీ అన్నారు. ఎంపీ బండి సంజయ్ పలుమార్లు స్మార్ట్‌సిటీపై పనులపై రివ్యూ చేశారని, పనుల జాప్యం, నాసిరకం అంశాలపై అధికారులను నిలదీసి పైఅధికారులకు ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అసెంబ్లీ వేదికగా స్మార్ట్‌సిటీ అంశంలో ఎంపీ బండి సంజయ్ కుమార్‌పై తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. రాబోయే ఎంపీ ఎలక్షన్లను దృష్టిలో ఉంచుకొని బండి సంజయ్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి స్మార్ట్‌సిటీ అవినీతిపై విచారణ జరిపి, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి కమిటీ వేయాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేంద్రప్రసాద్, జిల్లా కార్యదర్శి రాపర్తి ప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధులు బొంతాల కల్యాణ్‌చంద్ర, ఎడమ సత్యనారాయణరెడ్డి, సుధాకర్ పటేల్, పాదం శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

16న భారత్‌బంద్ జయప్రదం చేయండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ముకుందరెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): దేశవ్యాప్తంగా ఈ నెల 16వ తేదీన నిర్వహించ తలపెట్టిన కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్, ఖాజీపూర్, కమాన్‌పూర్, ఎలగందుల గ్రామాల్లోని గ్రానైట్ ఫ్యాక్టరీల్లోని కార్మికులకు హిందీలో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేసినట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటిస్తూ, ప్రభుత్వ వైఫల్యాలపై చార్జ్ ప్రకటిస్తూ లక్షలాది కుటుంబాల ఇంటికి వెళ్లి క్యాంపెయిన్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కార్మిక, ఉద్యోగ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎంపీడీవోల బదిలీ

కొత్తపల్లి(కరీంనగర్): పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జరుగుతున్న బదిలీ బాగంగా ఎంపీడీవోలను సైతం ఇతర జిల్లాలకు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్ జిల్లాకు చెందిన 12 మంది ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు కేటాయిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు వెలువరించారు. ఎడబోయిన శ్రీనివాస్‌రెడ్డి, సి.రవీందర్‌రెడ్డి, రావూరి పద్మావతి, ఆవునూరి స్వాతి, ఎనుకొండ స్వరూప, వేముల విజయలక్ష్మిలను జగిత్యాల, ఎస్.రాజీవ్ మల్హోత్రాను రాజన్న సిరిసిల్ల, తోడుపునూరి జయశ్రీను జయశంకర్ భూపాలపల్లి, యాదగిరి భాస్కర్‌రావు, నీలగిరి దివ్యదర్శన్ రావు, కొప్పుల శ్రీనివాస్‌లను పెద్దపల్లి, గుమ్మడి కల్పనను వరంగల్ జిల్లాకు బదిలీ చేశారు.

విచారణ తప్పదా!

- స్మార్ట్‌సిటీపై అధికారుల్లో గుబులు
- మంత్రి పొన్నం ప్రకటనతో పరేషాన్
- గతంలోనే అక్రమాలపై ఫిర్యాదులు



స్మార్ట్‌సిటీలో భాగంగా ఆధునికీకరించిన నగరంలోని ఓ జంక్షన్

కరీంనగర్ కార్పొరేషన్:

ఇప్పటికే భూ ఆక్రమణల విచారణతో అతలాకుతలమవుతున్న నగరపాలకసంస్థకు పులిమీద పుట్రలా స్మార్ట్‌సిటీ విచారణ వచ్చి పడనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో స్మార్ట్‌సిటీ నిధులతో నగర రూపురేఖలు మారేలా అభివృద్ధి పనులు జరగడం తెలిసిందే. ఈ పనుల్లో కొంతమంది అధికారులు చేతివాటం ప్రదర్శించారంటూ గతంలోనే అనేక ఫిర్యాదులు వెల్లువెత్తాయి. తాజాగా స్మార్ట్‌సిటీ పనుల్లో అవినీతి అక్రమాలపై విచారణ జరిపిస్తామన్న రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటనతో అధికారుల్లో గుబులు మొదలైంది.

రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి

స్మార్ట్‌సిటీ జాబితాలో చోటులభించడంతో కరీంనగర్ నగరపాలకసంస్థకు నిధుల వరద వచ్చి పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమాన భాగస్వామ్యంతో రూ.వెయ్యి కోట్లతో నగరంలో అభివృద్ధి పనులు చేపట్టారు. ఇప్పటికే రూ.740 కోట్లు విడుదల కాగా, ఇందులో రూ.539 కోట్లు చెల్లించారు. మరో రూ.200 కోట్లు చెల్లించాల్సి ఉంది. స్మార్ట్‌సిటీ కింద చేపట్టిన రోడ్లు, డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌లు, స్మార్ట్ వీధిదీపాలు, నిర్మాణం దాదాపు పూర్తయింది. కొన్ని కూడళ్ల నిర్మాణం పూర్తి కాగా, మరికొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. ఇక కమాండ్ కంట్రోల్, లైబ్రరీ, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాలు, పార్కులు తదితర అభివృద్ధి పనులు కూడా పూర్తి కావాల్సి ఉంది.

ఇష్టారీతిన అంచనాలు

రూ.వందలకోట్లతో చేపట్టిన స్మార్ట్‌సిటీ పనుల్లో కొంతమంది నగరపాలకసంస్థ అధికారులు కాంట్రాక్టర్లతో కలిసి చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా గతంలో బల్దియాలో అంతా తానై వ్యవహరించిన ఓ ఇంజినీరింగ్ అధికారి కనుసన్నల్లో చేసిన అంచనాలే తప్పినట్లు ఫిర్యాదులు వచ్చాయి. అభివృద్ధి పనులకు సంబంధించిన అంచనాలను ఇష్టారీతిన పెంచి, స్మార్ట్‌సిటీ నిధులను కాంట్రాక్టర్ల జేబుల్లోకి మళ్లించినట్లు అభియోగాలున్నాయి. రూ.50 లక్షలతో పూర్తయే జంక్షన్ పనికి, రూ.కోటికి పైగా బిల్లు చేసిన వైనం నగరపాలకసంస్థ ఉన్నతాధికారులను విస్మయానికి గురిచేసింది. వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ భవన నిర్మాణంలోనూ అంచనాలు, బిల్లులపై అనేక ఆరోపణలు వచ్చాయి.

లెస్ క్వాలిటీ

నగరంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్‌సిటీ పనుల్లో నాణ్యతా లోపం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. తమ లాభాల కోసం అంచనాలు భారీగా పెంచినప్పటికీ, చేసిన పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో వాటి మనుగడ కష్టంగా మారింది. కలెక్టరేట్ రోడ్డు, హౌసింగ్‌బోర్డు కాలనీ, అంబేడ్కర్ స్టేడియం, టవర్‌సర్కిల్ తదితర ప్రాంతాల్లో నాణ్యతా లోపాలు బయటపడ్డాయి. సీసీరోడ్డు కుంగిపోగా, డ్రైనేజీలు నిర్మాణంలోనే కూలిపోయాయి. ఫుట్‌పాత్‌లైతే చెప్పాల్సిన అవసరం లేదు. నగరంలో ఫుట్‌పాత్‌లపై వేసిన టైల్స్ 90 శాతం సక్రమంగా లేవు. టవర్‌సర్కిల్ వద్ద డ్రైనేజీల నుంచి ఫుట్‌పాత్‌ల మీదుగా వచ్చే వరదనీళ్లు ఫౌంటేన్‌ల మాదిరిగా మారాయి. కూడళ్లకు వినియోగించిన మెటీరియల్ కూడా నాసిరకం వాడారనే ఆరోపణలున్నాయి. ఎక్కడో ఒకటి అరా తప్ప దాదాపు అన్ని పనుల్లో నాణ్యతా ప్రమాణాలు అంతంతమాత్రంగానే ఉన్నాయనే ఫిర్యాదులున్నాయి.

నగరపాలక అధికారుల్లో గుబులు

స్మార్ట్‌సిటీ పనులపై విచారణ అంటేనే అధికారుల్లో వణుకుపుడుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్మార్ట్‌సిటీ పనుల్లో అక్రమాలు మళ్లీ తెరపైకి వచ్చాయి. తొలుత హౌసింగ్‌బోర్డుకాలనీ తదితర ప్రాంతాల్లో విజిలెన్స్ అధికారులు విచారణ జరిపినప్పటికీ, పూర్తిస్థాయిలో మాత్రం దృష్టి పెట్టలేదు. కేవలం వ్యక్తిగత ఫిర్యాదుల ఆధారంగానే విచారణ సాగినట్లు సమాచారం. తాజాగా మంత్రి పొన్నం ప్రభాకర్ స్మార్ట్‌సిటీ అక్రమాలపై విచారణ జరిపిస్తామని మరోసారి వెల్లడించడం హాట్‌టాపిక్‌గా మారింది. మొత్తం పనులపై విచారణ జరిపితే, చాలా విషయాలు బయటకు రానున్నాయి. దీంతో సాంకేతికంగా బాధ్యులుగా తేలే చాన్స్ నగరపాలకసంస్థ అధికారులకే ఉండడంతో, ఈ విచారణ వారి మెడకు చుట్టుకొనే అవకాశం ఉంది. ఇప్పటికే భూ ఆక్రమణలకు సంబంధించి నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారుల పాత్రపై పోలీసులు ఆరా తీస్తుండగా, మరో వైపు స్మార్ట్‌సిటీ పనులపైనా విచారణ జరిగితే కొంతమంది ఇంజినీరింగ్ అధికారుల అక్రమాల బాగోతం బయటపడనుంది. మరికొద్ది రోజుల్లో విచారణపై స్పష్టత రానుంది.

మోదీతోనే దేశాభివృద్ధి



కథలాపూర్ మండలం దూంపేటలో ప్రజాహిత యాత్రలో ఎంపీ బండి సంజయ్

- గ్రామాల అభివృద్ధిలో కేంద్రం నిధులే అధికం
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్
- వేములవాడ నియోజకవర్గంలో కొనసాగుతున్న ప్రజాహిత యాత్ర

కథలాపూర్/రుద్రంగి/చందుర్తి(వేములవాడ): ప్రధాని నరేంద్రమోదీతో దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల్లో కేంద్ర ప్రభుత్వం నిధులే అధికమని వివరించారు. ఆదివారం రెండో రోజు ప్రజాహిత యాత్ర కథలాపూర్ మండలం సిరికొండ, కథలాపూర్, దుంపేట, దూలూర్, పోసానిపేట, తాండ్ర్యాల, అంబారిపేట, కలిగోట గ్రామాతో పాటు రుద్రంగి, చందుర్తి మండలాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా స్థానిక మహిళలు భారీ ఎత్తున తరలివచ్చి స్వాగతం పలికారు. బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, మొక్కల పెంపకం, మరుగుదొడ్ల నిర్మాణాలు, చెత్త సేకరణకు ట్రైసైకిళ్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఇంటింటా తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కలిగోట సూరమ్మ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి కాలువలు నిర్మిస్తే ఈ ప్రాంతానికి సాగునీటి సమస్య తీరుతుందని ప్రజలు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. పలు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ప్రజలు విన్నవించగా.. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో తారు రోడ్లు నిర్మించామని, మరోసారి అధికారంలోకి వచ్చాక మండలంలోని అన్ని గ్రామాల్లో రోడ్డు సౌకర్యం మెరుగుపరుస్తామని తెలిపారు. పలువురు యువకులు ఎంపీతో సెల్ఫీ ఫొటోలు దిగేందుకు పోటీ పడ్డారు. ఆయా గ్రామాల్లో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, ఛత్రపతి శివాజీ విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. రుద్రంగిలోని ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాన్ని సందర్శించారు. చందుర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీ బండి సంజయ్ ప్రజాహిత యాత్ర ప్రజలను పలకరిస్తూ, సమస్యలు తెలుసుకుంటూ ముందుకుసాగింది. లింగంపేటలోని రేషన్‌షాపులో పేదలకు అందిస్తున్న బియ్యాన్ని పంపిణీ చేశారు. అక్కడ ఉన్న వారితో ఉపాధిహామీ పథకం గురించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఏడు పథకాల గురించి వారికి వివరించారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ నియోజకవర్గ నేత చెన్నమనేని వికాస్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, ప్రతాప రామకృష్ణ ఎంపీ సంజయ్‌కుమార్‌కు మద్దతు ప్రకటించి పాదయాత్ర చేశారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

- నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాను అరికడతాం
- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్
- హుజూరాబాద్‌లో ఘన సత్కారం



పూలమాల వేస్తున్న ఎమ్మెల్సీ వెంకట్, ప్రణవ్

హుజూరాబాద్/జమ్మికుంట/ఇల్లందకుంట: పెండింగ్‌లో ఉన్న దళితబంధు, కొత్త రేషన్‌కార్డులు, ఆరుగ్యారంటీల అమలుకు కృషి చేస్తామని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన వెంకట్ మొదటిసారి ఆదివారం హుజూరాబాద్‌కు రాగా, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులు వెంకట్, ప్రణవ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీ వెంకట్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ.50లక్షలు హుజూరాబాద్ అభివృద్ధికి కేటాయిస్తానని ప్రకటించారు. హుజూరాబాద్‌ను పీవీ జిల్లాగా మార్చడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హుజూరాబాద్ ప్రజలకు వొడితల ప్రణవ్ అందుబాటులో ఉంటారని, అతని ద్వారా సమస్యలను తనదృష్టికి తీసుకురావాలని సూచించారు. వొడితెల ప్రణవ్ మాట్లాడుతూ.. కష్టపడ్డ వారికి కాంగ్రెస్‌లో గుర్తింపు ఉంటుందనడానికి బల్మూరి వెంకట్ నిదర్శనమన్నారు. చిన్న వయస్సులో వెంకట్‌కు ఎమ్మెల్సీ పదవి రావడం హర్షనీయం అన్నారు. ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయం, జమ్మికుంట మండలంలోని బిజిగిరి షరీఫ్ దర్గాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని వెంకట్‌ను ప్రణవ్ కోరారు. అనంతరం సింగాపూర్ నుంచి ర్యాలీగా వెళ్లి ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జమ్మికుంట మండలంలోని బిజిగిరిషరీఫ్ దర్గాను దర్శించుకున్నారు. ఇల్లందకుంట ఆలయాన్ని, బిజిగిరిషరీఫ్ దర్గాను దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సహకారంతో అభివృద్ధి చేస్తామని వెంకట్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజవర్గ ఇన్‌చార్జి తిప్పారపు సంపత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొల్లూరి కిరణ్, పట్టణ అధ్యక్షుడు సొల్లు బాబు, మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఆలేటి సుశీల, పట్టణ అధ్యక్షురాలు వేములు పుష్పలత, చల్లూరి రాహుల్, చందమల్ల బాబు, ఎండీ అప్సర్, గంట కిరణ్‌రెడ్డి, టీకుల శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'గేట్'



పరీక్షకేంద్రం వద్ద మాట్లాడుతున్న విద్యార్థులు

తిమ్మాపూర్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌ఈ) బెంగుళూరు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గేట్ పరీక్షలు జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కోఆర్డినేటర్ మనోజ్ తెలిపారు. తిమ్మాపూర్ మండలంలోని శ్రీచైతన్య, వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలు, కరీంనగర్‌లోని అల్ఫోర్స్ కళాశాలలో పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం షిఫ్టుల్లో నిర్వహించారు. గంటన్నర ముందే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. శ్రీచైతన్య కళాశాలలో ఉదయం షిఫ్టులో పరీక్ష రాసే విద్యార్థులు అడిషనల్ రఫ్ పేపర్లు ఇవ్వలేదని ఆరోపించారు. గైడ్‌లైన్స్‌లో ఇవ్వాలని ఉన్నా పట్టించుకోలేదని ఓ విద్యార్థి తెలిపారు. ఈ విషయమై డయల్ 100కు సమాచారం ఇచ్చామని ఓ ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు తెలిపాడు. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా గైడ్‌లైన్స్ ప్రకారమే అందించామని, ఒక్క విద్యార్థికి 16పేజీల అడిషనల్ పేపర్ అందించామని తెలిపారు. కావాలనే కొందరు దీనిపై రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లినట్లు తెలిపారు. కేంద్రంలో సీసీ కెమెరాలు లేవని అధికారి మనోజ్ వెల్లడించారు.

నల్గొండ సభను విజయవంతం చేయాలి




మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

- కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్: ఈనెల 13న నిర్వహించే చలో నల్గొండ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం కరీంనగర్ ఎమ్మెల్యే నివాసంలో నల్గొండ సభకు సంబంధించి కరీంనగర్ నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కృష్ణానదిపై తెలంగాణ ప్రాజెక్టులు, నీటిహక్కులను హరించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర సంస్థ కేఆర్ఎంబీకి అధికారాలు అప్పగించడం ద్వారా జరగబోయే దుష్పరిణామాలను తెలంగాణ సమాజానికి వివరించేందుకు నల్గొండలో ఈనెల 13న నిర్వహించతలపెట్టిన బహిరంగ సభను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణను వివరించారు. కరీంనగర్ నియోజకవర్గం నుండి 2000 మందిని తరలిస్తున్నట్లు వెల్లడించారు. మేయర్ వై.సునీల్ రావు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, పాక్స్ చైర్మన్ పెండ్యాల శ్యామ్ సుందర్‌రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏం చేద్దాం!

- కేంద్ర అనుమతి లేక నిలిచిన బియ్యం సేకరణ
- లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు రేషన్‌వైపు మిల్లర్ల చూపు
- సీఎంఆర్ గడువు పెంచకపోవడంతో అధికారుల్లో గందరగోళం



కరీంనగర్ అర్బన్: కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ప్రక్రియ నిలిచిపోయింది. గతనెలతో గడువు ముగియడం, కేంద్రం నుంచి బకాయి బియ్యం సేకరణపై ఉత్తర్వులు లేకపోవడంతో అధికారులు సేకరణ నిలిపివేశారు. పక్షం రోజులైనా సీఎంఆర్‌పై స్పష్టత లేకపోవడంతో గందరగోళం నెలకొంది. మిల్లర్లను బకాయి బియ్యం పెట్టాలని ఒత్తిడి చేయాలా..? వద్దా..? అన్న అనుమానం అధికారులది. భారీగా బకాయి పడ్డ మిల్లుల నుంచి నెమ్మదిగా వసూలు చేసేందుకు అధికారులు కసరత్తు చేసిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు ఉన్న బకాయి బియ్యం వసూలు చేయడంతో పాటు ఇకపై బకాయిలు లేకుండా చేయాలని అధికారులు చేస్తున్న ప్రయత్నాలకు బ్రేక్ పడినట్లయింది.

ఉత్తర్వులు వచ్చేనా..?

కేంద్ర ప్రభుత్వం బకాయి బియ్యం వసూలుపై గడువు పెంచకపోవడం చర్చనీయాంశమైంది. ఇప్పటికే పౌరసరఫరాలశాఖ అప్పుల ఊబిలో ఉన్న క్రమంలో దారిలో పెట్టేందుకు అనేక చర్యలు తీసుకుంటున్న తరుణంలో గడువు పెంపు సమస్య రావడంతో రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి ఇరకాటంలో పడింది. కేంద్రం అనుమతి లేకుండా బియ్యం సేకరణ సాధ్యం కాదు. ఎలాంటి గ్యారంటీలు లేకుండా రూ.కోట్ల విలువ చేసే సీఎంఆర్ కేటాయింపు జరిగినందున నెమ్మదిగా బియ్యం వసూలు చేయాలని అధికారులు నిర్ణయించారు. పురోగతి ఉన్న మిల్లులకు మరికొంత గడువు ఇస్తూ సాధ్యమైనంత వరకు బకాయిలు వసూలు చేయాలని అధికారులు చర్యలు తీసుకున్నారు. మొండి బకాయిదారులపై కఠినంగా వ్యహరించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

లక్షల మెట్రిక్ టన్నులు బకాయి

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకా సీఎంఆర్‌పై కఠినంగా వ్యవహరిస్తుండగా జనవరి నెలాఖరులోగా సీఎంఆర్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. లేకుంటే కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొనగా గడువు ముగియగా ఎలాంటి చర్యలు లేవు. పలువురు మిల్లర్లు 2022–23 వానకాలం సీజన్‌కు సంబంధించి జిల్లా, ఇతర జిల్లాల రైతుల నుంచి సేకరించిన 2,96,900.440 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లుల కెపాసిటీని బట్టి కరీంనగర్ జిల్లాలోని దాదాపు అన్ని మిల్లులకు కేటాయించారు. ఇప్పటివరకు 1,99,901.890 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే ప్రభుత్వానికి ఇచ్చారు. ఇంకా 34,863,690 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా గత డిసెంబర్ 31 వరకే ఉన్న గడువును జనవరి నెలాఖరు వరకు పెంచారు. ఇక 2022–23 యాసంగి సీజన్లో 3,74,825.280 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి మిల్లులకు అందించారు. 2,53,634,580 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు 60,088 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ఇచ్చారు. ఇంకా 1,93,544 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది. దీనికి కూడా జనవరి 31 వరకే గడువు.

ప్రభుత్వ సొమ్ముతో మిల్లర్ల మోసాలు

జిల్లాలో జమ్మికుంట, హుజూరాబాద్, మానకొండూర్, సదాశివపల్లి, తిమ్మాపూర్, కరీంనగర్ చుట్టుపక్కల్లో రైస్‌మిల్లులు ఎక్కువగా ఉన్నాయి. ఏటా వానకాలం, యాసంగి సీజన్లలో రైతుల నుంచి ధాన్యం కొంటున్న ప్రభుత్వం, పైసాఖర్చు లేకుండా మిల్లులకు కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్) పేరిట సరఫరా చేస్తోంది. ఇదే అదునుగా కొందరు మిల్లర్లు అడ్డదారులు తొక్కారు. బియ్యాన్ని తిరిగి ఇవ్వకుండా నేరుగా ధాన్యాన్నే అమ్ముకొని సొమ్ము చేసుకునే స్థాయికి దిగజారారు. ఇటీవల జమ్మికుంట, హుజూరాబాద్ ప్రాంతంలోని ఏడు మిల్లుల్లో తనిఖీ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అక్కడ జరుగుతున్న తతంగానికి అవాక్కయ్యారు. లక్షల క్వింటాళ్ల ధాన్యం మాయమైనట్లు గుర్తించారు. జమ్మికుంటకు చెందిన ఒక మిల్లరు అక్రమాలను చూసి ఆశ్చర్యపోయారు. ఈ ఒక్క మిల్లులోనే దాదాపు 4లక్షల క్వింటాళ్లకు పైగా ధాన్యం లోటును గుర్తించినట్లు పక్కా సమాచారం. అలాగే శంకరపట్నం మండలం మొలంగూర్‌లోని ఒక మిల్లులో కూడా ఇలాంటి బాగోతమే బయటపడగా జిల్లా పౌరసరఫరాలసంస్థ మేనేజ ర్ రజనీకాంత్ బాధ్యుడిపై కేసు పెట్టారు. విజి లెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కరీంనగర్‌లోని రెండు, మానకొండూర్‌లో రెండు, తిమ్మాపూర్ మండలం రేణికుంటలో మరో రెండు రైస్‌మిల్లులను తనిఖీ చేశారు. సదరు మిల్లుల్లోనూ ప్రభుత్వం కేటాయించిన ధాన్యం పూర్తి స్థాయిలో లేదని సమాచారం. అయితే మొ లంగూర్‌కు చెందిన ఓ రైస్‌మిల్లరుపై కేసు నమో దు చేసిన అధికారులు మిగతా మిల్లర్లపైనా ఎందుకు చేయలేదన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.



హరితహారానికి గొడ్డలిపెట్టు

హరితహారంలో రూ.కోట్లు వెచ్చించి మొక్కలు నాటారు. వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కాగా.. కరీంనగర్‌లో ఈనెల 14 నుంచి జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో భాగంగా కలెక్టర్ క్యాంపు ఆఫీసు ఎదురుగా ఇరుపక్కల ఉన్న భారీ వృక్షాలను ఆదివారం తొలగించారు. ఏర్పాట్లకు అడ్డంకిగా ఉన్న కొమ్మలను తొలగిస్తే సరిపోయేది. కానీ.. సర్కారోళ్లు చెట్ల మొదళ్ల నుంచి నరికివేయడం ఏంటని హరితప్రియులు, పర్యావరణవేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

క్లుప్తంగా

గురుకుల పరీక్ష రాసి వెళ్తున్న విద్యార్థికి గాయాలు


విద్యార్థిని ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గురుకుల పాఠశాలలో ఆదివారం జరిగిన గురుకుల ప్రవేశ పరీక్షకు హాజరై తిరిగి వెళ్తున్న రుద్రంగి మండలం మానాలకు చెందిన విద్యార్థిని మానస(10)ను ఆటో ఢీకొట్టింది. దీంతో చిన్నారి గాయపడగా.. వెంటనే 108 సిబ్బంది ఈఎస్టీ ప్రవీణ్, పైలట్ ప్రవీణ్ చేరుకుని ప్రథమ చికిత్స అందించారు. అనంతరం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మైతాపూర్‌లో కిడ్నాప్ కలకలం

రాయికల్(జగిత్యాల): రాయికల్ మండలం మైతాపూర్‌లో బాలుడి కిడ్నాప్ కలకలం రేపింది. మైతాపూర్‌లో ఐదో తరగతి చదువుతున్న బాలుడిని ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి మీ నాన్న రమ్మన్నాడంటూ చాక్లెట్ ఇచ్చి కారులో ఎక్కించే యత్నం చేశారు. గమనించిన బాలుడు సమయస్ఫూర్తితో కారులో ఉన్న వ్యక్తి చేతిని కొరికి పరారీ అయ్యాడనే విషయం సోషల్ మీడియంలో వైరల్ కావడంతో విషయం తెలుసుకున్న ఎస్సై అజయ్ సంఘటన స్థలానికి చేరుకొని సీసీ కెమెరా పరిశీలించారు. ఆ సంఘటన స్థలంలో కారులో అనుమానాస్పద వ్యక్తులు తిరగలేదని ప్రజలు ఎవరూ భయాందోళన చెందవద్దని అన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే 100కు డయల్‌చేయాలని కోరారు.

చైన్‌స్నాచింగ్‌కు విఫలయత్నం

- దేహశుద్ధి చేసిన స్థానికులు

సుల్తానాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని అంబేడ్కర్‌నగర్ చెందిన శ్యామల ఆదివారం సాయంత్రం తన ఇంటి నుంచి బయటకు వెళ్తోంది. ఈక్రమంలో ఇద్దరు రైస్‌మిల్లు కూలీలు ఆమె మెలోంచి బంగారు గొలుసు దొంగలించే ప్రయత్నం చేశారు. ఆ మహిళ ప్రతిఘటించింది. గట్టిగా కేకలు వేసింది. అప్రమత్తమైన స్థానిక యువకులు వెంటపడి దొంగలను పట్టుకున్నారు. వారికి దేహశుద్ధి చేసి పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వినీత తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- రెండు తులాల బంగారు చైన్లు
- రూ.లక్ష మాయం


బీరువా పగులగొట్టిన దొంగలు

వేములవాడ అర్బన్: వేములవాడ మండలం ఆరెపల్లిలోని తాళం వేసి ఉన్న నడిగొట్ల శ్రీనివాస్ తాళం ఇంట్లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసుల, బాధితులు తెలిపిన వివరాలు. శ్రీనివాస్ గల్ఫ్‌లో ఉండడంతో అతని భార్య మంజుల సమీప బంధువుల ఇంట్లో పడుకుంటుంది. ఉదయం లేచి ఇంటి కొచ్చి చూసే సరికి గేట్ తాళం, ఇల్లు తాళం, బీరువా తాళం పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో దాచిన రూ.లక్ష నగదు, రెండు తులాల బంగారం చైన్లు దొంగలించినట్లు బాధితులు తెలిపారు. సంఘటన స్థలంలో క్లూస్ టీమ్ సిబ్బంది తనిఖీ చేశా రు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

ఇన్‌స్పైర్ చేస్తున్నారు

- సైన్స్ ప్రదర్శనలో ప్రతిభ చూపుతున్న విద్యార్థులు
- సమస్యలకు సాంకేతికతతో పరిష్కారం
- ఆవిష్కరణలతో విద్యార్థులకు గుర్తింపు
- అబ్బురపరుస్తున్న చిన్నారుల ఆలోచనలు
- జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి ఏడు ప్రాజెక్టుల ఎంపిక
- అభినందిస్తున్న అధికారులు

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యార్థులు తమ ఆలోచనలకు రూపమిస్తూ రూపొందిస్తున్న నూతన ఆవిష్కరణలు అబ్బురపరుస్తున్నాయి. నిత్య జీవితంలో మనం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు చిట్టిబుర్రలు కనిపెడుతున్నాయి. పారిశ్రామికంగా ఎదురయ్యే సమస్యలు.. వాతావరణ కాలుష్య నివారణ.. తదితర నిత్య సమస్యలకు పరిష్కారాలు చూపుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణలు రూపొందిస్తున్నారు. వినూత్న ఆలోచనలతో అడుగులు వేస్తున్న విద్యార్థులు, వారి ఉపాధ్యాయుల సలహాలతో అద్భుత ఆవిష్కరణలకు రూపమిస్తున్నారు. 2022–23 విద్యాసంవత్సరానికి జాతీయస్థాయిలో నిర్వహించే ఇన్‌స్పైర్ మానక్‌లో మనోళ్లు రాష్ట్రస్థాయి వరకు వెళ్లారు. దాదాపు 67 ప్రదర్శనలలో రాజన్నసిరిసిల్ల జిల్లా నుంచి 7 ప్రదర్శనలు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. వీరందరూ జాతీయస్థాయిలో రాణించి సిరిసిల్ల సైన్స్ విజ్ఞానాన్ని దేశవ్యాప్తం చాటాలని ఆకాంక్షిస్తున్న తరుణంలో 'సాక్షి' ప్రత్యేక కథనం..

శ్రామికుల శ్రమ తగ్గించేందుకు..



చేనేత, పవర్ లూమ్ పరిశ్రమకు కేరాఫ్ అడ్రస్ సిరిసిల్ల. మగ్గాలపై ఉత్పత్తి అయిన వస్త్రాన్ని మడతపెట్టడం కొంత ఇబ్బంది అయిన పని. దీని శ్రమను తగ్గించేందుకు రూపొందించిన మిషన్‌తో ఒక కార్మికుడు గంటలో చేసే పనిని పది నిమిషాల్లో పూర్తి చేయగలం. నేను రూ.2వేల వరకు ఖర్చు పెట్టి ఈ మిషిన్‌ను తయారు చేసిన. బట్ట మడతపెట్టడమే కాదు చిరుగులు ఉన్నా గుర్తిస్తుంది. దీన్ని తయారు చేయడానికి నేను చక్రాలు, చైన్స్, మోటార్, సెన్సార్‌ను వినియోగించాను. మా సైన్స్ టీచర్ శంకర్ సార్ సలహాలు ఉపయోగపడ్డాయి.

– జక్కని హేమంత్, 10వ తరగతి, శివనగర్ స్కూల్

సాధారణ సమస్య..సాంకేతికంగా..



నేను చేసిన ప్రాజెక్టు అత్యంత సాధారణమైంది. కానీ రోజువారి జీవితంలో అవసరమైంది. మన ఇంటిలో.. అపార్ట్‌మెంట్‌లో అనేక సార్లు డ్రెయినేజీ పైపులలో ఏదో ఒకటి ఇరుక్కుంటుంది. దీన్ని సరిచేయడానికి పైపులను పగులకొడతాం. కానీ నేను చేసిన ప్రయోగంతో అసలు ఎలాంటి డ్యామేజీ లేకుండా పైపులలో ఇరుక్కున్న వస్తువులను సులభంగా తీయగలం. దీని కోసం వాడిపడేసిన బైక్స్ క్లచ్ కేబుల్స్ తీసుకున్నాను. దానికి ముందుభాగంలో విచ్చుకునేలా కొన్ని స్ట్రిప్స్ పెట్టాను. మనం కేబుల్స్‌ను పైపులోకి పెట్టి మన చేతి భాగం వద్ద ఏర్పాటు చేసిన మరో భాగాన్ని నొక్కగానే ముందున్న స్ట్రిప్స్ విచ్చుకుని పైపులో ఇరుక్కున్న వాటిని పట్టుకుంటుంది. ఇలా పైపులలో ఇరుకున్న వస్తువులను బయటకు తీసేయవచ్చు. దీనిని మొబైల్‌కు అనుసంధానించి పైపులో ఏమున్నదో.. లేదో పరిశీలించవచ్చు. దీనికి కేబుల్స్, సెన్సార్ ఖర్చు తప్ప మరేమి లేదు. గైడ్ టీచర్ కోరెం వెంకటేశం సలహాలు ఉపయోగపడ్డాయి. ప్రాజెక్టు ఖర్చు రూ.200 మాత్రమే.

– అన్నాడి సాహిత్య, 8వ తరగతి, హన్మాజీపేట స్కూల్

ఆటోమేటిక్ గ్యాస్ బుకింక్ సిస్టమ్



సిలిండర్ బండలో గ్యాస్ ఒక స్థాయి వరకు ఖాళీ కాగానే రీఫిల్ చేయడానికి అవసరమైన సులభ పద్ధతి కోసం చేసిన ఆలోచనే ఆటోమేటిక్ గ్యాస్ బుకింక్ సిస్టమ్. దీని ద్వారా గ్యాస్ సిలిండర్‌లో ఒక కిలో గ్యాస్ ఉండగానే మనకు హెచ్చరిక వస్తుంది. అంతేకాకుండా మన గ్యాస్ ఏజెన్సీ నంబర్‌కు రీఫిల్లింగ్ కోసం ఆర్డర్ వెళ్తుంది. దీని కోసం సెన్సార్, రిలే, స్పీకర్, పవర్ సప్లయ్ వంటి పరికరాలను ఉపయోగించాను. ఈ ప్రాజెక్టుకు దాదాపు రూ.వెయ్యి ఖర్చు అవుతుంది. నా ప్రాజెక్టుకు గైడ్ టీచర్ రమేశ్, హెచ్‌ఎం అనురాధ ప్రోత్సహించారు.

– వై.లోకేశ్, 10వ తరగతి, జిల్లెల స్కూల్

తరగతి గది.. ఆవిష్కరణకు నాంది..



తరగతిలో టీచర్లు బ్లాక్‌బోర్డుపై రాసిన వాటిని చెరిపే సమయంలో చాక్‌పీస్ డస్ట్ గదంతా పడడం గమనించాను. ఇది డస్ట్ ఎలర్జీకి కారణమవుతుంది. ఈ సమస్య పరిష్కారానికి 'డస్ట్ లెస్ డస్టర్' ప్రాజెక్టును రూపొందించాను. స్పాంజీలు, ఒక మోటార్ బిగించి, బ్యాటరీకి అతికించాము. ఎప్పుడైతే మనం బోర్డుపై అక్షరాలను చెరిపి వేయాలనుకున్నప్పుడు బ్యాటరీని నొక్కి తుడిస్తే స్పాంజీలు తిరిగి బోర్డు క్లీన్ అవుతుంది. డస్ట్ అంతా మనం ఏర్పాటు చేసిన బాటిల్‌లోకి చేరుతుంది. ఇలా బ్లాక్‌బోర్డుపై డస్ట్ కింద పడదు. దీనికి రూ.వెయ్యి వరకు ఖర్చు అవుతుంది. గైడ్ టీచర్‌గా రజిత సూచనలు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

– ఎ.ఆదర్శ్‌చారి, 9వ తరగతి, గాలిపల్లి స్కూల్

కాలుష్య నివారణకు..



బట్టలను ఉతికేందుకు ఇప్పుడు అందరూ వాషింగ్‌మిషిన్స్ వాడుతున్నారు. ఇలా బట్టలు ఉతికిన ప్రతీసారి మురికినీరు నేలలో చేరి నేలను కలుషితం చేస్తుంటుంది. ఈ నేల కాలుష్యాన్ని నివారించేందుకు డ్రెయిన్ వాటర్‌లోని మైక్రోఫైబర్స్, మెటల్స్‌ను తీసివేయాలని ఆలోచించాను. దీని కోసం ప్రత్యేక పరికరంతో మైక్రో ఫైబర్ ఫిల్టర్స్ వాడి లాండ్రి వాటర్ నుంచి కాలుష్య కారకాలను సేకరిస్తుంది. దీని తయారు చేయడానికి వాషింగ్‌మిషిన్ పైపులు, మైక్రో ఫిల్టర్ మిషిన్ అవసరం. ప్రాజెక్టుకు దాదాపు రూ.3వేలు ఖర్చు అవుతుంది. నాకు మమత చేసి సహాయంతో ప్రాజెక్టు చేశాను.

– జాహ్నవి, 9వ తరగతి కేజీబీవీ, రుద్రంగి

అద్భుత అవకాశాలు



విద్యార్థులకు అద్భుతమైన పరిశీలన, పరిజ్ఞానం ఉంది. వీరికి మరిన్ని అవకాశాలు కల్పించి, సౌకర్యాలు ఏర్పాటు చేస్తే సిరిసిల్ల సైన్స్ ప్రతిభను ప్రపంచానికి తెలిపేలా కార్యక్రమాలు చేపడతాం. జిల్లా విద్యాధికారికి సైన్స్ ల్యాబ్, పరిశోధనలకు అవసరమైన సదుపాయాల గురించి విన్నవించాం. జిల్లా ఉన్నతాధికారుల సహకారంతో విజయవంతంగా ముందుకెళ్తున్నాం. విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులలో రాణించడం సంతోషదాయకం.

– దేవయ్య, జిల్లా సైన్స్ ఆఫీసర్, సిరిసిల్ల

చికిత్స పొందుతూ యువకుడు మృతి


ప్రశాంత్ (ఫైల్)

జమ్మికుంట: ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధి కేశవపూర్ గ్రామానికి చెందిన కన్నెవేన ప్రశాంత్(28) కొంతకాలంగా కడుపునొప్పి బాధపడుతున్నాడు. ఆ బాధను భరించలేదక శనివారం పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయాడు. మృతుడితల్లి తిరుపతమ్మ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నిప్పంటుకుని వృద్ధురాలు..


పెద్దోజు నాగమ్మ (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని జూపాక గ్రామంలో గ్యాస్‌పైపు లీకేజై మంటలు అంటుకోవడంతో వృద్ధురాలు గాయపడింది. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయింది. గ్రామానికి చెందిన పెద్దోజు నాగమ్మ(75) శనివారం సాయంత్రం వంటచేస్తుండగా గ్యాస్ లీకేజీ అయ్యింది. అది గమనించని నాగమ్మ దీపం వెలగించింది. దీంతో మంటలు చెలరేగాయి. అవి నాగమ్మకు అంటుకున్నాయి. గమనించిన ఇంటిస మీపంలో వారు వచ్చి మంటలు ఆర్పి నాగమ్మకు హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం వేకువజామున చనిపోయింది.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మానకొండూర్: మానకొండూర్ మండలం శంశాబాద్ సమీపంలో కరీంనగర్– వరంగల్ ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సీఐ మాదాసు రాజ్‌కుమార్ వివరాల ప్రకారం.. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. మృతుడి వయసు 40ఏళ్లు ఉంటుందని, లుంగీ, చొక్కా ధరించినట్లు సీఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ ముఠా పట్టివేత

- ఏడుగురిపై కేసు.. ముగ్గురి అరెస్టు


పోలీసులు సీజ్ చేసిన నిందితుల వాహనాలు

మానకొండూర్: చెడు వ్యసనాలకు అలవాటు పడిన నలుగురు స్నేహితులు ముఠాగా ఏర్పడ్డారు. పలు జిల్లాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయబావుల వద్ద మోటార్లు చోరీ చేస్తూ మానకొండూర్ పోలీసులకు చిక్కారు. సీఐ మాదాసు రాజ్‌కుమార్ వివరాల ప్రకారం.. ఈ నెల 10న మానకొండూర్ మండలంలోని గట్టుదుద్దెనపల్లి శివారులో ఎస్22 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని 41కిలోల రాగి, వైండింగ్ కాయిల్స్ చోరీకి గురయ్యాయని చెంజర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ మెరుగు రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. శనివారం సదాశివపల్లి స్టేజీ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. మానకొండూర్ నుంచి కరీంనగర్ వైపు బొలెరో, స్కూటీపై వెళ్తున్న మానకొండూర్‌కు చెందిన కోండ్ర ఫణీంద్ర, కరీంనగర్ సుభాస్‌నగర్‌కు చెందిన నెరువట్ల వెంకటేశ్, రాంనగర్‌కు చెందిన పార్వతం సతీశ్ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వారిని పట్టుకున్నారు. కారులో ఇన్వెర్టర్, ఉడెన్ టేబుల్, రాగివైరు, స్కూటీపై టేబుల్‌ఫ్యాన్ కనిపించడంతో ఆరా తీశారు. పొంతనలేని సమాధానం చెప్పడంతో పోలీసుస్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించారు. వీరు కరీంనగర్‌కు చెందిన అజయ్ అనే వ్యక్తితో కలిసి జిల్లాలోని మానకొండూర్, సైదాపూర్, జమ్మికుంట, హుజూరాబాద్, కరీంనగర్ రూరల్, ఎల్‌ఎండీ, పెద్దపల్లి జిల్లాలోని జూలపల్లి, సుల్తానాబాద్, పెద్దపల్లి, సిద్దిపేట జిల్లాలోని బెజ్జంకి మండలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వ్యవసాయ బావుల విద్యుత్ మోటర్లు దొంగిలించినట్లు తెలిపారు. అందులోని రాగితీగ విక్రయించిన సొమ్మును నలుగురు పంచుకుని జల్సాలు చేసేవారని తెలిపారు. వీరిపై కరీంనగర్, పెద్దపల్లి, సిద్దిపేట జిల్లాలో 27కు పైగా కేసులు ఉన్నట్లు సీఐ తెలిపారు. కోండ్ర ఫణీంద్ర, నెరువట్ల వెంకటేశ్, పార్వతం సతీశ్‌పై కేసు నమోదు చేసి జైలుకు తరలించామని, బొలెరో, స్కూటీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో నిందితుడు అజయ్‌తో పాటు చోరీ చేసిన సామగ్రిని కొనుగోలు చేసిన మానకొండూర్‌లోని రాజీవ్‌నగర్‌కు చెందిన సిరిగిరి వెంకటమ్మ, కరీంనగర్‌లోని అల్కాపురికి చెందిన టేకు మల్లేశం,కోతిరాంపూర్‌కు చెందిన లోకిని లక్ష్మిపై కేసు నమోదు చేశామని, వారు పరారీలో ఉన్నట్లు సీఐ వివరించారు.

మంత్రాల నెపంతో తండ్రిని చంపిన తనయుడు

- సహకరించిన మృతుని తమ్ముడు
- హంతకులను పట్టుకున్న సిద్దిపేట పోలీసులు
- ఇద్దరి రిమాండ్


హంతకులను రిమాండ్ చూపుతున్న పోలీసులు

సిరిసిల్లక్రైం: మంత్రాల నెపంతో తండ్రిని కన్న కొడుకు, తోడబుట్టిన సోదరుడు కిరాతకంగా హతమార్చిన సంఘటన సిద్దిపేట కమిషనరేట్ పరిధిలోని రాఘవపూర్‌లో చోటుచేసుకుంది. మృతుడు రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన నిమ్మ భూమయ్యగా పోలీసులు గుర్తించారు. హత్యకు పాల్పడ్డ మృతుని కొడుకు నిమ్మ ప్రవీణ్, సోదరుడు నిమ్మ కనకయ్యలను రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన నిమ్మ భూమయ్యకు నిమ్మ ప్రవీణ్ కొడుకు కాగా ఇతను ప్రస్తుతం సిద్దిపేటలో ఉంటుడగా, మృతుని సోదరుడు నిమ్మ కనకయ్య నామాపూర్‌లో నివసిస్తున్నాడు. ఈనెల 9న రాఘవపూర్ శివారులో గుర్తుతెలియని సగం కాలిన మృతదేహం లభించింది. దీంతో సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈనెల 11న ప్రవీణ్, కనకయ్య అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని సీఐ కిరణ్‌రెడ్డి విచారించారు. తామే హత్య చేసినట్లు వారు ఒప్పుకున్నారు. కనకయ్య కుటుంబ సభ్యులకు కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగుండడం లేదు. భూమయ్య మంత్రాలు చేశాడని కనకయ్య కక్ష పెంచుకున్నాడు. ప్రవీణ్, భూమయ్యలు కలిసి ఈనెల 8న నామాపూర్‌లో కనకయ్య ఇంటికి తన తల్లిని చూసేందుకు వచ్చారు. అక్కడ గొడవ జరిగింది. మంత్రాలు చేస్తున్నాడనే అనుమానంతో భూమయ్యను చంపాలని ప్రవీణ్, కనకయ్య ప్లాన్ వేసుకున్నారు. మద్యం తాగుదామని బైక్‌పై నామాపూర్ నుంచి సిద్దిపేటకు బయలుదేరారు. రాఘవపూర్ శివారుకు చేరుకోగానే పిట్టలవాడ పక్కన గల పంట పొలాలలో ముగ్గురు కలిసి మద్యం తాగారు. ముందుగా అనుకున్న ప్లాన్ ప్రకారం పురుగుల మందు కలిపిన మద్యాన్ని ప్రవీణ్ అతని తండ్రి భూమయ్యకు ఇచ్చాడు. అది తాగిన భూమయ్య అక్కడికక్కడే చనిపోయాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు భూమయ్య మృతదేహాన్ని గడ్డిని వేసి నిప్పంటించారు. అక్కడి నుంచి నిందితులు బైక్‌పై నామాపూర్‌కు వెళ్లారు. మృతదేహం ఉందన్న సమాచారంతో విచారణ చేసిన పోలీసులు హంతకులిద్దరిని ఆదివారం రిమాండ్‌కు తరలించారు.

వివాహిత ఆత్మహత్య

ధర్మారం(ధర్మపురి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన గోల్కొండ రాజేశ్వరి(37) అనే వివాహిత జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ధర్మారం ఎస్సై 2 అశ్విని ఆదివారం తెలిపారు. కొంతకాలంగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్న రాజేశ్వరి చికిత్స కోసం అనేక ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వివరించారు. మృతురాలి తల్లి నర్ర వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నారు. భర్త ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య


అక్షయ్ మృతదేహం

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్‌కు చెందిన మంథని అక్షయ్(22) ఆదివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్షయ్ తండ్రి వికలాంగుడు కావడంతో కుటుంబభారం అతడిపై పడింది. కొద్దిరోజులుగా ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చాడు. ఇటీవల ఆ ఉద్యోగాన్ని మానేసి కుటుంబసమస్యలతో మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు.

డెంగీతో బాలిక మృతి

పెగడపల్లి(ధర్మపురి): జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం ఆరవెల్లి గ్రామానికి చెందిన చతుర్వేద(7) ఆదివారం డెంగీతో హైదరాబాద్‌లో మృతి చెందింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఆరవెల్లికి చెందిన వేముల పవన్ తన భార్య, కూతురు, కుమారుడితో కలిసి ఏడాది నుంచి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. కూతురు చతుర్వేదకు నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించి డెంగీగా వైద్యులు నిర్ధారించారు. చికిత్స అందిస్తుండగా ఆదివారం మృతి చెందింది. బాలిక మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చెరువులో పశువులకాపరి గల్లంతు

ముత్తారం(మంథని): పోతారం గ్రామానికి చెందిన చల్ల లింగయ్య(50)అనే పశువుల కాపరి చెరువులో దిగి గల్లంతయ్యాడు. పశువులను మేత కోసం తీసుకెళ్లిన లింగయ్య.. పారుపల్లి శివారులోని చెరువులోకి దిగిన పశువులను దాటించే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. లింగయ్య గల్లంతైన సమాచారం అందుకున్న పోలీసులు.. స్థానికుల సాయంతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి కావడంతో గాలింపు చర్యలు నిలిపి వేశారు. లింగయ్యకు భార్య లక్ష్మి, కూతురు హేమలత ఉన్నారు.

అల్ఫోర్స్‌లో రాష్ట్రస్థాయి కరాటే పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న డా.నరేందర్ రెడ్డి, ఏసీపీ నరేందర్

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి అల్ఫోర్స్ ఈటెక్నో స్కూల్‌లో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి, సిటీ ఏసీపీ గోపతి నరేందర్ ప్రారంభించారు. ఏసీపీ మాట్లాడుతూ స్వీయ రక్షణ కోసం కరాటే దోహదపడుతుందని అన్నారు. ప్రతీ ఒక్కరు కరాటేలో నైపుణ్యం పొందాలన్నారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను వివిధ క్రీడాపోటీల్లో ప్రోత్సహిస్తూ రాష్ట్ర, జాతీయస్థాయిలో పాల్గొనేలా శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ వసంత్‌కుమార్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొనగా, గెలుపొందిన వారిని బంగారు, రజతం, కాంస్యం పతకాలతో సత్కరించారు.

మళ్లీ గ్రామ రక్షక దళాలు

- పల్లెల్లో రక్షక దళాలను ఏర్పాటు చేస్తున్న పోలీసులు


సూచనలు చేస్తున్న ఎస్సై శేఖర్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): పల్లెల రక్షణకు మరోసారి రక్షక దళాలు ఏర్పాటు చేస్తున్నారు పోలీసులు. ఇరువై ఏళ్ల క్రితం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అప్పటి ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామ రక్షక దళాలను ఏర్పాటు చేశారు. మళ్లీ ఇప్పుడు శాంతి భద్రతల పరిరక్షణకు, ముఖ్యంగా చోరీలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలను అదుపులోకి తెచ్చేందుకు జిల్లా పోలీసు అధికారులు గ్రామరక్షక దళాలను తీసుకొస్తున్నారు. ఇందులో 25 నుంచి 45 ఏళ్ల యువకులతో రక్షక దళాలను పోలీసులు ఏర్పాటు చేస్తున్నారు. రాత్రి వేళల్లో పహారా కాసేలా అవగాహన కల్పిస్తున్నారు. పెరిగిపోతున్న దొంగతనాలు, ఇటీవల కిడ్నాపింగ్ వంటి వదంతులు వస్తున్న నేపథ్యంలో ప్రజల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు గ్రామ రక్షక దళాలు పనిచేస్తాయని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

భర్త బెదిరింపులపై భార్య ఫిర్యాదు

- గొంతు గీరుకుని బెదిరింపులు
- రామన్నపేటలో కలకలం


సంఘటన స్థలంలో కళాధర్

బోయినపల్లి(చొప్పదండి): బ్లేడుతో గొంతుపై గీరుకొని చంపేస్తానని భర్త భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని బోయినపల్లి మండలం రామన్నపేటకు చెందిన శ్వేత ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.శ్రీకాంత్ ఆదివారం రాత్రి తెలిపారు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు. ఇల్లంతకుంట మండలం ముస్కానిపేటకు కళాధర్‌తో మండలంలోని రామన్నపేటకు చెందిన శ్వేతకు రెండేళ్ల క్రితం వివాహమైంది. భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో విడాకులు కావాలని భార్య శ్వేత, భర్త కళాధర్‌ను కోరగా.. నిరాకరించాడు. శ్వేత తల్లి గారిల్లు రామన్నపేటలో ఉంటోంది. ఆదివారం రామన్నపేటకు వచ్చిన కళాధర్ చంపేస్తానని బెదిరించి బ్లేడుతో గొంతు గీరుకున్నాడు. గ్రామస్తులు అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు బ్లేడుతో గొంతు గీరుకున్న కళాధర్‌ను 108 వాహనంలోసిరిసిల్ల ఆస్పత్రికి తరలించారు. శ్వేత ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కళాధర్ చంచల్‌గూడా జైల్ వార్డెన్‌గా పనిచేస్తున్నాడని ఎస్సై చెప్పారు.

రాజన్నా.. నమోస్తుతి



వేములవాడ: వేములవాడ రాజన్నకు ఆదివారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణ, పట్టణం భక్తుల రద్దీతో కిటకిటలాడింది.

క్లుప్తంగా

'బీసీలను మోసం చేసిన ప్రభుత్వం'

విద్యానగర్(కరీంనగర్): బీసీ డిక్లరేషన్ పేరు మీద బీసీలకు అమలు కాని హామీ ఇచ్చి మోసపూరితంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు బడ్జెట్‌లో మొండిచెయ్యి చూపించిందని యునైటెడ్ పూలే ఫోరం రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. బీసీలకు కొండంత ఆశలు చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు బడ్జెట్‌లో చూస్తే ఇందులో గోరంత కూడా బీసీల సంక్షేమం కోసం కేటాయింపు చేయలేదన్నారు. బీసీ నాయకులు, బీసీ కుల సంఘాలు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని కోరారు.

నిధులు కేటాయించాలి

విద్యానగర్(కరీంనగర్): ఓటాన్ అకౌంట్‌లో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి కేటాయించిన నిధులు సరిపోవని, ఎక్కువ నిధులు కేటాయించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిధులను పెంచి ఆ నిధులు పూర్తిగా విద్యార్థుల సంక్షేమానికి ఉపయోగించాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలే రూ.5,500కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

కార్యవర్గం ఎన్నిక


మున్నూరు కాపు సంఘం నాయకులు

విద్యానగర్(కరీంనగర్): విద్యానగర్ మున్నూరు కాపు సంఘం ఎన్నికలు ఆదివారం విద్యానగర్‌లో జరిగాయి. అధ్యక్షులుగా కనకం అమర్ బాబు, ర్యాకం సుధాకర్ పటేల్ పోటీ పడగా.. మంచి మెజారిటీతో అధ్యక్షుడిగా కనకం అమర్ బాబు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా అట్టేపల్లి శ్రీనివాస్, కోశాధికారిగా ఐల రామ్మోహన్, ఉపాధ్యక్షులుగా తోట సునీల్, జవ్వాజీ శ్యాంప్రసాద్, నందాడపు మల్లేశం, సంయుక్త కార్యదర్శిగా పేరుక రాజేందర్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా వినయ్ కుమార్, కుదురు రవికుమార్, జుట్టు శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా ఉప్పు జలపతి, సానా కార్తీక్‌కుమార్, తోట రాజును ఎన్నుకున్నారు.

శ్రీచైతన్యలో వార్షిక వేడుకలు

తిమ్మాపూర్: మహాత్మానగర్ శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఆదివారం కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నరేందర్ రెడ్డి, డీన్ జగన్మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి వినతి

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని జూపాక గ్రామాభివృద్ధి ఎమ్మెల్సీ కోట కింద నిధులు కేటాయించాలని కోరుతూ ఆదివారం హుజూరాబాద్‌కు వచ్చిన ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు జూపాక గ్రామ కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ప్రధాన రహదారిపై బ్రిడ్జి, బస్టాండ్ నుంచి హైస్కూల్ వరకు సీసీరోడ్డు, ఓపెన్ జిమ్, మినీలైబ్రరీ కోసం నిధులు కేటాయించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, నాయకులు ఇల్లందుల శ్రీనివాస్, మారెపల్లి ప్రసాద్, హరీశ్, శ్యాంప్రసాద్, చందు, భరత్, గిన్నారపు అక్షయ్ చక్రి, బీఎస్సీ మండలాధ్యక్షుడు గిన్నారపు మహేందర్ ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి

హుజూరాబాద్‌రూరల్: హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గిరిజన శాఖ మంత్రి సీతక్కకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల కోరారు. వరంగల్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తున్న క్రమంలో ఆదివారం సాయంత్రం మండలంలోని సింగాపూర్ గ్రామంలోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ నివాస గృహానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి మంత్రికి వివరించగా, సానుకూలంగా స్పందించి, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రిని శాలువాతో కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఎస్సీ సెల్ మాజీ కన్వీనర్ దొంత రమేష్, జిల్లా పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి చందమల్ల బాబు, మాజీ సర్పంచ్ రఘుపాల్ రెడ్డి, నాయకులు చందమల్ల నరేష్ తదితరులు ఉన్నారు.

చేతి వృత్తులకు చేయూత

- 18 వృత్తులవారికి పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద లబ్ధి
- 18–65 ఏళ్ల లోపు వారు దరఖాస్తు చేసుకునే అవకాశం
- విశ్వకర్మ నోడల్ అథారిటీగా పంచాయతీ కార్యదర్శులు
- ఎంపికైన లబ్ధిదారులకు శిక్షణ.. అనంతరం ఆర్థిక చేయూత


పీఎం విశ్వకర్మ యోజన పథకం లోగో

కొత్తపల్లి(కరీంనగర్): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజన పథకం చేతి వృత్తులవారికి వరంగా మారనుంది. యాంత్రీకరణలో భాగంగా ఉపాధి కోల్పోయి ఆర్థికంగా చతికలబడ్డ చేతి వృత్తులకు చేయూతనందించేందుకు కేంద్రం ముందడుగు వేసింది. పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేయడంతో పాటు వారికి నైపుణ్య శిక్షణిచ్చి ఆర్థికంగా చేయూతనందించాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగానే 18 రకాల చేతి వృత్తులవారికి ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. పీఎం విశ్వకర్మ యోజన అమలుకు సంబంధించి గ్రామ పంచాయతీల్లో నోడల్/డిజిగ్నేటెడ్ అథారిటీగా పంచాయతీ కార్యదర్శులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

ఆర్థిక సాయం..

ఈ పథకం ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు శిక్షణ పొందినందుకు గాను రూ.10వేలు, పనిముట్ల కొనుగోలుకు రూ.15వేలు ప్రభుత్వం ఉచితంగా అందించనుంది. శిక్షణ పూర్తి చేసుకున్న లబ్ధిదారుకు మొదటి విడత ఆర్థిక సాయం కింద రూ.లక్ష బ్యాంక్ ఖాతాలో జమవుతుంది. ఈ రూ.లక్ష 18 నెలల్లో చెల్లించినవారి ఖాతాలో రెండో విడత కింద రూ.2లక్షల ఆర్థిక సాయం జమ చేస్తారు. ఈ మొత్తాన్ని 36 నెలల్లో తిరిగి చెల్లించాల్సి ఉంది. ఎలాంటి తాకట్టు లేకుండా ఈ పథకం ద్వారా ఆర్థిక సాయం అందనుంది. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునే లబ్ధిదారు కేంద్ర కార్మిక శాఖకు చెందిన ఈ–శ్రామ్ కార్డు తప్పక కలిగి ఉండాలి. ఈ పథకంలో ఎక్కువ మొత్తంలో చేతి వృత్తిదారులు చేరి ఆర్థికంగా ఎదిగేందుకు జిల్లా యంత్రాంగం అవగాహన కల్పిస్తోంది. మంగళి(బార్బర్), మేదరి(బాస్కెట్ మేకర్), కంసాలి(ఇనుము పనిముట్లు చేయువారు), వడ్రంగి(కార్పెంటర్), స్వర్ణకారులు(గోల్డ్‌స్మిత్), సుతారి(తాపీమేస్త్రీ), కుమ్మరి, దర్జీ(టేలర్), చాకలి(వాషర్‌మెన్), శిల్పం, బండ కార్మికులు, ఆయుధాల తయారీదారులు, పడవల తయారీదారులు, చెప్పులు కుటేట్వరు, బొమ్మల తయారీదారులు, చేపల వల తయారీదారులు, విడి పనిముట్లు తయారీదారులు(టూల్ కిట్ మేకర్), తాళాల తయారీదారులు(లాక్‌స్మిత్), జపమాల తయారీదారులు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

దరఖాస్తు ఇలా..

అర్హులైన లబ్ధదారులు జిల్లావ్యాప్తంగా ఉన్న కామన్ సర్వీస్ సెంటర్లలో రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించి రిజిస్ట్రేషన్ ఫారం పొందాల్సి ఉంది. ఈ పథకం నమోదు చేసుకునే దరఖాస్తుదారు తన ఆధార్ కార్డుకు ఫోన్ నెంబర్ తప్పనిసరిగా అనుసంధానించబడి ఉండాలి, దరఖాస్తుదారు వేలిముద్ర ద్వారా మాత్రమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. 18–65 ఏళ్ల లోపు చేతి వృత్తిదారులు దరఖాస్తు చేసుకోవాలి. పథకం అమలుకు సంబంధించి పంచాయతీల్లో నోడల్/డిజిగ్నేటెడ్ అథారిటీగా పంచాయతీ కార్యదర్శులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కమిషనర్ ఈ పథకం మార్గదర్శకాలకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ స్టేట్ మానిటరింగ్ కమిటీ(ఎస్ఎంసీ), డిస్ట్రిక్ట్ ఇంప్లిమెంటేషన్ కమిటీ(డీఐసీ)ని ఏర్పాటు చేసి ఈ పథకం అమలయ్యేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపిక ప్రక్రియ..

పథకం కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతరం మొదటి విడత లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది. ఈ ఎంపికలో భాగంగా గ్రామస్థాయిలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, పట్టణ స్థాయిలో మున్సిపల్ అధికారుల లాగిన్‌కి చేరుతుంది. క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారుల స్థానికతను వారు పొందుపరిచిన వివరాలను నిర్ధారణ చేసుకొని వారికిచ్చిన లాగిన్‌లో అప్రూవల్ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయితే లబ్ధిదారులకు సంక్షిప్త సమాచారం వెళ్తుంది. ఈవిధంగా ఎంపికయిన లబ్ధిదారులకు ప్రభుత్వం మొదట 5 రోజులు, తర్వాత 15 రోజులు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వడంతో పాటు ఆర్థిక సాయం సైతం అందిస్తుంది.

సద్వినియోగం చేసుకోవాలి



పథకం కింద 18 రకాల చేతి వృత్తుదారులు దరఖాస్తు చేసుకొని ఆర్థిక సాయం పొందాలి. అంతరించిపోతున్న చేతి వృత్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేసే ఈ పథకంలో భాగస్వాములు కావాలి. జిల్లావ్యాప్తంగా ఉన్న కామన్ సర్వీస్ సెంటర్లలో నమోదు చేసుకొని అర్హులైనవారందరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– వేముల అనిల్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు, సీఎస్‌సీ వీఎల్ఈ వెల్ఫేర్ అసోసియేషన్

వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం


విశేషాలంకరణలో వాసవీ మాత

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని అశోక్ నగర్‌లో వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఆదివారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఫణిశర్మ ఆధ్వర్యంలో నిత్య నిధి పూజలు, మూల విగ్రహానికి భక్తులు స్వయంగా క్షీరాభిషేకం చేశారు. అనంతరం గణపతి పూజ, అమ్మవారికి కలశస్థాపనం, వాసవి హోమం జరిగింది. ఆలయ కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.


తిరుమలకు వెళ్తున్న భజన మండలి బృందం

నేడు భక్తి సంగీత విభావరి

విద్యానగర్(కరీంనగర్): కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీతిరుమల వేంకటేశ్వరస్వామి సన్నిధానంలో భక్తి సంగీత విభావరి నిర్వహించడానికి కరీంనగర్ గణేశ్‌నగర్‌కు చెందిన శ్రీశివరామకృష్ణ భజన మండలికి ఆహ్వానం వచ్చింది. సోమవారం భజన, భక్తి విభావరి నిర్వహించడానికి భజన మండలి అధ్యక్షుడు గర్రెపల్లి నాగభూషణం ఆధ్వర్యంలో భజన మండలి సభ్యులు గర్రెపెల్లి ఆంజనేయులు, తోట రామయ్య, పంజాల శ్రీధర్‌గౌడ్, ఖమ్మం వెంకటేశ్వర్లు, కమలాకర్, కొమురవెల్లి, నర్సింగ రావు, బొల్లి విఠల్, భజన మండలి సభ్యులు 20 మంది తిరుమలకు వెళ్లారు.

విద్యారంగాన్ని విస్మరించిన ప్రభుత్వం


నిరసన తెలుపుతున్న నాయకులు

కరీంనగర్‌కల్చరల్: నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. ఆదివారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ వద్ద కళ్లకు గంతలు కట్టుకొని నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.8శాతం మాత్రమే కేటాయించిందన్నారు. శాతవాహన యూనివర్సిటీకి రూ.100కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, జిల్లా సహాయ కార్యదర్శి మనోజ్, జిల్లా నాయకుడు బొగేష్, నగర ఉపాధ్యక్షులు చందు, వరుణ్, ఆకాష్, రాకేశ్, రాజు పాల్గొన్నారు.

'విద్యార్థుల ఆత్మహత్యలకు యాజమాన్యమే కారణం'


కళాశాల ముందు ధర్నా చేస్తున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): హైదరాబాద్ నారాయణ ఐఐటీ అకాడమీలో శనివారం ఆత్మహత్య చేసుకున్న విద్యార్థికి న్యాయం చేయలని, విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తూ ఆత్మహత్యలకు కారణమౌతున్న నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ నారాయణ జూనియర్ కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా నారాయణ విద్యాసంస్థల్లో చదువుకుంటున్న విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ కనీసం నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ము కాస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థుల మరణాలకు కారణమవుతున్న కోస్తాంధ్ర పెట్టుబడిదారుల కార్పొరేట్ విద్యాసంస్థలైన నారాయణను నిషేధించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం శ్రీకాంత్, నాయకులు బొజ్జె మారుతి, కొయ్యడ రాకేశ్, గాజుల అన్వేష్, మిడిదొడ్డి అజయ్, పర్లపల్లె చందు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కరీంనగర్‌కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి బడ్జెట్‌లో ప్రాధాన్యమిచ్చిందని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించడంతో ఆదివారం నగరంలోని ఇందిరా చౌక్ వద్ద మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అఖిల్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్య, వైద్యంతో పాటు గ్రామీణ, పట్టణ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించారన్నారు. మైనారిటీల సంక్షేమానికి గతంలో కంటే అధిక నిధులిచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రవణ్‌నాయక్, ఎండీ చాంద్, అబ్దుల్ రెహమాన్, లయక్, ఖమ్రొద్దీన్, దన్నసింగ్, షబానా మహమ్మద్, జీడి రమేశ్, సిరాజొద్దీన్, బషీర్, బొబ్బిలి విక్టర్, ఫజల్, ఫిరోజ్, ముక్క భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి భారతీయ మజ్దూర్ సంఘ్ మహాసభలు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): భారతీయ మజ్దూర్ సంఘ్ 4వ రాష్ట్ర త్రైవార్షిక మహాసభలు ఈనెల 17, 18ల్లో జరుగుతాయని, ఈ సభలను విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ పప్పుల సురేష్ పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. పెద్దపెల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగే సభల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పసుల శ్రవణ్, శ్రీనివాస్, గజ్జెల హరికాంత్, నక్క అరుణ్, ఎండీ సుల్తాన్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

హుజూరాబాద్: ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రజలకు చెప్పేది ఒకటి చేసేది మరొకటి అని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, నల్లధనం వెనక్కి తీసుకొస్తామని, కుటుంబానికి రూ.15 లక్షల పంపిణీ, రైతులకు స్వామినాథన్ సిఫారసులు అమలు చేస్తామని 2014 ఎన్నికల ముందు హామీలు ఇచ్చి గెలిచిన తర్వాత ప్రజలపై పెనుభారం మోపుతుందన్నారు. కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడులు తీసుకొస్తూ, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకొచ్చి మోటార్లకు మీటర్లు పెట్టే ప్రయత్నం చేస్తుందని, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించి దాన్ని ఎత్తివేయాలని చూస్తుందని, మరోపక్క ప్రభుత్వ రంగ సంస్థల అన్నింటిని ప్రైవేట్ కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెడుతోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాని, పెట్టుబడుదారుల ఆస్తులు మాత్రం మోదీ ప్రభుత్వ హయాంలోకోట్లకు పెరిగిపోయి ప్రపంచ కుబేరుల స్థాయికి ఎదిగారని తెలిపారు. వీటన్నింటికీ నిరసనగా జరిగే అఖిల భారత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు, రాచర్ల మల్లేశం, బోయినపల్లి రమాపతిరావు, శనిగరపు కొమురయ్య, రవీందర్ రావు, కండె సదయ్య ,కొత్తూరు మల్లయ్య, కదం కిషన్ రావు, కాశిపాక శంకర్, వడ్లూరి లక్ష్మీనారాయణ, బాబు, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

రామడుగు: వెదిర గ్రామానికి చెందిన కాసార్ల లచ్చిరెడ్డి ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్‌గా పదవీవిరమణ పొందారు. ఆదివారం వెదిర గ్రామానికి చెందిన సమన్విత సహాయ సమితి ఆధ్వర్యంలో శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ధర్మపురి ఎల్ఐసీ శాఖ మేనేజర్ బీరెడ్డి ప్రేమ్‌సాగర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ఏరెడ్డి కొంరారెడ్డి, సమితి అధ్యక్షులు గాజుల ఆనందం, సభ్యులు పాల్గొన్నారు.

నూనెగింజల సాగుతో అదనపు ఆదాయం


అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

తిమ్మాపూర్: నూనెగింజల సాగుతో రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్, తిమ్మాపూర్ వ్యవసాయ అధికారి సురేందర్ తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖ, ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నూనెగింజల సాగు ప్రోత్సాహంలో భాగంగా భారతీయ నూనెగింజల పరిశోధనా కేంద్రం రాజేంద్రనగర్ అధిక దిగుబడినిచ్చే ఐఎస్ఎఫ్–746 రకం కుసుమ విత్తనాలను రైతులకు పంపిణీ చేశామన్నారు. సంప్రదాయ విత్తనాలకు, పరిశోధనా కేంద్రం అభివృద్ధి చేసిన విత్తనాలకు పంట ఎదుగుదల, దిగుబడి విషయంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం పూత దశలో ఉన్న కుసుమ పంటకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కుసుమ నూనెలో విటమిన్–ఇ అధికంగా, ఒమేగా 6 కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఒమేగా 6 లినోలెయిక్ యాసిడ్ అని కూడా అంటారు. ఇది శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రణలో ఉంచుతుందని తెలిపారు. లినోలిక్ ఆమ్లం చర్మ సంరక్షణలో ప్రముఖపాత్ర పోషిస్తుంది. కుసుమ నూనె బాడీలో సెరోటిన్ హార్మోన్‌ను విడుదల చేస్తుందని వివరించారు. రక్తంలోని చక్కెర స్థాయిని కంట్రోల్ చేస్తుందని తెలిపారు.

లెదర్ పార్క్ నిర్మాణాలపై హర్షం

జమ్మికుంట: హైదరాబాద్, కరీంనగర్‌లో లెదర్ పార్కులను నిర్మించబోతున్నామని బడ్జెట్‌లో ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు జమ్మికుంట లెదర్ పార్క్ ఆర్టిజన్స్, చర్మకారులు సంఘం అధ్యక్షుడు రామంచ రాజారాం ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... దశాబ్ద కాలంగా లెదర్‌పార్క్‌లు నిర్లక్ష్యానికి గురయ్యాయని, లీడ్‌క్యాప్ భూముల్లో వెంటనే లెదర్ పార్కులను ప్రారంభించి ట్రైనింగ్ పొందిన ఆర్టిజన్స్, మాదిగ నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆరెపల్లి రాజేందర్, మొలుగు రాజు, రాచపల్లి మహేశ్, మడిపల్లి రమేశ్, మారెపల్లి పోశెట్టి పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ప్రతిభ

జమ్మికుంట: గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు 5వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన మాస్టర్స్ క్రీడా పోటీల్లో జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని అబాది జమ్మికుంటకు చెందిన ఎగిత అశోక్ 45 సంవత్సరాల విభాగంలో హైమర్ త్రోలో మొదటి స్థానం, మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన అంబాల ప్రభాకర్ ద్వితీయ స్థానంలోచి బంగారు, వెండి పతకాలను ఆల్ ఇండియా మాస్టర్స్ స్పోర్ట్స్ సెక్రెటరీ రామ్‌పాల్‌శర్మ, తెలంగాణ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ఆదివారం అందుకున్నారు. ఈసందర్భంగా తైవాన్‌లో జరిగే అంతర్జాతీయ మాస్టర్స్ క్రీడా పోటీలకు ఎంపికై నట్లు ఆల్ ఇండియా మాస్టర్స్ స్పోర్ట్స్ కమిటీ ప్రకటించింది. ఎంపిక పట్ల పట్టణంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, కళాకారులు, మేధావులు, ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.


రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపిక

హుజూరాబాద్‌రూరల్: సింగాపూర్ గ్రామం జెడ్పీహెచ్ఎస్ పదోతరగతి విద్యార్థిని బొజ్జ వైష్ణవి రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయినట్లు హెచ్ఎం భూపతి శ్రీనివాస్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. బోరుబావుల్లో చిన్నారులు పడిచని పోకుండా రక్షణ కవచం తయారు చేయాలన్న ఉద్దేశంతో బోర్లాక్ ఇన్నోవేషన్ ప్రాజెక్ట్ రూపొందించింది. ప్రాజెక్ట్‌ను దేశవ్యాప్తంగా అమలు చేస్తే బోరు బావుల ప్రమాదం నుంచి చిన్నారులను రక్షించొచ్చని విద్యార్థిని అభిప్రాయం వ్యక్తం చేసింది. బోర్లాక్ ఇన్నోవేషన్ ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికైనందుకు విద్యార్థిని ఉన్నతాధికారులు చేతుల మీదుగా అవార్డు అందుకోనుంది. రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికైనందుకు మండల విద్యాధికారి కేతిరి వెంకట నర్సింహారెడ్డి గైడ్ టీచర్ లక్కాకుల రాంప్రసాద్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ఎవరితో కలిసినా.. ఎవరిని వదిలేసినా.. ఏం చేసినా
నా ప్రయోజనాలే రాష్ట్ర ప్రయోజనాలు

చంద్రబాబు అవకాశవాద రాజకీయాలకు 'రాష్ట్రం' ముసుగు

- పవన్, బీజేపీ, కాంగ్రెస్... ఎవరితో కలిసినా, విడిపోయినా ఇదే మాట
- స్వప్రయోజనాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు నక్కజిత్తులు
- 1999తో వాజ్ పేయితో కలిసినప్పుడు రాష్ట్ర హితం కోసమేనంటూ హడావుడి
- విడిపోయాక మతతత్వ పార్టీతో కలిసి తప్పు చేశానని పశ్చాత్తాపం
- 2014లో పాజిటివ్ ఓటు కోసం మళ్లీ రాష్ట్ర ప్రయోజనాలంటూ బీజేపీతో పొత్తు
- 2019లో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే విడిపోయానంటూ డాంబికాలు
- మళ్లీ ఇపుడు రాష్ట్ర ప్రయోజనాలకోసమే బీజేపీతో కలిసే ప్రయత్నాలంటూ వ్యాఖ్యలు
- ప్రత్యేక హోదా సంజీవని కాదు.. ప్యాకేజీ చాలన్నప్పుడు కూడా ఇదే మాట
- ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచినప్పుడూ... ప్రజాస్వామ్యం కోసమేనని ప్రచారం
- ఆఖరికి మద్య నిషేధం ఎత్తివేసినపుడు కూడా అదే ముసుగు
- బాబు ఏం చేసినా 'రాష్ట్ర ప్రయోజనాల' కోసమేనంటూ ఎల్లో మీడియా దరువు
- వాస్తవానికి అధికారం, కుటుంబ ప్రయోజనాలు తప్ప ఏవీ పట్టని బాబు
- తనయుడి కోసం, అధికారం కోసం ఏం చేయటానికైనా నారా వారు రెడీ



(సాక్షి, అమరావతి)

ఈ మధ్య 'శరణు... శరణు' అంటూ బీజేపీతో పొత్తులు కుదుర్చుకోవటానికి చంద్రబాబు నాయుడు ఢిల్లీకి వెళ్లినపుడు ఎల్లో మీడియా మొత్తం ఒకటే రచ్చ. చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఢిల్లీకి వెళ్లారని, రాష్ట్ర హితం కోసం కాస్త తగ్గి అయినా బీజేపీతో పొత్తు పెట్టుకోవాలన్నది ఆయన ఉద్దేశమని!!. మరో పచ్చపత్రిక హద్దులన్నీ దాటేసి.. నారా వారు గెలవటం రాష్ట్రానికి చారిత్రక అవసరమని తేల్చిచెప్పేసింది!.

ఒక్కటి మాత్రం నిజం. జనం నవ్విపోతారన్న సిగ్గు బాబుకు, ఆయన మీడియాకు కాస్తయినా లేదు. ఎన్ని పనికిమాలిన పనులు చేసినా, ఎన్ని అపవిత్ర పొత్తులు పెట్టుకున్నా.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమేనని, రాష్ట్ర ప్రయోజనాల కోసమేనని జనాన్ని నమ్మించడానికి బాబు, ఆయన ముఠా నిస్సిగ్గుగా ప్రయత్నిస్తున్నారంటే... ఎవ్వరినైనా మేనేజ్ చేయగలమన్న వీళ్ల తెం పరితనమే కారణమనుకోవాలి.

నీచపు ఎత్తుగడల్లో వేరెవ్వరికీ సాధ్యం కాని చారిత్రక ట్రాక్ రికార్డు చంద్రబాబు నాయుడిది. ఎందుకంటే ఆయన ఇప్పటిదాకా భారతీయ జనతా పార్టీతో రెండు సార్లు కలిశారు... రెండు సార్లు విడిపోయారు. మళ్లీ మూడోసారి కలవటానికి కాళ్ల బేరంతో సహా అన్ని ప్రయత్నాలూ చేస్తున్నారిపుడు. జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌తోనూ ఇలాంటి బంధమే. 2014లో కలిశారు... 2019లో విడిపోయారు. మళ్లీ ఇపుడు కలిసిపోయారు. ఆఖరికి తన జన్మ విరోధి కాం గ్రెస్‌తోనూ 2019 తెలంగాణ ఎన్నికల్లో ప్రత్యక్ష పొత్తు పెట్టేసుకున్నారు. ఈ సారి మాత్రం తెలం గాణతో పాటు ఏపీలోనూ పరోక్ష పొత్తుతో లాగిస్తున్నారు. ఇవన్నీ చూస్తే ఎవ్వరికైనా ''ఛీ.. అధికారం కోసం మరీ ఇంతలా దిగజారిపోవాలా?'' అనిపించకమానదు. కానీ బాబు పెంచి పోషిస్తున్న ఎల్లో మీడియా మాత్రం దీన్ని మరో కోణంలో చూపించడానికి ప్రయత్నిస్తోంది. ఎప్పటికప్పుడు బాబు చేసిన లాం టి దిగజారుడు పనులన్నిటికీ 'రాష్ట్ర ప్రయోజనాల కోసమే' అనే ముసుగు వేస్తోంది. ప్రజాస్వామ్యం కోసం, రాష్ట్ర హితం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో బాబు ఇవన్నీ చేశారనే కలర్ ఇవ్వటానికి ప్రయత్నిస్తోంది. బాబు కూడా.. రాష్ట్ర ప్రయోజనాల కోసమే బీజేపీతో కలిసే ప్రయత్నం చేస్తున్నట్లు పార్టీ నేతల సమావేశంలో చెప్పొచ్చారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో తన సొంత ప్రయోజనం కోసం తీసుకున్న నిర్ణయాలన్నింటినీ ఆయన రాష్ట్రం కోసం, ప్రజల కోసమే తీసుకున్న నిర్ణయాలుగా వివరించే ప్రయత్నాన్ని చూసి పార్టీ నేతలే నివ్వెరపోవాల్సి వచ్చిందని సమాచారం.

ఆది నుంచి స్వప్రయోజనాలే పరమావధి...

కాంగ్రెస్ పార్టీతో రాజకీయ జీవితాన్ని మొదలుపెట్టిన చంద్రబాబు... ఆ పార్టీ ఓడిపోవటంతో, దానికి బద్ధ శత్రువైన తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. అల్లుడు కాబట్టి చేర్చుకోవాల్సి వచ్చింది నాటి తెలుగుదేశాధిపతి ఎన్టీఆర్‌కు. ఆ తరవాత ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కుని.. ఇదంతా ప్రజాస్వామ్యాన్ని బతికించడానికే చేశానని నాటి తన ఎల్లో మీడియా సాయంతో చెప్పగలిగారు చం ద్రబాబు. నిజాలు అందరికీ తెలిసినా... ఇప్పటికీ అదే అబద్ధాన్ని పదేపదే చెబుతూ ఉంటారు చం ద్రబాబు. ఆ రోజు ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికే అలా చేయాల్సి వచ్చిందంటుంటారు. తన చెం చాలతో చెప్పిస్తుంటారు కూడా. ఇక 1999లో బీజేపీకి ఉన్న పాజిటివ్ ఓటు సాయంతో రాష్ట్రంలో గట్టెక్కవచ్చని భావించి... ఆ పార్టీతో పొత్తు పెట్టుకుని విజయం సాధించారు. బీజేపీతో అధికారాన్ని పంచుకుని కేంద్రంలో చక్రం తిప్పినట్లు మహా బిల్డప్ ఇచ్చి ఇప్పటికీ దాని గురించి చెప్పుకుంటూనే ఉంటారు.

మళ్లీ బీజేపీతో జట్టుకట్టేశారు...

కానీ 2004 ఎన్నికలు వచ్చే సరికి పరిస్థితి మారిపోయింది. దేశవ్యాప్తంగా బీజేపీ వ్యతిరేక గాలి వీస్తోంది. అది తనమీదా పడొచ్చనే భయంతో ఆ పార్టీతో తెగ తెంపులు చేసుకుని బయటకు వచ్చేశారు. దాన్ని సమర్థించుకునే ప్రయత్నంలో... బీజేపీ మతతత్వ పార్టీ అని, ప్రజాస్వామ్యానికి-లౌకిక తత్వానికి ప్రమాదకరమని ఆరోపణలు చేశారు. మతతత్వ బీజేపీతో పొత్తు పెట్టుకుని తప్పు చేశానని పశ్చాత్తాపం నటించారు. విచిత్రమేంటంటే రాష్ట్రాన్ని విభజించాలని కోరుతున్న టీఆర్ఎస్‌తో 2009 ఎన్నికల్లో పొత్తు పెట్టుకున్నారు. టీఆర్ఎస్, వామపక్షాలతో కలిసి మహాకూటమిగా ఏర్పడి అప్పట్లో దానిక్కూడా రాష్ట్ర ప్రయోజనాలనే ముసుగు వేసినా... ప్రజలు తిప్పికొట్టారు. ఇక 2014 ఎన్నికల్లో మోడీ హవా కొనసాగుతుండడంతో... మళ్లీ బీజేపీ పంచన చేరి, రాష్ట్ర ప్రయోజనాల కోసం తప్పలేదంటూ సమర్థించుకున్నారు. అప్పుడు కూడా కేంద్రం లోనూ, రాష్ట్రంలోనూ అధికారాన్ని పంచుకుని రాష్ట్రంలో చెలరేగిపోయారు. దోచుకో-పం చుకో-తినుకో అనే రీతిలో సహజ వనరులన్నిటినీ కొల్లగొట్టారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని తన అధికార భాగస్వామిని అడగకుండా... హోదా ఏమీ సంజీవని కాదు కదా? హోదా వస్తే అన్ని సమస్యలూ పోతాయా? అని ఎదురు ప్రశ్నించారు. కేంద్రంతో లాలూచీ పడి, ప్రత్యేక ప్యాకేజీ ఇస్తే చాలన్నారు. పోలవరాన్ని కేంద్రం నిర్మిస్తానని చెప్పినా... కమీషన్ల కోసం ఆ బాధ్యత తమకే ఇవ్వాలని పట్టుబట్టారు. బాబు కమిషన్ల యావను అర్థం చేసుకున్న బీజేపీ... ప్రత్యేక ప్యాకేజీ పేరిట డబ్బు మూటలు పంపి చేతులు దులుపుకొంది. హోదాను పక్కనబెట్టేసింది.

హోదా వద్దని...
మళ్లీ దానికోసం డ్రామా

2019 ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయి కేంద్రం లో కాంగ్రెస్ గెలుస్తుందనే అంచనాతో చం ద్రబాబు చెలరేగిపోయారు. ఎన్డీఏ నుంచి బయటకు వచ్చి కాంగ్రెస్‌తో జత కట్టారు. తనకు భార్య, కొడుకు, మనవడు ఉన్నారని.. మోదీకి ఎవరున్నారని, అసలు మోదీ ఎవరని ప్రశ్నిస్తూ వ్యక్తిగతంగా నాటి ప్రధానిని దూషించారు. తిరుపతికి వచ్చిన అమిత్‌షాపై తన మనుషులతో రాళ్లు వేయిం చారు. అంతేకాదు.. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక హోదా కోసం ఉద్యమించడంతో తాను కూడా హోదా డిమాండ్‌ను ఎత్తుకున్నారు. ప్యాకేజీకి అంగీకరించిన నోటితోనే హోదా కావాలని ఎలా అడుగుతారని జనం ప్రశ్నించినా.. అదంతా రాష్ట్ర ప్రయోజనాల కోసమే చేశానంటూ నాలుక మడతేశారు. ఆ ఎన్నికల్లో ఓడిపోయాక మళ్లీ బీజేపీ ప్రాపకం కోసం పాకులాడి... తొలుత తన పార్టీలోని అనయాయులు కొందరిని ఆ పార్టీలోకి పంపేశారు. వారి సాయంతో ఇపుడు బీజేపీ అగ్ర నేతల కాళ్లావేళ్లా పడి ఎలాగైనా ఆ పార్టీతో కలవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదంతా రాష్ట్ర ప్రయోజనాల కోసమే అని చెబుతున్నారు.

మద్య నిషేధానికీ
ఇదే ముసుగు..

చంద్రబాబువి ఎంత దుర్మార్గపు పనులో... దాన్ని ఎల్లో మీడియా ఎలా కవర్ చేస్తుందో తెలియటానికి మద్య నిషేధాన్ని చక్కని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. 1994లో అధికారంలోకి వచ్చాక నాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ తన మాట ప్రకారం... 1995 జూన్ నుంచీ సంపూర్ణ మద్య నిషేధాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. కానీ ఆయన్ను వెన్నుపోటు పొడిచి 1996లో అధికారాన్ని చేపట్టిన చంద్రబాబు... నిండా ఏడాది కూడా గడవక ముం దే నిషేధాన్ని ఎత్తివేశారు. పక్క రాష్ట్రాల నుంచి మద్యం విచ్చలవిడిగా వస్తోందంటూ... దానివల్ల రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని, రాష్ట్ర హితం కోసం నిషేధాన్ని ఎత్తివేయక తప్పడం లేదని చెప్పి మళ్లీ మద్యాన్ని తెచ్చేశారు. పక్క రాష్ట్రాల నుంచి మద్యం వస్తుంటే అడ్డుకోవాలి గానీ, నిషేధాన్ని ఎత్తివేయటమేంటని వేసిన ప్రశ్నలకు ఇప్పటికీ జవాబుల్లేవు మరి!!. ఆయన జవాబివ్వనిది కూడా... రాష్ట్ర ప్రయోజనాల కోసమేనేమో!!.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య. చిత్రంలో జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ మురళీమనోహర్ తదితరులు

కులాల సమగ్ర గణన జరపాల్సిందే

- రౌండ్‌టేబుల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం
- బీసీ కేటగిరీల్లో కులగణన జరిపితే బీసీలకు అత్యంత నష్టం
- జనాభాలో ఉన్న కులాల సంఖ్య తెలియకుండా గణన అసాధ్యం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాల సమగ్ర గణన జరపాలని పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్ డిమాండ్ చేసింది. కేవలం బీసీ వర్గంలోని కులాలను మాత్రమే గణిస్తే అది బీసీ సామాజికవ ర్గానికి అత్యంత ప్రమాదకారి కానుందని ఆందోళన వ్యక్తం చేసింది. అన్నికులాల గణనపైన రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, లేకుంటే క్షేత్రస్థాయిలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిం చేందుకు వెనుకాడమని పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్ తేల్చిచెప్పింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రొఫెసర్ మురళీమనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్, జస్టిస్ ఈశ్వరయ్య, జస్టిస్ చంద్రకుమార్, వివిధ విశ్వవిద్యాలయాల నుంచి సీనియర్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు. అన్ని కులాల సమగ్ర కులగణన చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

కులగణన చేపట్టాలి

ఈ సందర్భంగా జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ కులగణన చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు స్థానిక సంస్థలకు ఉందన్నారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వాలు కులగణన చేపట్టి సంక్షేమ కార్యక్రమాలు, రిజర్వేషన్లు అమలు చేయాలని, ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసి రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. రాష్ట్రప్రభుత్వం కులగణన చేపడతామని ప్రకటిం చడం, కేబినెట్ సమావేశంలో ఈమేరకు ఆమోదిం చడం శుభపరిణామమన్నారు. కానీ కులగణన కేవలం బీసీ కులాలకు మాత్రమే పరిమితం చేస్తామంటూ అధికారవర్గాలు చెబుతున్నాయని, అలా బీసీ కులగణన చేపడితే వెనుకబడిన వర్గాలు అత్యంత ఎక్కువగా నష్టపోయే ప్రమాదం ఉం దన్నారు. బీసీ కులగణన అనేది శాస్త్రీయంగా సరికాదని, బీసీ కులానికి చెందిన వారి ఇంటికి వెళ్లి సర్వే చేయడంతో ఇతర కులాల గణాంకాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. జనాభాలో ఏయే కులాలు ఎంత సంఖ్యలో ఉన్నాయో తెలిస్తేనే కులాల వారీగా వాటా స్పష్టమవుతుందని చెప్పారు. ఈ దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుని స్పష్టత ఇవ్వాలన్నారు.

మేధావులతో చర్చిస్తే మంచి ఫలితం

జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ కులగణన ప్రక్రియ చేపట్టే ముందు రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాల్లోని మేధావులతో చర్చిస్తే మంచి ఫలితం ఉంటుందన్నారు. న్యాయపరమైన అంశాలు చర్చకు వస్తాయని, వాటిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా కార్యాచరణ చేసుకునే వీలుంటుందని చెప్పారు. అన్ని కులాల సమగ్ర కులగణన చేపట్టడమే రాష్ట్ర ప్రభుత్వం ఎజెండాగా ముం దుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.

సీఎంకు మరోమారు నివేదిస్తాం

ప్రొఫెసర్ మురళీమనోహర్ మాట్లాడు తూ సమగ్ర కులగణన కోసం సీఎం రేవం త్‌రెడ్డిని కలిసి మరోమారు నివేదిస్తామన్నారు. ఇదివరకు సీఎంను కలిసినప్పుడు బీసీ సం క్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తో మాట్లాడాలని, ప్రత్యేకంగా వర్క్‌షాప్ నిర్వహించాలని సీఎం ఆదేశించినా, ఇంకా నిర్వహించలేదని తెలిపారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయానికి అనుగుణంగా తదుపరి కార్యాచరణ ఉంటుందని వివరించారు.

బాసరకు 'వసంత' శోభ

- నేటి నుంచి వైభవంగా వేడుకలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

భైంసా: సుప్రసిద్ధ బాసర శ్రీజ్ఞానసరస్వతీ ఆలయం వసంత పంచమి వేడుకలకు ముస్తాబైంది. సోమ వారం నుంచి వేడుకలు వైభవోపేతంగా నిర్వహిం చేందుకు దేవాదాయశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఏటా మాఘశుద్ధ పంచమి రోజున సరస్వతీ అమ్మ వారి జన్మదినాన్ని ఘనంగా నిర్వహించనుండగా ఈ శుభదినాన బాసర క్షేత్రం భక్తజనంతో పులకించ నుంది. ఈనెల 14న వసంత పంచమి (శ్రీపంచమి) వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఏసీ గదుల కోసం పైరవీలు

ఆలయ ప్రాంగణంలోని ఏసీ గదులన్నీ తమకంటే తమకు ఇవ్వాలని కుప్పలుకుప్పలుగా సిఫారసులు వస్తున్నాయి. గదుల కోసం వీఐపీలూ ఒత్తిడి పెంచు తున్నారు. వసంతపంచమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని ఏసీ గదుల కోసం వీఐపీలంతా తమకు తెలిసినవారితో పైరవీ చేయిస్తున్నారు. ఎలాగైనా గదులు ఇవ్వాలంటూ ఆలయ సిబ్బంది చుట్టూ తిరుగుతున్నారు.

లాడ్జీ గదుల అద్దె పెంపు

వసంత పంచమి నేపథ్యంలో బాసరలోని ప్రైవేట్ లాడ్జీల గదుల ధరలు అమాంతంగా పెంచేశారు. ఒ క్కో గదికి రూ.వేలలో అద్దె డిమాండ్ చేస్తున్నారు. ఇ ప్పటికే గదులన్నీ బుక్ అయ్యాయంటూ చెప్పడం తో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఆర్యవైశ్య స త్రం, బ్రాహ్మణసత్రం, కమ్మ సంఘంలోని గదులు కూడా బయటివారికి ఇచ్చే పరిస్థితిలేదు. దీంతో ప్రై వేట్ లాడ్జీల నిర్వాహకులు డిమాండ్ చేసిన మేరకు అద్దె చెల్లించి గదులు దక్కించుకోవాల్సిన పరిస్థితి ఉంది.

ప్రయాణికుల సేవలో..

వసంత పంచమి నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు భైంసా, నిజామాబాద్ డిపోల నుంచి ప్రత్యేక బస్సు లు నడపనున్నారు. బస్టాండ్‌తోపాటు రైల్వేస్టేషన్ లోనూ ప్రయాణికుల కోసం ఏర్పాట్లు చేశారు. ఇక పూర్తిగా నిండిన గోదావరి వద్దకు పుణ్యస్నానాలు ఆ చరించేందుకు వచ్చే భక్తులు ఇబ్బందులు పడకుం డా అన్ని చర్యలు తీసుకుంటామని అధికారులు తెలి పారు. భక్తులు జల్లు స్నానం చేసేందుకూ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బాసర ఆలయ స్నానఘ ట్టాల వద్ద సత్యసాయిసేవా సమితి సభ్యులు, ట్రిపు ల్‌ఐటీ విద్యార్థులు, మిషన్ బాసర సభ్యులు, వలం టీర్లు స్వచ్ఛందంగా సేవలందించేందుకు ముందు కువస్తున్నారు.

పూజా కార్యక్రమాలు ఇలా..

సోమవారం వేకువజామున 4గంటలకు మంగళవా యిద్యసేవతో అమ్మవారికి ప్రత్యేక అభిషేకంతో వ సంత పంచమి ఉత్సవాలు ప్రారంభించనున్నారు. ఉదయం 8గంటల నుంచి వేదపఠనం నిర్వహించ నున్నారు. 9గంటల నుంచి 108 కలశాలతో చండీ సహిత అష్టోత్తర శతకళశ మహాభిషేక సంకల్పం ని ర్వహిస్తారు. అధికసంఖ్యలో వచ్చే భక్తుల కోసం అ క్షరాభ్యాసాలు యథావిధిగా నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయాన్ని పూలతో అలంకరించి ఉత్స వాలకు ముస్తాబు చేశారు.



బాసర సరస్వతీ ఆలయం



సరస్వతీ అమ్మవారు

14న మంత్రి సురేఖ రాక...

బాసరలో వసంత పంచమి సందర్భంగా అమ్మవా రికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు దేవాదాయశా ఖ మంత్రి కొండా సురేఖ, ముథోల్ ఎమ్మెల్యే ప వార్ రామారావుపటేల్ రానున్నట్లు ఆలయ ఈవో విజయరామా రావు తెలిపారు. దేవాదాయశాఖ ఉ న్నతాధి కారులతోపాటు దేశం నలుమూలల నుంచి అధికసంఖ్యలో భక్తులు రానున్నట్లు పేర్కొ న్నారు. బాసర అమ్మవారికి ఏటా అఖిల భారత పద్మశాలీ సంఘం తరఫున పట్టుచీర సమర్పిస్తున్నారు. బాసరలోనే ఇప్పటికే మగ్గంపై చీర నేసి ఉంచారు.

భక్తులకు ఇబ్బందులు రానివ్వం

బాసరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్త కుండా చర్యలు తీసుకుంటాం. కొత్తగా నిర్మిం చిన డార్మెటరీ హాల్‌ను భక్తుల కోసం కేటాయించాం. వాహనాల కోసం పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశాం. పోలీసులు బందోబ స్తు చర్యలు చేపడుతున్నారు. బాసరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వం.

– విజయరామారావు, ఆలయ ఈవో

స్టేజ్-2 నిర్మాణానికి లైన్‌క్లియర్!

- ప్రారంభమైన మట్టి నమూనా పరీక్షలు
- తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టులో మరో యూనిట్
- మరో నెలరోజుల్లో అంకురార్పణ
- రూ.27వేల కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు



తెలంగాణ స్టేజ్-2 నిర్మాణానికి చేపట్టిన మట్టి నమూనాల పరీక్షలు



ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు

జ్యోతినగర్(రామగుండం): భారతావనికి వెలుగు లు అందిస్తున్న ఎన్టీపీసీ.. తెలంగాణ రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లా రామగుండం ప్రాంతంలో తెలం గాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు, తెలంగాణ స్టేజ్-2లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామ ర్థ్యంగల మూడు యూనిట్ల నిర్మాణానికి లైన్ క్లియరై నట్లు విశ్వసనీయ సమాచారం. ఎన్టీపీసీ ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన తెలంగాణ విద్యుత్ ప్రాజెక్టు స్టేజ్ -1లోని మొదటి 800 మెగావాట్ల యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తి ఇప్పటికే ప్రారంభించింది. 800 మెగావాట్ల రెండో యూనిట్ సైతం ఆదివారం 72 గంటల ట్రయల్ ఆపరేషన్ రన్ సక్సెస్ చేసింది. స్టేజ్-1లో 800 మెగావాట్ల మొదటి యూనిట్ సీవోడీ కాగా రెండో యూనిట్ కొద్దిరోజుల్లో సీవోడీ ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

మట్టి నమూనా పరీక్షలు ప్రారంభం

తెలంగాణ సూపర్ థర్మల్ ప్రాజెక్టు తెలంగాణ స్టేజ్-2లో చేపట్టే 2,400 మెగావాట్ల విద్యుత్ ప్లాం ట్ నిర్మాణానికి ప్రతిపాదనలను అంతర్గతంగా పూర్తి చేశారని, పనులు సైతం ప్రారంభించారని సమాచారం. సుమారు రూ.26,952 కోట్ల అంచనా వ్యయంతో స్టేజ్-2 నిర్మించనున్నారు. కొత్త ప్రాజె క్టుకు కావాల్సిన పర్యావరణ అనుమతులు, భూసేక రణ తదితర అంశాలతో బ్లూప్రింట్ సిద్ధం చేశారు.

త్వరలో పీపీఏ..

తెలంగాణ స్టేజ్-2లో నిర్మించే మూడు యూనిట్లలో 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. విద్యుత్ కొనుగోలు అంశంపై ఆయా రాష్ట్రాల ప్రభుత్వాల తో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్(పీపీఏ) ఒప్పందం త్వరలోనే కుదిరే అవకాశాలు ఉన్నాయని ఉన్నతాధి కారులు చెబుతున్నారు. స్టేజ్-2కు పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ కావడంతోనే పనులకు అధికారికంగా శ్రీకారం చుడతారు.

ఏప్రిల్‌లో టెండరు ప్రక్రియ

తెలంగాణ స్టేజ్-2 ప్రాజెక్టు నిర్మాణ స్థలంలో మట్టి నమూనాలను సేకరించే పనులు ఇప్పటికే ప్రారం భించారు. చిమ్నీతోపాటు నిర్మాణాలకు అనుకూల మైన స్థలాలను గుర్తించేందుకు బోర్‌వెల్ ద్వారా తవ్వకాలు చేపట్టి మట్టి నమూనాలను పరీక్షించే ప్రక్రియ కొనసాగుతోంది.

తెలంగాణ పునర్విభజన చట్టంలో 4,000 మెగావాట్ల ప్రాజెక్టు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఎన్టీపీసీ 4,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు నిర్మా ణానికి ఒప్పందం ఉంది. ఇందులో భాగంగా మొద టి స్టేజ్‌లో రెండు 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంగల రెండు యూనిట్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయ్యింది. తాజాగా స్టేజ్-2లో 800 మెగావాట్ల సామర్థ్యంతో మూడు యూనిట్లు నిర్మిస్తారు. స్టేజ్-2 నిర్మాణం కోసం రామగుండంలో స్థలం, నీరు, బొగ్గు అందుబాటులో ఉన్నాయని, ప్రభు త్వం పీపీఏ అనుమతి ఇచ్చాక ప్రజాభిప్రాయ సేక రిస్తారు. అనంతరం అధికారికంగా నిర్మాణం చేసేం దుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



బాసర ఆలయంలో హై కోర్టు న్యాయమూర్తి

భైంసా: బాసర జ్ఞానసరస్వతి అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి అలిశెట్టి లక్ష్మీనారాయణ ఆదివారం దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా బాసర వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు మర్యాదపూ ర్వకంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం ఆలయ అధికారులు శాలువాలతో సత్కరించి అమ్మవారి చిత్రపటం అం దించారు. ఆలయ పూజారులు ఆశీర్వదించి తీర్థప్ర సాదాలు అందజేశారు.

బాసరలో భక్తుల రద్దీ

భైంసా: ఆదివారం మాఘశుద్ధ పాడ్యమి కావడంతో బాసర జ్ఞానసరస్వతీ అమ్మవారి ఆలయానికి భక్తుల రద్దీ పెరిగింది. భక్తులు ముందుగా గోదావ రినదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడి శివాలయంలో పూజలు చేశారు. అనంతరం సర స్వతీ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మ వారిని దర్శించుకుని పూజలు చేశారు. అక్షరాభ్యాస మండపంలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిం చారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఆలయా నికి వివిధ సేవల ద్వారా రూ.12,72,850 ఆదా యం వచ్చినట్లు అధికారులు తెలిపారు. రూ.వెయ్యి అక్షరాభ్యాస సేవల ద్వారా రూ.5.97లక్షలు, రూ.150 లక్షరాభ్యాస సేవల ద్వారా రూ.63,300, రూ.100 మండప ప్రవేశం ద్వారా రూ.1,35,300, రూ.50 మండప ప్రవేశం ద్వారా రూ.21,200, అభి షేకం లడ్డూ ద్వారా రూ.2,32,900, ప్రసాదాల ద్వారా రూ. 1,46,450, ఇతర సేవల ద్వారా రూ.76,700 ఆదాయం వచ్చినట్లు వివరించారు.

ఫుట్‌బాల్ చాంపియన్ రామారెడ్డి



విజేతకు కప్ అందిస్తున్న భాగ్యలక్ష్మి

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని సింగ రేణి హైస్కూల్ మైదానంలో నిర్వహించిన దివం గత ఏఆర్ డీఎస్పీ శశిధర్ మెమోరియల్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ చాంపియన్‌గా కామారెడ్డి జిల్లాకు చెందిన రామారెడ్డి జట్టు నిలిచింది. మూడు రోజులపాటు నిర్వహించిన టోర్నీలో ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరిగిది. తుదిపోరులో కరీంనగర్, రామారెడ్డి జట్లు తలపడ్డాయి. మ్యాచ్ సెకండ్ ఆఫ్ లో రామారెడ్డి జట్టు ఒక గోల్ వేసింది. మ్యాచ్ చివ రి వరకు కరీంనగర్ జట్టు గోల్ చేయకపోవడంతో రామారెడ్డి జట్టు గెలిచింది. విజేతకు రూ.20 వేలు, షీల్డ్, రన్నరప్ జట్టుకు రూ.10 వేలు, షీల్డ్ జెడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ప్రదానం చేశారు.

కదిలించే కలం 'కందుకూరి'



కదలిక పుస్తకం ఆవిష్కరిస్తున్న నందిని సిధారెడ్డి

- కదిలిక ఆవిష్కరణలో సిధారెడ్డి

కరీంనగర్‌కల్చరల్: సమాజంలో కదలికను తీసుకొ చ్చే బలం రచయిత కందుకూరి అంజయ్య కలానికి ఉందని ప్రఖ్యాత సాహితీవేత్త, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి ప్రశం సించారు. అంబేద్కర్ పూలే పెరియార్ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఫిలింభవన్‌లో కందు కూరి అంజయ్య రచించిన ×కదలిక₹ సాహిత్య వ్యాసాల సంపుటి ఆవిష్కరించి మాట్లాడారు. కేకే.రంగనాథాచ్యాలు ప్రభావంతో పాటు కరీంన గర్ వాతావరణ కందుకూరి అంజయ్యను మంచి రచయితగా తీర్చిదిద్దాయన్నారు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ కందుకూరి కవిత్వంతో పాటు మరింత గద్యం నిరంతరం రాయాలని అన్నారు. అధ్యయన కందు కూరి నుంచి మరింత వచనా కావ్యాలు రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కవులు సీవీ.కుమార్, దామరకుంట శంకరయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తాం



మాట్లాడుతున్న విశారదన్

విద్యానగర్(కరీం నగర్): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంన గర్, పెద్దపల్లి ఎం పీ స్థానాల్లో పోటీ లో ఉంటామని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ పేర్కొ న్నారు. ఆదివారం కరీంనగర్‌లో ధర్మ సమాజ్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. కరీంనగర్ జిల్లా ప్రజల కన్నీళ్లు తుడవడానికే పార్టీ కార్యాలయం ప్రారంభించినట్లు వివరించారు. పార్లమెంట్ ఎన్నిక ల్లో కరీంనగర్, పెద్దపల్లి స్థానాలకు పోటీ చేయడం తోపాటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్నిచోట్ల బరి లో ఉంటామని స్పష్టం చేశారు. రీజియన్ బాధ్యులు శ్రీకాంత్, రాష్ట్ర కార్యదర్శి హరీశ్‌గౌడ్, నరేశ్, జిల్లా అధ్యక్షురాలు సాధన తదితరులు పాల్గొన్నారు.

సన్నిధి

"చేసిన పాపం చెప్పుకుంటే పోతుంది" ఇది జనుల వాడకంలో ఉండి, అందరి నోళ్లలోనూ నానుతూ ఉన్న మాట. పాపం అంటే ఇతరులకు అపకారం చేసినందువల్ల వచ్చే ఫలితం. దీనిని మామూలు మాటల్లో చెప్పాలంటే తప్పు. అందరూ అంగీకరించనిది. మానవమాత్రులు తప్పు చేయకుండా ఉండటం అసంభవం. తెలిసి కాకపోయినా, తెలియకుండా అయినా ఏదో ఒక తప్పు చేసే ఉంటారు.

మంచిమాట



చేసిన పాపం చెప్పుకుంటే పోతుంది

తప్పు అంటే ఏదైనా ఇతరులకి బాధ కలిగించే పని కాని, ధర్మానికి విరుద్ధమైన పని కాని చేయటం. ఎదుటివారికి మంచి అనుకుని చేసినది వారికి హాని కలిగించవచ్చు. అనుకోకుండా చేసినట్టయితే దానిని ''తప్పు అయి పోయింది'' అని ఒప్పుకొని ఎవరికి హాని కలిగిందో వారిని క్షమించమని అడిగితే సరి చేసుకునే అవకాశం ఉంటుంది. పరిహారం సమర్పించో, మరొక విధంగానో సద్దుబాటు చేసుకునే వీలు ఉంటుంది. ధర్మానికి అపచారం జరిగితే? .. .. దానిని కూడా ఒప్పుకొని పరిహారానికి ప్రయత్నం చేయాలి. ఇవి చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధం అయితే పరిణామం వేరొక విధంగా ఉంటుంది.

చేసిన పాపం చెప్పుకుంటే పోతుంది అంటే తాను చెప్పుకోవటమే కాదు. ఈ పాపం గురించి పదిమంది చెప్పుకుంటే అని. ఏదైనా విషయం గురించి ఎంత మంది మాట్లాడుకుంటే దాని ఫలితాన్ని అంతమంది పంచుకుంటారు కదా! ఆ విధంగా తాను చేసిన పనికి సంబంధించిన ఫలితాన్ని ఎంతోమంది పంచుకోవటం కారణంగా కర్తకి ఆ పనివల్ల కలగవలసిన తీవ్ర నష్టం సద్దుబాటు చేయబడుతుంది.

''కర్తా కారాయితా చైవ ప్రేరకశ్చానుమోదకః / సుకృతే దుష్కృతే చైవ చత్వారిః సమ భాగినః''. కారయితలు (చేయించినవారు), ప్రేరకులు కాకపోయినా దాని గురించి మాట్లాడుకున్నవారికి కొంత ఫలితం చెందుతుంది. కనుక కర్తకి స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. కొన్ని పనుల వల్ల ఎవరికి ఎటువంటి ఇబ్బంది ఉండదు. కాని, అది చేయకూడని పని అయితే చేయగలిగినది ఏమీ ఉండదు.

తాను చేసిన తప్పుని చెప్పటానికి ఎంతో ధైర్యం కావాలి. అటువంటి ధైర్యం ధర్మమార్గంలో నడిచే వారికి మాత్రమే ఉంటుంది. ''సత్యే ధర్మం ప్రతిష్ఠితా'', ధర్మం సత్యంలోనే నిలిచి ఉంటుంది. కనుక ఉన్నది ఉన్నట్టుగా చెప్పే వారు మాత్రమే ధర్మమార్గంలో ఉన్నట్టు. తన గొప్ప, ఘనతలు మాత్రమే కాక అపజయాలు, లోపాలు కూడా ఉన్నవి ఉన్నట్టుగా సందర్భం వచ్చినప్పుడు చెప్పగలగాలి. అప్పుడు అది ఎంతో మందికి మార్గదర్శక మౌతుంది. పొరపాట్లు ఎట్లా దొర్లుతాయి? వాటిని ఏ విధంగా అధిగమించవచ్చు? అని అవగాహన చేసుకోవటానికి గుణపాఠం అవుతుంది. తాను చేసిన పాపం అందరికీ తెలిస్తే గౌరవం తగ్గిపోతుందనే భయం ఉంటుంది సాధారణంగా. వాస్తవానికి తాత్కాలికంగా అదే జరిగినా, రాను రాను గౌరవం పెరుగుతుంది. నిజాయితీపరులు, మంచి చెడు తెలిసిన వారు అని. ఒకరి ద్వారా తెలియటం కాక తామే చెప్పటం వల్ల ఒక ఉపయోగం ఉంది. ఇతరులకి తెలిసి, వారు గోరంత విషయాన్ని కొండంత చేసి, ప్రచారం చేసే అవకాశం ఉండదు. ఈ పారదర్శకత నాయకుడుగా ఉండే వారికి తప్పని సరి.

చేసిన పాపం ఇతరులకి తెలిస్తే చులకన అయిపోతామేమో అనే ఆలోచనతో బయటికి చెప్పరు చాలమంది. చెప్పుకుంటే పరిహారం ఎట్లా చేయవచ్చో సూచనలు అందే అవకాశం ఉంటుంది. ఈ మాట అన్నంత మాత్రాన ప్రకటనలు చేయమని కాదు. శ్రేయోభిలాముల వద్ద మనసులో ఉన్న బరువు దింపుకుంటే తేలిక అవుతుంది. లోలోపల కుమిలి పోవటం, బయట పడుతుందేమోననే భయం, ఆందోళన ఉండవు. అప్పుడు తరువాతి కర్తవ్యం గోచరిస్తుంది. ఇదంతా తప్పు చేశాననే భావన ఉన్న వారి విషయంలో. తప్పు అని ఒప్పుకోటానికే ఇష్టం లేనివారి గురించి చెప్పటానికి ఏమీ లేదు.

– ఎస్.అనంతలక్ష్మి

వాగ్గేయకార వైభవం



అమ్మా! గంగమ్మా!! నన్ను రక్షించు!!!

సర్వసాధారణంగా మనం ఏదయినా ఒక విషయాన్ని పరిశీలించాలనుకుంటే అనేక గ్రంథాలు చూడాల్సి ఉంటుంది. కానీ ప్రత్యక్షంగా అటువంటి అనుబంధం కలిగిన ఒక మహాపురుషుని నోటివెంట వచ్చిన కీర్తన అదే పెద్ద గంగ. శాబ్దిక గంగ. గంగలాగే ముత్తుస్వామి దీక్షితార్ చేసిన కీర్తన .. శాబ్దిక గంగ కూడా ప్రవహించింది. అది పెద్ద పల్లవి, పెద్ద పెద్ద చరణాలతో ఉండదు. సులభంగా ఉంటుంది.

గంగే మాం పాహి...అంటారు ఆయన. 'ఓ గంగమ్మా! నన్ను రక్షించు' అని. నిజానికి రక్షించేది ఎవరు ? దేవతలు. ఎప్పుడయినా ఏదయినా దుష్కర్మ అనుభవించాల్సి వస్తే, కష్టం తరుముకొస్తుంటే... దానిని తొలగించగలిగిన వాడు భగవంతుడు. కానీ గంగమ్మ కూడా అలాగే రక్షించగలదు–అన్న నమ్మకంతో దీక్షితార్ వారు 'అమ్మా గంగమ్మా! నన్ను రక్షించు' అన్నారు. నిజానికి ఆమె శక్తి ఏపాటిది అంటే....

భాగవతంలో పరీక్షిత్తు ఏడు రోజుల్లో మరణిస్తానని గంగానదీతీరంలో ప్రాయోపవేశం చేసాడు. దాన్ని ఆంధ్రీకరించిన పోతన ఎంత గొప్పగా చెప్పారంటే... ''అమ్మా! నిను? జూచిన నరు?/ బొమ్మా యని ముక్తి కడకు? బుత్తు వ?ట కృపన్/లెమ్మా నీ రూపముతో/ రమ్మా నా కెదుర గంగ! రమ్యతరంగా!' అంటారు. అమ్మా! అని తన వంక చూస్తే చాలట. పొమ్మా.. అని మోక్షానికి పంపించివేస్తుందట. అంతే.. పూజలు మరేమీ అఖ్కర్లేదు.' నీ రూపంతో ఒక్కసారి నాకు ఎదురుగా రామ్మా... గంగమ్మా... నిన్ను చూడాలని ఉందమ్మా.. అంటారు. ఆమె శక్తి అంత గొప్పది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

శ్రీనాథుడు కాశీఖండంలో ఓ మాటంటారు..''గంగానది, గంగానది, గంగా నది...'' అని ఉచ్చరిస్తే చాలు.. అక్కడికి వెళ్ళి స్నానం కూడా చేయనక్కరలేదు. రాత్రి పడుకోబోయేముందో... పొద్దున లేస్తున్నప్పుడో... ఆ గంగానది వైభవాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ ...'గంగానది గంగానది గంగానది' అని ఎవరు తలచుకుంటారో వారి పాపాలన్నీ ఆమె తీసేస్తుంది... అంటారు. అదీ ఆమె ఘనత. గంగానదిలో ఉన్నది నీరు కాదు...ఆ నదికి ఒక అధిష్ఠాన దేవత ఉంది. ఆమె అనుగ్రహిస్తుందన్న నమ్మకం సనాతన ధర్మానిది.

దీక్షితార్ వారు'గంగే మాం పాహి' అన్నారంటే ... ఆయనకు అంత నమ్మకం. మరి ఆ నమ్మకాన్ని కలిగించినది ఎవరు... ఆయన ఏ కావ్యాలూ పఠించలేదు... ఎక్కడా చేరి చదువుకో లేదు. గురువుగారయిన చిదంబర యోగి శుశ్రూషలో తెలుసుకున్న విషయాలు అవి. గురువు గారి మీద నమ్మకం అంత గట్టిగా ఉండబట్టే... ఆయన నీవు గంగానదిలో మునిగి చెయ్యి పెట్టి తడుము... అనగానే మారుమాట మాట్లాడ కుండా వెళ్ళి వెతికితే.. ఆయనకు వీణ లభించింది .. అది ఆయనను వాగ్గేయకారుణ్ణి చేసింది. ఆ నమ్మకంతోనే ఆయన గంగమ్మను కొనియాడుతూ కీర్తన చేస్తూ... గంగేమాం పాహి!..అన్నారు. అది ఆయన నోటివెంట గంగా ప్రవాహంలా ... శాబ్దికగంగగా ప్రవహించింది. ఆయన ఎక్కడా శాస్త్రాలు చదువుకోక పోయినా ఈ కీర్తనలో ఆయన ఎన్నో పౌరాణిక విషయాలను ..అవి కూడా గాఢతతో ఉన్న విషయాలను సులభమైన భాషలో ప్రస్తావించారు.

పిచ్చుకతో పోలికా..?

బౌద్ధవాణి

వసంతకాలం వచ్చేసింది. చివురులు తొడిగిన చెట్లన్నీ పుష్పించాయి. పూత పిందెలుగా మారుతోంది. ప్రకృతి పూల పరిమళాలతో పరవశించి పోతోంది. ఆ మామిడితోటలో చల్లదనానికి తోడు చక్కని పరిమళాలు వీస్తున్నాయి. ఆ తోట ఒక అంచున పెద్ద కాలువ. నీరు బాగా ఇంకి పోయి ఉంది. పాయలు పాయలుగా సన్నని ధారలు ప్రవహిస్తున్నాయి. ఆ కాలువ గట్టు మీద పెద్ద మామిడిచెట్టు. సమయం మధ్యాహ్నం దాటింది. పొద్దు పడమటికి వాలింది. ఆ చెట్టు కింద భిక్షుగణంతో కూర్చొని ఉన్నాడు బుద్ధుడు.

భిక్షువులకి తాము తీసుకోవలసిన ఆహార నియమాల గురించి బోధిస్తున్నాడు.

''భగవాన్! నేను రోజుకు మూడు పూటలా తినేవాణ్ణి. చిన్నతనం నుండి అదే అలవాటు. బౌద్ధసంఘంలో చేరాక ఉదయం, సాయంత్రం కొన్నాళ్ళు తిన్నాను. మధ్యాహ్నం క్రమంగా మానేశాను. కొన్నాళ్ళు చాలా బాధ అనిపించింది. ఆకలికి తాళలేకపోయాను. కానీ... కొన్నాళ్ళకు అదే అలవాటైంది. ఆ తరువాత మీరు... ''రాత్రి భోజనం మానండి'' అన్నారు. నెమ్మదిగా మానేశాను. ఇప్పుడు రోజుకి ఒక్కపూట భోజనం చేస్తున్నాను. ఆరోగ్యంగా ఉన్నాను. ఉత్సాహంగా ఉన్నాను. తేలికపడ్డాను. చదువు పట్ల శ్రద్ధ పెరిగింది.'' అన్నాడు ఉదాయి అనే భిక్షువు.

అంతలో ఆ పక్కనే ఉన్న తుమ్మచెట్టు మీదనుండి పిచ్చుకల అరుపులు వినిపించాయి. కొందరు అటుకేసి చూశారు. అరుపులు నెమ్మదిగా సద్దుమణిగాయి. చిక్కని కొమ్మల్లో చిక్కుకుపోయిన పిచ్చుక నెమ్మదిగా బైటపడి, రెక్కలు దులుపుకుని లేచిపోయింది.

''భగవాన్! రాత్రిపూట చీకటిలో భిక్ష కోసం తిరగాలంటే.. ఎన్నో ఇబ్బందులు వచ్చేవి. ఒకసారి నేను మురికి గుంటలో పడ్డాను. మన ధర్మపాలుడైతే ముళ్ళ పొదలో చిక్కుకున్నాడు'' అన్నాడు ఒక భిక్షువు.

''నేనైతే... ఒకసారి దొంగలమూకతో కలసి పోయాను'' అన్నాడు ఇంకో భిక్షువు.

''భగవాన్! నా అనుభవం చెప్పడానికి మరీ ఇబ్బందికరం. ఆరోజు రాత్రి మబ్బు పట్టింది. నేను ఒకరి ఇంటికి వెళ్ళే సమయానికి పెద్ద మెరుపు మెరిసింది. ఇంటి పెరట్లో ఉన్న స్త్రీ నన్ను ఒక్కసారి చూసి భూతం అనుకొని భయపడింది. పెద్దగా అరిచింది. తెగ తిట్టి పోసింది. నేను ''చెల్లీ! నేను భిక్షువుని'' అని సర్ది చెప్పి బైటపడ్డాను'' అన్నాడు మరో భిక్షువు.

కానీ కొందరు భిక్షువులు మాత్రం అసహనంగా కూర్చొని ఉన్నారు. వారికి ఒంటిపూట భోజనం అలవాటు కావడం లేదు. మూడుపూటలా తింటే గానీ... ఆకలి శాంతించదు. కొందరు కనీసం రెండు పూటల'' అన్నారు.



అంతలో... తుమ్మచెట్టు మీద మరలా పిచ్చుకల అలజడి... చిక్కని కొమ్మల మధ్య చిక్కుకుపోయిన ఎండు పీచుల మధ్య చిక్కుకుపోయింది ఒక పిచ్చుక. అది అటూ ఇటూ కొట్టుకుంటుంది. కొట్టుకున్న కొద్దీ ఇంకా ఇంకా చిక్కుకు పోతోంది.

బుద్ధుడు నెమ్మదిగా... ''భిక్షువులారా! మీలో ఒకరు వెళ్లి ఆ బంధనాలు విడిపించండి'' అన్నాడు. ఒక భిక్షువు లాఘవంగా చెట్టెక్కి పిచ్చుక బంధనాల్ని తొలగించాడు. అది భయంతో తుర్రున ఎగిరిపోయింది.

''భిక్షువులారా! చూశారా! ఆ పిచ్చుక చిక్కుకున్న బంధాలు చిన్న చిన్న పీచులు. ఎండిపోయినవి. బలహీనమైనవి. కానీ, ఆ పిచ్చుక దాన్ని తెంచుకోలేక పోయింది.. కారణం?'' అని అడిగాడు.

''ఆ పిచ్చుక ఆ బంధనాల కంటే బలహీనమైంది'' అన్నాడు ఉదాయి.

''మరి, చాలా బలమైన గొలుసులతో తాళ్ళతో బంధించిన ఏనుగు ఆ బలమైన బంధనాన్ని సైతం తెగ తెంచుకోగలదు. ఆహారం విషయంలో మీలో కొందరు ఆ పిచ్చుకలాంటి వారే. మరికొందరు ఏనుగు లాంటివారు. కోరి కల్ని తెగ తెంచుకోగలిగారు'' అన్నాడు.

''బుద్ధుడు, ఇంకా ఎందరో భిక్షువులు ఒంటిపూట భోజనంతో సంతోషంగా, ఆరోగ్యంగా, శక్తిమంతంగా ఉంటున్నారు. మేమెందుకు పిచ్చుకలంత బలహీనులం కావాలి?'' అనుకున్నారు ఆకలికి ఆగలేనివారు.

వారూ నెమ్మదిగా దాన్ని సాధించుకున్నారు. మాకు పిచ్చుకలతో పోలికా? అన్నట్లు దృఢచిత్తులయ్యారు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా



● సమంత

ఐయామ్ బ్యాక్

'ఐయామ్ బ్యాక్' అంటున్నారు సమంత. 2022లో తాను మయోసైటిస్ వ్యాధితో బాధపడుతున్నట్లుగా, ఇందుకు సంబంధించిన చికిత్స తీసుకుంటున్నట్లుగా సమంత వెల్లడించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఆ తర్వాత సమంత ఎక్కువ సినిమాలు సైన్ చేయలేదు. గత ఏడాది జూలైలో చికిత్సలో భాగంగా ఓ ఏడాది పాటు సినిమాలకు దూరంగా ఉంటానని తెలిపారు సమంత. అయితే ఇప్పుడు అనారోగ్య ఇబ్బందులు లేవనీ, పూర్తి స్థాయిలో 'ఐయామ్ బ్యాక్ టు వర్క్' అంటూ ఓ వీడియో రిలీజ్ చేశారు సమంత. గత కొన్ని నెలల విరామంలో ఆరోగ్యం గురించి కొన్ని పాడ్‌కాస్ట్‌లు చేసినట్లు, త్వరలోనే అవి విడుదల చేయనున్నట్లు కూడా ఆమె తెలిపారు. ఇక 'ది ఫ్యామిలీ మేన్ 2' వెబ్ సిరీస్ తర్వాత సమంత నటించిన 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్ వెబ్ సిరీస్ ఈ వేసవిలో స్ట్రీమింగ్ కానుంది. వరుణ్ ధావన్ హీరోగా నటించిన ఈ వెబ్ సిరీస్‌కు 'ది ఫ్యామిలీమేన్' ఫేమ్ రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించారు.



● వివేక్ కూచిభొట్ల, టీజీ విశ్వప్రసాద్, రవితేజ, కావ్యా థాపర్, అవసరాల శ్రీనివాస్, కార్తీక్

నన్ను నేను నమ్మలేకపోయాను – రవితేజ

రవితేజ హీరోగా నటించిన చిత్రం 'ఈగల్'. ఇందులో కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న విడుదలైంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా సక్సెస్‌మీట్‌లో రవితేజ మాట్లాడుతూ– ''ఈగల్'కు ప్రేక్షకుల నుంచి వస్తోన్న స్పందన సంతోషాన్నిస్తోంది. కార్తీక్ 'ఈగల్' కథ చెప్పినప్పుడే సహదేవ వర్మ పాత్రకు ఎగ్జైట్ అయ్యాను. నా పాత్ర మేకోవర్‌కు మంచి ప్రశంసలు వస్తున్నాయి. సినిమాలోని కాళికాదేవి ఎపిసోడ్‌లో నన్ను నేను నమ్మలేకపోయాను. పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి అభినందనలు. హరీష్ శంకర్‌తో చేస్తున్న 'మిస్టర్ బచ్చన్' సినిమాతో ఈ బ్యానర్లో హాట్రిక్ కొడుతున్నాం. కార్తీక్, కావ్యా థాపర్‌లకు మంచి భవిష్యత్ ఉంది'' అన్నారు. ''యాక్షన్ సినిమా తీయాలనే నా ఆశ రవితేజగారి 'ఈగల్'తో నెరవేరింది'' అన్నారు కార్తీక్. ''రవితేజగారితో 'ధమాకా'లాంటి బ్లాక్‌బస్టర్ ఇచ్చి, ఇప్పుడు 'ఈగల్'తో ఈ బ్లాక్‌బస్టర్‌ను కొనసాగించాం'' అన్నారు టీజీ విశ్వప్రసాద్. దర్శకుడు హరీష్‌శంకర్, 'ఈగల్' యూనిట్ సభ్యులు ఈ సక్సెస్ సెలబ్రేషన్స్‌లో పాల్గొన్నారు.

ఇది నాకు స్పెషల్ ఫిల్మ్ – సందీప్ కిషన్

సందీప్ కిషన్ హీరోగా నటించిన ఫ్యాంటసీ అడ్వెంచరస్ మూవీ 'ఊరు పేరు భైరవకోన'. ఈ చిత్రంలో కావ్యా థాపర్, వర్ష బొల్లమ్మ కథానాయికలుగా నటించారు. వీఐ ఆనంద్ దర్శకత్వంలో అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన ఈ సినిమా ప్రెస్‌మీట్‌లో సందీప్ కిషన్ మాట్లాడుతూ– ''ఇది నాకు స్పెషల్ మూవీ. రెండున్నర సంవత్సరాలుగా ఈ సినిమా కోసం కష్టపడుతూనే ఉన్నాం. ఫ్యాంటసీ, సూపర్ నేచురల్ ఎలిమెంట్స్ ఉన్న మంచి కమర్షియల్ సినిమా ఇది'' అన్నారు. ''ఊరు పేరు భైరవకోన' చిత్రం అద్భుతమైన జర్నీ. ఈ సినిమాలోని ప్రతి మూమెంట్ మాకు ఓ కొత్త అనుభవం. ఫ్యాంటసీ ఎలిమెంట్స్‌తో పాటు కథలో మంచి లవ్‌స్టోరీ కూడా ఉంది'' అన్నారు వీఐ ఆనంద్. ''ఈ సినిమాతో సందీప్ నెక్ట్స్ లెవల్‌కి వెళ్తాడు'' అన్నారు అనిల్ సుంకర. ''ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని ఇచ్చే చిత్రం ఇది. సాంగ్స్, ఆర్ఆర్ ప్రేక్షకులను మెప్పిస్తాయి'' అన్నారు సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర.



● వర్ష బొల్లమ్మ, సందీప్ కిషన్

వినోదాల ఉత్సవం

రెజీనా కసాండ్రా, దిలీప్ ప్రకాశ్ జంటగా నటించిన చిత్రం 'ఉత్సవం'. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేష్ పాటిల్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మ్యూజిక్ ప్రమోషన్స్‌ని ప్రారంభించారు మేకర్స్. 'ఫస్ట్ కిస్..' అంటూ సాగే తొలి పాటని విడుదల చేసింది యూనిట్. చిత్ర సంగీతదర్శకుడు అనూప్ రూబెన్స్ స్వరపరచిన ఈ పాటకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా రామ్ మిరియాల పాడారు. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''ప్రేమ, వినోదం, భావోద్వేగాలతో కూడిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'ఉత్సవం' రూపొందింది. హీరో, హీరోయిన్ల మధ్య వచ్చే 'ఫస్ట్ కిస్..' పాట యువతను ఆకట్టుకుంటుంది. యువతరంతో పాటు కుటుంబ ప్రేక్షకులందరూ చూడదగ్గ చిత్రం ఇది'' అన్నారు.



● దిలీప్ ప్రకాశ్, రెజీనా కసాండ్రా

మహేశ్ సరసన ఇండోనేషియా బ్యూటీ

హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ చిత్రం రానున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ఇండోనేషియా బ్యూటీ చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ ఓ హీరోయిన్‌గా నటిస్తారనే వార్త కొన్ని రోజులుగా వస్తున్న సంగతి తెలిసిందే. ఈ వార్త నిజమయ్యే అవకాశం కనిపిస్తోంది. ఎందుకంటే ఇన్‌స్టాగ్రామ్‌లో రాజమౌళిని ఫాలో అవుతున్నారు చెల్సియా. అలాగే మహేశ్‌బాబు– రాజమౌళి సినిమాల అప్‌డేట్స్‌ను ఇన్‌స్టాలో చెల్సియా ఫాలో అవుతున్నట్లుగా తెలుస్తోంది. దాంతో మహేశ్‌కు జోడీగా చెల్సియా ఆల్మోస్ట్ కన్ఫార్మ్ అంటున్నారు ఫిల్మ్‌నగర్ వాసులు. కేఎల్ నారాయణ నిర్మించనున్న ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది వేసవిలో ప్రారంభం కానుందట.



● చెల్సియా ఎలిజబెత్


స్వయంభూ కోసం స్వారీ

సవాల్ చేసే పాత్ర రావాలే కానీ ఎంత కష్టమైనా పడటానికి రెడీ అంటున్నారు సంయుక్తా మీనన్. ఆమెకు 'స్వయంభూ' సినిమా సవాల్ విసిరింది. నిఖిల్ హీరోగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ పాన్ ఇండియా మూవీలో సంయుక్తా మీనన్ కథానాయిక. ఈ చిత్రంలో చేస్తున్న ఓ లెజెండ్రీ యోధుడి పాత్ర కోసం నిఖిల్ ప్రత్యేకమైన ఆయుధాలు, మార్షల్ ఆర్ట్స్, గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకున్నారు. భారీ యుద్ధ సన్నివేశాలు ఉన్న ఈ చిత్రంలో సంయుక్తా మీనన్ కూడా పోరాట సన్నివేశాలు చేయాల్సి ఉంటుంది. ఈ స్టంట్స్ చేయడానికి గుర్రపు స్వారీ నేర్చుకుంటున్నారు సంయుక్తా మీనన్. ''స్వయంభూ' కోసం గుర్రపు స్వారీ నేర్చుకుంటున్నా. ఇదొక అద్భుతమైన ప్రయాణం'' అన్నారు సంయుక్త. హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో ప్రస్తుతం నిఖిల్, ఇతర తారాగణం పాల్గొనగా ఈ చిత్రం షూటింగ్ జరుగుతోంది.



● సంయుక్తా మీనన్

పర్యావరణం నేపథ్యంలో...



● దేవనాథ రామానుజ చిన్న జీయర్ స్వామి, స్మైల్ శ్రీను

ప్రకృతి, పర్యావరణం నేపథ్యంలో రూపొందుతున్న పాన్ ఇండియా మూవీ 'మైరా'. కన్నడంలో గుర్తింపు తెచ్చుకున్న స్మైల్ శ్రీను ఈ తెలుగు చిత్రానికి దర్శకుడు. త్రిదండి దేవనాథ రామానుజ చిన్న జీయర్ స్వామిని కలిసి 'మైరా' స్క్రిప్ట్‌కి పూజ చేయించి, ఆశీస్సులు తీసుకున్నారు శ్రీను. త్రిదండి చిన్న జీయర్ స్వామి మాట్లాడుతూ– ''ప్రకృతికి విరుద్ధంగా జీవిస్తూ, పర్యావరణాన్ని నాశనం చేస్తున్న ప్రస్తుత సమాజానికి ఉపయోగపడేలా 'మైరా' ఉంటుందని అనిపిస్తోంది'' అన్నారు. ''మైరా'కు తన ఆశీస్సులు, శిష్యుల సపోర్ట్ ఉంటుందని దేవనాథ రామానుజ జీయర్ స్వామివారు చెప్పడం ఆనందంగా ఉంది. ఈ సినిమాను తెలుగులో తీసి, కన్నడతో పాటు ఇతర భాషల్లో అనువాదం చేస్తాం. ఓ స్టార్ హీరోయిన్ మా సినిమాలో నటిస్తారు'' అన్నారు స్మైల్ శ్రీను.

టీఎఫ్‌డీఏ నూతన అధ్యక్షుడిగా వీరశంకర్

తెలుగు సినీ దర్శకుల సంఘం (టీఎఫ్‌డీఏ) సంఘం నూతన అధ్యక్షుడిగా దర్శకుడు బి. వీరశంకర శ్రీనివాస్ (వీరశంకర్) గెలుపొందారు. 2024–2026 సంవత్సరాలకు గాను ఆదివారం హైదరాబాద్‌లో టీఎఫ్‌డీఏ ఎన్నికలు జరిగాయి. దర్శకుల సంఘంలో దాదాపు 2000 మంది సభ్యులున్నారు. ఎన్నికల్లో 1113 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్ష పదవికి బి. వీరశంకర శ్రీనివాస్, వి. సముద్రరావు, జి. రామ్ ప్రసాద్, ఏఎస్ రవికుమార్ చౌదరి, పానుగంటి రాజారెడ్డి పోటీ చేశారు. ఈ పోటీలో 536 ఓట్లతో వీరశంకర్ విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా నీలం సాయిరాజేశ్, ఎమ్‌వీఎన్ రెడ్డి (వశిష్ఠ), జనరల్ సెక్రటరీగా సీహెచ్ సుబ్బారెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా వద్దానం రమేశ్, కస్తూరి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పీఎస్ ప్రియదర్శి, డి. వంశీకృష్ణ జయకేతనం ఎగురవేశారు. ట్రెజరర్‌గా పీవీ రామారావు గెలుపొందారు. కార్యవర్గ సభ్యులుగా ఎ. కృష్ణమోహన్, అల్లా భక్స్, రాజా వన్నెంరెడ్డి, శైలేష్ కొలను, శ్రీరామ్ ఆదిత్య తుర్లపాటి, కూరపాటి రామారావు, లక్ష్మణరావు చాపర్ల, ప్రవీణ మడిపల్లి, రమణ మొగిలి, కొండా విజయ్ కుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల అనంతరం నూతన అధ్యక్షుడు వీరశంకర్ మాట్లాడుతూ– ''తెలుగు దర్శకుల సంఘం స్థాయిని నెక్ట్స్ లెవల్‌కి తీసుకుని వెళ్లేందుకు అందరం కలిసి కృషి చేస్తాం. ఇప్పుడు ఉన్న టీఎఫ్‌డీఏను 'టీఎఫ్‌డీఏ 2.ఓ' అన్నట్లుగా వర్క్ చేస్తాం. హైదరాబాద్‌కు ఎవరైనా పర్యాటకులు వస్తే టీఎఫ్‌డీఏ బిల్డింగ్ ముందు సెల్ఫీ తీసుకోవాలన్నట్లుగా చేస్తాం. మంచి ఆలోచనలుంటే ప్రభుత్వ సహకారం కూడా లభిస్తుంది'' అన్నారు.



● వీరశంకర్

ప్రజా సేవలో..



● నంద కిశోర్

నంద కిశోర్, రోజా హీరో హీరోయిన్లుగా దుర్గా దేవ్ నాయుడు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ప్రవీణ్ ఐపీఎస్'. 'ఇక ప్రజా సేవలో..' అనేది ట్యాగ్‌లైన్. ఈ చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఈ సినిమా ట్రైలర్‌ను దర్శకుడు సి. ఉమామహేశ్వరరావు, నిర్మాత వివేక్ కూచిభొట్ల రిలీజ్ చేశారు. ''విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ప్రవీణ్‌గారిలా వెండితెరపై కనిపించేందుకు ప్రయత్నం చేశాను'' అన్నారు నంద కిశోర్. ''ఇది నా తొలి చిత్రం'' అన్నారు దుర్గా దేవ్.



చెన్నై ఓపెన్ చాంపియన్ సుమిత్ నగాల్

భారత టెన్నిస్ నంబర్‌వన్ సుమిత్ నగాల్ స్వదేశంలో తొలిసారి ఏటీపీ చాలెంజర్ టోర్నీ టైటిల్‌ను సాధించాడు. ఆదివారం ముగిసిన చెన్నై ఓపెన్ ఏటీపీ చాలెంజర్-100 టోర్నీలో సుమిత్ విజేతగా నిలిచాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 121వ ర్యాంకర్ సుమిత్ 6-1, 6-4తో 114వ ర్యాంకర్ లుకా నార్డీ (ఇటలీ)పై గెలిచి తన కెరీర్‌లో నాలుగో ఏటీపీ చాలెంజర్ టోర్నీ టైటిల్ సాధించాడు. విజేతగా నిలిచిన సుమిత్‌కు 18,230 డాలర్ల (రూ. 15 లక్షల 13 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 100 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

భారత్‌ను గెలిపించిన శ్రీజేశ్

పురుషుల ప్రొ హాకీ లీగ్‌లో భాగంగా ఆదివారం భువనేశ్వర్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు 'షూటౌట్'లో 4-2తో డిఫెండింగ్ చాంపియన్ నెదర్లాండ్స్‌కు షాక్ ఇచ్చింది. ఈ టోర్నీలో భారత్‌కిది రెండో విజయం. 'షూటౌట్'లో గోల్‌కీపర్ శ్రీజేశ్ నెదర్లాండ్స్ జట్టు రెండు ప్రయత్నాలను నిలువరించి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. అంతకుముందు నిర్ణీత సమయం ముగిసేసరికి రెండు జట్లు 2-2తో సమంగా నిలిచాయి.



కుర్రాళ్లూ వదిలేశారు

- అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో యువ భారత్ ఓటమి
- అన్నీ గెలిచి తుది మెట్టుపై బోల్తా పడ్డ టీమిండియా
- నాలుగోసారి టైటిల్ నెగ్గిన ఆస్ట్రేలియా



ఉదయ్

అచ్చు సీనియర్లలాగే... జూనియర్లూ సమర్పించుకున్నారు. ఆఖరి పోరు దాకా అజేయంగా నిలిచిన యువ భారత్ జట్టు ఆఖరి మెట్టుపై మాత్రం ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. గతేడాది వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ బృందం కూడా ఎదురులేని పోరాటంతో ఫైనల్ చేరింది. చివరకు ఆస్ట్రేలియా చేతిలోనే కంగుతింది. ఇక్కడా భారత జూనియర్ జట్టు ఫైనల్ చేరే క్రమంలో అన్ని మ్యాచ్‌ల్లో గెలిచి కీలకమైన తుది పోరులో ఆస్ట్రేలియా జట్టు చేతిలోనే ఓటమి చవిచూసింది. వెరసి మూడు నెలల వ్యవధిలో ఆస్ట్రేలియా సీనియర్, జూనియర్ జట్లు వన్డే ప్రపంచకప్ టైటిల్స్‌ను హాట్ ఫేవరెట్ అయిన భారత్‌పైనే గెలవడం పెద్ద విశేషం.



బెనోని (దక్షిణాఫ్రికా): ప్రపంచకప్ కోసం ప్రతీ మ్యాచ్‌లో చిందించిన చెమటంతా ఫైనల్‌కు వచ్చేసరికి ఆవిరైంది. యువ భారత్ జైత్రయాత్ర కప్ అందుకోవాల్సిన మ్యాచ్‌లో పేలవంగా ముగిసింది. అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ 79 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. మొదట ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 253 పరుగులు చేసింది. హర్జస్ సింగ్ (55; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ హ్యూగ్ వీగెన్ (48; 5 ఫోర్లు) రాణించారు. సీమర్లు రాజ్ లింబాని 3, నమన్ తివారి 2 వికెట్లు తీశారు. గతంలో ఐదుసార్లు చాంపియన్‌గా నిలిచిన భారత జట్టు లక్ష్య ఛేదనలో తడబడింది. చివరకు 43.5 ఓవర్లలో 174 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ ఆదర్శ్ సింగ్ (77 బంతుల్లో 47; 4 ఫోర్లు, 1 సిక్స్), హైదరాబాద్ కుర్రాడు మురుగన్ అభిషేక్ (46 బంతుల్లో 42; 5 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బియర్డ్‌మన్ (3/15) కోలుకోలేని దెబ్బ తీయగా, రాఫ్ మెక్‌మిలన్ (3/43) ఇంకెవరినీ క్రీజులో నిలువనీయలేదు.

చక్కగా కట్టడి చేసినప్పటికీ...

టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా బ్యాటర్లెవరూ భారీ స్కోర్లు చేయకుండా భారత బౌలర్లు చక్కగానే కట్టడి చేశారు. హర్జస్ అర్ధసెంచరీ సాధించగా, వీగెన్, డిక్సన్ (56 బంతుల్లో 42; 3 ఫోర్లు, 1 సిక్స్), ఒలీవర్ (43 బంతుల్లో 46 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్)లను అర్ధశతకాల వరకు రానివ్వలేదు. లింబాని, నమన్ వరుస విరామాల్లో వికెట్లు తీశారు. అందువల్లే పెద్దస్కోరైతే నమోదు కాలేదు.



ఆదర్శ్

రాణించిన ఆదర్శ్, అభిషేక్

కష్టమైన లక్ష్యం కాదు... ఈ మెగా ఈవెంట్‌లో మన కుర్రాళ్ల ఫామ్ ముందు ఛేదించే లక్ష్యమే! పెద్దగా కష్టపడకుండా ఏ ఇద్దరు ఫిఫ్టీలు బాదినా... ఇంకో ఇద్దరు 30 పైచిలుకు పరుగులు చేసినా చాలు గెలవాల్సిన మ్యాచ్ ఇది! కానీ టాపార్డర్‌లో అర్షిన్ (3), ముషీర్ ఖాన్ (22), మిడిలార్డర్‌లో నమ్మదగిన బ్యాటర్లు కెప్టెన్ ఉదయ్ సహారణ్ (8), సచిన్ దాస్ (8)ల వికెట్లను పారేసుకోవడంతో 68/4 స్కోరు వద్దే భారత్ పరాజయం ఖాయమైంది. ఎందుకంటే తర్వాత వచ్చిన వారెవరూ సుదీర్ఘ ఇన్నింగ్స్‌లు ఆడలేనివారే! ఆదర్శ్, అభిషేక్‌ల పోరాటం అంతరాన్ని తగ్గించేందుకు ఉపయోగపడింది.

1 అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో భారత్‌పై నెగ్గడం ఆస్ట్రేలియాకిదే తొలిసారి. ఈ రెండు జట్లు 2012, 2018 టోర్నీ ఫైనల్స్‌లోనూ తలపడగా రెండుసార్లూ భారత జట్టే గెలిచింది.

4 అండర్-19 ప్రపంచకప్ ఫైనల్లో భారత్‌ను ఓడించిన నాలుగో జట్టు ఆస్ట్రేలియా. గతంలో పాకిస్తాన్ (2006), వెస్టిండీస్ (2016), బంగ్లాదేశ్ (2020) ఫైనల్లో ఓడించి విజేతగా నిలిచాయి.

4 అండర్-19 ప్రపంచకప్ సాధించడం ఆస్ట్రేలియాకిది నాలుగోసారి. గతంలో ఆ జట్టు 1988, 2002, 2010లలో విజేతగా నిలిచింది.

2012 భారత అండర్-19 జట్టుపై 2012 తర్వాత ఆస్ట్రేలియా యువ జట్టు మళ్లీ గెలుపొందడం విశేషం. గత 12 ఏళ్లలో ఆస్ట్రేలియా జూనియర్ జట్టుతో ఆడిన 10 మ్యాచ్‌ల్లోనూ యువ భారత్ విజయం సాధించింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: డిక్సన్ (సి) అభిషేక్ (బి) తివారి 42; కొన్‌స్టాస్ (బి) లింబాని 0; వీగెన్ (సి) ముషీర్ (బి) తివారి 48; హర్జస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సౌమీ పాండే 55; హిక్స్ (ఎల్బీడబ్ల్యూ) (బి) లింబాని 20; ఒలీవర్ (నాటౌట్) 46; మెక్‌మిలన్ (సి అండ్ బి) ముషీర్ 2; అండర్సన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) లింబాని 13; స్ట్రేకర్ (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 253.** **వికెట్ల పతనం:** 1-16, 2-94, 3-99, 4-165, 5-181, 6-187, 7-221. **బౌలింగ్:** రాజ్ లింబాని 10-0-38-3, నమన్ తివారి 9-0-63-2, సౌమీ పాండే 10-0-41-1, ముషీర్ 9-0-46-1, అభిషేక్ 10-0-37-0, ప్రియాన్షు 2-0-17-0.

భారత్ ఇన్నింగ్స్: ఆదర్శ్ (సి) హిక్స్ (బి) బియర్డ్‌మన్ 47; అర్షిన్ (సి) హిక్స్ (బి) విడ్లెర్ 3; ముషీర్ (బి) బియర్డ్‌మన్ 22; ఉదయ్ (సి) వీగెన్ (బి) బియర్డ్‌మన్ 8; సచిన్ (సి) హిక్స్ (బి) మెక్‌మిలన్ 9; ప్రియాన్షు (సి) విడ్లెర్ (బి) అండర్సన్ 9; అవనీశ్ రావు (సి అండ్ బి) మెక్‌మిలన్ 0; అభిషేక్ (సి) వీగెన్ (బి) విడ్లెర్ 42; లింబాని (బి) మెక్‌మిలన్ 0; నమన్ (నాటౌట్) 14; సౌమీ (సి) హిక్స్ (బి) స్ట్రేకర్ 2; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (43.5 ఓవర్లలో ఆలౌట్) 174.** **వికెట్ల పతనం:** 1-3, 2-40, 3-55, 4-68, 5-90, 6-91, 7-115, 8-122, 9-168, 10-174. **బౌలింగ్:** విడ్లెర్ 10-2-35-2, అండర్సన్ 9-0-42-1, స్ట్రేకర్ 7.5-1-32-1, బియర్డ్‌మన్ 7-2-15-3, మెక్‌మిలన్ 10-0-43-3.

ఎలైట్ డివిజన్‌కు హైదరాబాద్, మేఘాలయ

రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్ టైటిల్ పోరుకు అర్హత



తనయ్

సాక్షి, హైదరాబాద్: వరుసగా ఆరో మ్యాచ్‌లోనూ ఇన్నింగ్స్ తేడాతో విజయం సాధించిన హైదరాబాద్ జట్టు రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. తద్వారా వచ్చే సీజన్‌లో ఎలైట్ డివిజన్‌లో పోటీ పడేందుకు అర్హత సంపాదించింది. ఉప్పల్ స్టేడియంలో నాగాలాండ్ జట్టుతో ఆదివారం ముగిసిన తొలి సెమీఫైనల్లో హైదరాబాద్ ఇన్నింగ్స్ 68 పరుగుల తేడాతో గెలిచింది. మరోవైపు రెండో సెమీఫైనల్లో మేఘాలయ ఆరు వికెట్ల తేడాతో మిజోరం జట్టును ఓడించి హైదరాబాద్‌తో టైటిల్ పోరుకు సిద్ధమైంది. ఫైనల్ చేరడంతో మేఘాలయ జట్టు కూడా వచ్చే సీజన్‌లో ఎలైట్ డివిజన్‌లో ఆడుతుంది. హైదరాబాద్‌తో జరిగిన సెమీఫైనల్లో మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 20/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన నాగాలాండ్ 58.3 ఓవర్లలో 188 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ 81 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టగా... కెప్టెన్ తిలక్ వర్మ 30 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు.

మ్యాక్స్‌వెల్ మెరుపు సెంచరీ

అడిలైడ్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ఆస్ట్రేలియా జట్టు వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన రెండో టి20లో ఆస్ట్రేలియా 34 పరుగుల తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 241 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ మ్యాక్స్‌వెల్ (55 బంతుల్లో 120 నాటౌట్; 12 ఫోర్లు, 8 సిక్స్‌లు) అసాధారణ బ్యాటింగ్‌తో ఐదో సెంచరీ చేశాడు. తద్వారా అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్‌గా రోహిత్ శర్మ (5 సెంచరీలు) పేరిట ఉన్న రికార్డును మ్యాక్స్‌వెల్ సమం చేశాడు. 242 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 207 పరుగులు చేసి ఓడిపోయింది.



భారీ ఆధిక్యంలో ఆంధ్ర



రికీ భుయ్

సాక్షి, విజయనగరం: ఉత్తరప్రదేశ్ జట్టుతో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ డివిజన్ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 334 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 19/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర మూడో రోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్లు కోల్పోయి 271 పరుగులు చేసింది. కెప్టెన్ రికీ భుయ్ (100 బ్యాటింగ్; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) శతకం సాధించాడు. రషీద్ (42 బ్యాటింగ్; 5 ఫోర్లు)తో కలిసి భుయ్ ఆరో వికెట్‌కు 87 పరుగుల భాగస్వామ్యం జోడించాడు. విహారి (48; 6 ఫోర్లు), షోయబ్ (31; 6 ఫోర్లు) కూడా రాణించారు.

నిఖత్‌కు రజతం



సోఫియా: స్ట్రాంజా స్మారక అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీలో భారత్‌కు రెండు స్వర్ణాలు, నాలుగు రజతాలు లభించాయి. మహిళల 50 కేజీల ఫైనల్లో తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ 2-3తో సబీనా (ఉజ్బెకిస్తాన్) చేతిలో, 66 కేజీల ఫైనల్లో అరుంధతి 1-4తో లి యంగ్ (చైనా) చేతిలో ఓడి రజత పతకాలను దక్కించుకున్నారు. పురుషుల 51 కేజీల ఫైనల్లో అమిత్ 5-0తో తష్కెంబే (కజకిస్తాన్)పై, 57 కేజీల ఫైనల్లో సచిన్ 5-0తో షఖ్‌జోద్ (ఉజ్బెకిస్తాన్)పై నెగ్గి స్వర్ణాలు సాధించారు. ఫైనల్స్‌లో బరున్ సింగ్ (48 కేజీలు), రజత్ (67 కేజీలు) ఓడి రజత పతకాలు గెలిచారు.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

నంద్యాల జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో 13 పోస్టులు

నంద్యాల జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం..ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 13
» **పోస్టుల వివరాలు:** సెంట్రల్ అడ్మినిస్ట్రేటర్-01, కేస్ వర్కర్-02, పారా లీగల్ పర్సనల్ లాయర్-01, పారా మెడికల్ పర్సనల్-01, సైకోసోషల్ కౌన్సిలర్-01, ఆఫీస్ అసిస్టెంట్-01, మల్టీ పర్పస్ స్టాఫ్/కుక్-03, సెక్యూరిటీ గార్డ్/నైట్ గార్డ్-03.
» **అర్హత:** హైస్కూల్, డిగ్రీ, పీజీ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 25 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును నంద్యాల జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 12.02.2024.
» **వెబ్‌సైట్:** https://nandyal.ap.gov.in

ఏఎన్‌యూ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్-2024

గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో సెల్ఫ్ సపోర్ట్ విధానంలో బీటెక్+ఎంటెక్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు వివరాలు:** బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్.
» **మొత్తం సీట్ల సంఖ్య:** 510.
» **విభాగాలు:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ.
» **అర్హత:** కనీసం 45శాతం మార్కులతో మ్యాథమేటిక్స్,ఫిజిక్స్,కెమిస్ట్రీతో 10+2 ఉత్తీర్ణులై ఉండాలి
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్, కౌన్సిలింగ్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **పరీక్ష విధానం:** మొత్తం 100 ప్రశ్నలు ఉంటాయి. మ్యాథ్స్(40 ప్రశ్నలు), ఫిజిక్స్(30 ప్రశ్నలు),కెమిస్ట్రీ(30 ప్రశ్నలు)సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు.ఇంగ్లిష్ మాధ్యమంలో పరీక్ష ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.03.2024
» **ఆలస్య రుసుము రూ.750తో ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.03.2024.
» **ఆలస్య రుసుము రూ.1250తో ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.03.2024.
» **హాల్‌టికెట్ డౌన్‌లోడ్ తేది:** 01.04.2024
» **ప్రవేశ పరీక్షతేది:** 07.04.2024.
» **ఫలితాల వెల్లడి తేది:** 10.04.2024.
» **వెబ్‌సైట్:** www.anucet.in

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్, సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్.. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సుల వివరాలు:** లైబ్రరీ ఆటోమేషన్ అండ్ నెట్‌వర్కింగ్‌లో డిప్లొమా; డిప్లొమా ఇన్ సైబర్ లాస్ అండ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్; డిప్లొమా ఇన్ కమ్యూనికేషన్ ఇంగ్లిష్; డిప్లొమా ఇన్ క్రిమినల్ జస్టిస్ అండ్ ఫోరెన్సిక్ సైన్స్; డిప్లొమా ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్; డిప్లొమా ఇన్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్; డిప్లొమా ఇన్ పంచాయతీరాజ్ గవర్నెన్స్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్; డిప్లొమా ఇన్ ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్; డిప్లొమా ఇన్ కమ్యూనిటీ ఐ హెల్త్; డిప్లొమా ఇన్ టెలికాం టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్.
» **కోర్సు వ్యవధి:** ఏడాది.
» **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.02.2024
» **వెబ్‌సైట్:** cdvl.uohyd.ac.in

ఓయూ దూరవిద్యలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ జి.రామ్ రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్.. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి దూరవిద్య విధానంలో(ఫేజ్-2) డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సుల వివరాలు:** ఎంబీఏ, ఎంసీఏ; ఎంఏ: హిందీ, ఉర్దూ, తెలుగు, సంస్కృతం, ఇంగ్లిష్, ఫిలాసఫీ, సోషియాలజీ, పబ్లిక్ పర్సనల్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ; ఎంఎస్సీ: మ్యాథ్స్, స్టాటిస్టిక్స్; ఎంకాం, బీఏ; బీకాం; బీబీఏ; అడ్వాన్స్‌డ్ డిప్లొమా: మ్యాథమేటిక్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్ అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ బయోఇన్ఫర్మేటిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, డేటా సైన్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్, వేదిక్ ఆస్ట్రాలజీ; అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా: వేదిక్ ఆస్ట్రాలజీ; సర్టిఫికెట్ కోర్సు: యోగా.
» **అర్హత:** కోర్సును అనుసరించి పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఫేజ్-2 అడ్మిషన్లకు చివరితేది:** 31.03.2024.
» **వెబ్‌సైట్:** www.oucde.net

టెట్‌కు సిద్ధమా

» ఏపీలో టెట్ నోటిఫికేషన్ విడుదల
» ఫిబ్రవరి 27 నుంచి మార్చి 9 వరకు పరీక్షలు
» డీఎస్సీ నియామకాల్లో టెట్‌కు 20 శాతం వెయిటేజీ
» మెథడాలజీ, పెడగాజీలే మంచి మార్కులకు కీలకం

టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్.. 'టెట్'గా సుపరిచితమైన పరీక్ష! బీఈడీ, డీఈడీ పూర్తి చేసి.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ కొలువులు సొంతం చేసుకోవాలనుకునే వారు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సిన పరీక్ష! టెట్‌లో పొందిన మార్కులకు డీఎస్సీ ద్వారా చేపట్టే టీచర్ నియామక ప్రక్రియలో 20 శాతం వెయిటేజీ లభిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా ఏపీ టెట్-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఏపీ టెట్ వివరాలు, పరీక్ష విధానం, పరీక్షలో రాణించేందుకు ప్రిపరేషన్ తదితర వివరాలు..

టెట్ ఉత్తీర్ణతతోనే.. డీఎస్సీకి అర్హత

ఎన్‌సీటీఈ, విద్యా శాఖ నిబంధనల ప్రకారం- టెట్‌లో ఉత్తీర్ణత సాధిస్తేనే.. డీఎస్సీకి అర్హత లభిస్తుంది. డీఎస్సీ నిర్వహణకు రంగం సిద్ధం చేసిన ఏపీ సర్కారు.. టెట్ నిర్వహణ సైతం చేపడుతోంది. దీనిద్వారా ఇప్పటి వరకు టెట్‌లో ఉత్తీర్ణత సాధించని వారికి మరో అవకాశం కల్పించినట్లయింది. అంతేకాకుండా టెట్ స్కోర్‌కు జీవిత కాల గుర్తింపు ఉంటుంది.

నాలుగు పేపర్లుగా టెట్

ఏపీ టెట్‌ను పేపర్-1ఎ, 1బి, పేపర్-2ఎ, 2బిల పేరుతో మొత్తం నాలుగు పేపర్లుగా నిర్వహించనున్నారు. బోధన తరగతుల వారీగా అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించాల్సిన విధంగా ఈ పేపర్లను వర్గీకరించారు. ఆ వివరాలు..

- **పేపర్-1ఎ:** ఒకటి నుంచి అయిదో తరగతి వరకు ఉపాధ్యాయులుగా బోధించాలనుకునే వారు హాజరవ్వాల్సిన పేపర్.
- **పేపర్-1బి:** ఒకటి నుంచి అయిదో తరగతి వరకు స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా బోధించాలనుకునే వారు హాజరవ్వాల్సిన పేపర్.
- **పేపర్-2ఎ:** ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు స్కూల్ అసిస్టెంట్‌గా బోధించాలనుకునే వారు ఉత్తీర్ణత సాధించాల్సిన పేపర్.
- **పేపర్-2బి:** ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్‌గా బోధించాలనుకునే వారు హాజరు కావల్సిన పరీక్ష.

అర్హతలు

ఆయా పేపర్‌ను బట్టి ఇంటర్మీడియెట్, బ్యాచిలర్స్ డిగ్రీ, పీజీతోపాటు డీఈడీ /బీఈడీ/లాంగ్వేజ్ పండిట్ లేదా తత్సమానం తదితర అర్హతలు ఉండాలి. సదరు అర్హత పరీక్షల్లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.

లాంగ్వేజ్ టీచర్ అర్హతలివే

ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు.. లాంగ్వేజ్ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారు సదరు లాంగ్వేజ్ ఆప్షనల్ సబ్జెక్ట్‌గా బ్యాచిలర్ డిగ్రీ లేదా బ్యాచిలర్ ఆఫ్ ఓరియెంటల్ లాంగ్వేజ్ ఉతీర్ణులవ్వాలి. లేదా.. సంబంధిత లాంగ్వేజ్‌లో పీజీ ఉత్తీర్ణతతోపాటు లాంగ్వేజ్ పండిట్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కోర్సు లేదా సదరు లాంగ్వేజ్ మెథడాలజీతో బీఈడీలో ఉత్తీర్ణత తప్పనిసరి.

టెట్ పేపర్లు-పరీక్ష విధానాలు

- **పేపర్-1ఎ, 1బి:**
పేపర్-1ఎ, పేపర్-1బిలను అయిదు విభాగాల్లో 150 మార్కులకు నిర్వహిస్తారు. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీ; లాంగ్వేజ్-1, లాంగ్వేజ్-2, మ్యాథమెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ సబ్జెక్ట్‌లు ఉంటాయి. ఒక్కో విభాగం నుంచి 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 150 ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. లాంగ్వేజ్-1 సబ్జెక్ట్ కింద తెలుగు, ఉర్దూ, హిందీ, బెంగాలీ, కన్నడ, మరాఠి, తమిళం, గుజరాతీ లాంగ్వేజ్‌లను ఎంచుకోవచ్చు.
- **పేపర్-2ఎ:**
ఈ పేపర్‌లో నాలుగు విభాగాలు ఉంటాయి. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీ 30 ప్రశ్నలు-30 మార్కులు; లాంగ్వేజ్-1, 30 ప్రశ్నలు-30 మార్కులు; లాంగ్వేజ్-2, ఇంగ్లిష్ 30 ప్రశ్నలు-30 మార్కులు; సంబంధిత సబ్జెక్ట్, 60 ప్రశ్నలు-60 మార్కులకు పరీక్ష ఉంటుంది. మొత్తం 150 ప్రశ్నలు-150 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. నాలుగో విభాగంగా నిర్వహించే సంబంధిత సబ్జెక్ట్ విషయంలో.. మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ టీచర్స్ అభ్యర్థులు మ్యాథ్స్ అండ్ సైన్స్ విభాగాన్ని; సోషల్ టీచర్లు సోషల్ స్టడీస్ విభాగాన్ని, లాంగ్వేజ్ టీచర్లు సంబంధిత లాంగ్వేజ్‌ను ఎంచుకుని పరీక్ష రాయాలి.
- **పేపర్-2బి:**
పేపర్-2బిని కూడా పేపర్-2ఎ మాదిరిగా నాలుగు విభాగాల్లో నిర్వహిస్తారు. మొదటి మూడు విభాగాలు పేపర్-2ఎ లోనివే ఉంటాయి. నాలుగో విభాగంగా మాత్రం.. డిజేబిలిటీ స్పెషలైజేషన్ సబ్జెక్ట్ అండ్ పెడగాజీ ఉంటుంది. ఈ విభాగంలో 60 మార్కులకు-60 ప్రశ్నలతో పరీక్ష నిర్వహిస్తారు. మొత్తం నాలుగు విభాగాలు కలిపి 150 ప్రశ్నలతో 150 మార్కులకు పరీక్ష ఉంటుంది. నాలుగో విభాగంలో అభ్యర్థులు తాము స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులో చదివిన సబ్జెక్ట్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. అన్ని పేపర్లు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. ప్రతి పేపర్‌కు 2:30 గంటల సమయం అందుబాటులో ఉంటుంది.



కనీస అర్హత మార్కుల నిబంధన

టెట్‌లో.. అన్ని పేపర్లకు సంబంధించి కనీస ఉత్తీర్ణత మార్కులు పొందాలి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం అరవై శాతం మార్కులతో, బీసీ కేటగిరీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగుల కేటగిరీలకు చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులు సాధించాలి.

ఏపీ టెట్-2024 ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, ఫిబ్రవరి 18
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్:** ఫిబ్రవరి 23 నుంచి
- **టెట్ తేదీలు:** 2024 ఫిబ్రవరి 27 - మార్చి 9
- **ఫలితాల వెల్లడి:** 2024, మార్చి 14
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://aptet.apcfss.in

మంచి మార్కులకు మార్గమిదే

చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి

ఈ విభాగంలో శిశువు మనస్తత్వం సంబంధిత అంశాలపై దృష్టి పెట్టాలి. వికాస దశలు, వికాస అంశాలైన శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలు మొదలైన అంశాలను క్షుణ్నంగా చదవాలి. శిశువు ప్రవర్తనలో మార్పునకు సంబంధించిన అభ్యాసం, అభ్యసన బదలాయింపు అంశాలను చదవాలి. ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం-నాయకత్వం-గైడెన్స్-కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి.

లాంగ్వేజ్-1,2

లాంగ్వేజ్-1లో అభ్యర్థులు తాము ఎంచుకున్న భాషలో.. అదే విధంగా లాంగ్వేజ్-2గా పేర్కొన్న ఇంగ్లిష్‌లో భాషా విభాగాలకు సంబంధించిన సాధారణ వ్యాకరణ అంశాలు, బోధన పద్ధతులపై ప్రశ్నలు ఉంటాయి. స్కూల్ స్థాయిలో తెలుగు సబ్జెక్ట్ పుస్తకాలతో పాటు తెలుగు బోధన పద్ధతులను చదవాలి. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఆర్టికల్స్, డైరెక్ట్ అండ్ ఇన్ డైరెక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపేరిజన్, వొకాబ్యులరీ .. ఇలా అన్ని అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.

మ్యాథమెటిక్స్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

పేపర్-1లో ఉండే ఈ సబ్జెక్టుల్లో ప్రాథమిక అంశాలపై ఒకటి నుంచి అయిదో తరగతి స్థాయి వరకు; పేపర్-2లో మ్యాథమెటిక్స్, సైన్స్‌పై ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నల క్లిష్టత ఇంటర్ స్థాయిలో ఉంటుంది. ఎన్విరాన్‌మెంటల్ పేపర్‌లో సైన్స్‌తోపాటు సమకాలీన అంశాలపైనా ప్రశ్నలు ఎదురవుతాయి. కాబట్టి అభ్యర్థులు ఏపీ ప్రాధాన్యం ఉన్న అంశాలను ప్రత్యేక దృష్టితో చదవడం లాభిస్తుంది.

సైన్స్

ఎనిమిదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలు ఔపోసన పట్టాలి. పేపర్-2 కోసం ప్రత్యేకంగా ఆరు నుంచి పదో తరగతి వరకు పుస్తకాలు చదవాలి. అదే విధంగా ఆయా అంశాల బేసిక్స్, అప్లికేషన్స్ వంటివి ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.

సోషల్ స్టడీస్

హైస్కూల్ స్థాయి పాఠ్య పుస్తకాలను చదవాలి. అదే విధంగా ఒక అంశానికి సంబంధించి అన్ని కోణాల్లోనూ అధ్యయనం చేయాలి. ఉదాహరణకు సివిక్స్‌కు సంబంధించి రాజ్యాంగంలోని ఆర్టికల్స్ మొదలు.. తాజా సవరణల వరకు సమన్వయంతో చదవాలి.

మెథడాలజీ

ఈ విభాగంలో ప్రధానంగా బోధనా పద్ధతులు; టీచర్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం); బోధన ఉద్దేశాలు, విలువలు, లక్ష్యాలను చదవాలి. పేపర్-1, పేపర్-2లో అడిగే అంశాలు ఒక్కటే అయినా.. వాటి క్లిష్టత స్థాయిలో తేడా ఉంటుంది. దీన్ని గుర్తించి ప్రిపరేషన్ కొనసాగించాలి.

సాక్షి
ప్రాఫిట్ ప్లస్
సోమవారం
12-2-2024

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
167	65
71,595	21,783

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	15,991	▲	197
డోజోన్స్	38,672	▼	55
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,573	▼	23
డాక్స్	16,927	▼	37
షాంఘై (బుధవారం ముగింపు)	2,866	▲	36
నికాయ్	36,897	▲	67

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో


			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.57	83.59
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.55	106.09
€	యూరో	ఎస్‌బీఐ	88.33	90.67
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.00	54.94
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	43.00	68.00
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.36	64.06
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.71	23.50
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.42	12.50

ఆర్థిక విజయానికి రామబాణం

రాముడి వనవాసం.. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేందుకు తగిన ప్రణాళిక అవసరాన్ని గుర్తు చేస్తుంది. వ్యక్తిగత ఆర్థిక జీవితానికి ఆలోచనాత్మక ఆర్థిక ప్రణాళిక ఎంతో అవసరమని నిపుణులు తరచూ సూచిస్తుంటారు. ఆర్థిక లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవడం, వాటికి తగిన బడ్జెట్ కేటాయించుకోవడం, వ్యూహాత్మకంగా పెట్టుబడులు పెట్టడం వల్ల జీవితంలో అనిశ్చితులు ఎదురైనా, వాటిని సులభంగా అధిగమించొచ్చు. ఎన్ని కష్టాలు ఎదురైనా రాముడు తన బాధ్యతలను ఏనాడూ విస్మరించలేదు. అందుకే ఊహించని పరిస్థితులు ఎదురైతే వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవడం ఎలా అన్నది రాముడి చేసి చూపించాడు. మనం కూడా ఆర్థిక ప్రణాళిక ఆధారంగా జీవితంలో ఎదురయ్యే సవాళ్లకు సన్నద్ధత ఏర్పాటు చేసుకోవాలి. జీవితానికి తగినంత బీమా కవరేజీ, ఆరోగ్య బీమా తీసుకోవాలి. అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి. జీవిత లక్ష్యాలు, అందుకు కావాల్సిన మొత్తం, చేయాల్సిన పెట్టుబడి, వివిధ సాధనాల మధ్య రిస్క్ ఆధారంగా కేటాయింపులు.. వీటన్నింటికీ ఆర్థిక ప్రణాళిక మార్గం చూపిస్తుంది.

- సవాళ్లను ఎదుర్కోవాల్సిందే
- రిస్క్ నిర్వహణ తెలియాలి
- పెట్టుబడుల్లో తగినంత వైవిధ్యం
- నిపుణుల మార్గదర్శకం అవసరం
- సన్మార్గంలోనే సంపద సృష్టి

కోట్లాది మంది దశాబ్దాల స్వప్నం సాకారమై, అయోధ్యలో బాలరాముడు కొలువు దీరాడు. రామాయణాన్ని గృహస్థ ధర్మానికి అద్భుతమైన నిదర్శనంగా పేర్కొంటారు. శ్రీరాముడి జీవన మార్గాన్ని పరిశీలించి చూస్తే వ్యక్తిగత ఆర్థిక విషయాల్లో ఎలా నడుచుకోవాలనే విషయమై విలువైన పాఠాలు కనిపిస్తాయి. శ్రీరాముడిని విశ్వసించే ప్రతి ఒక్కరూ, తమ ఆర్థిక విజయానికి కావాల్సిన సూత్రాలను రామాయణం నుంచి తీసుకోవచ్చు.



హద్దులకు కట్టుబడి ఉండడం

సంపద సృష్టి కోరుకునే వారు అందుకు అడ్డదారులు (షార్ట్‌కట్స్) వెతుక్కోకూడదు. లంకాధిపతి రావణుడు సీతమ్మ వారిని కోరుకోవడం వల్ల ఎంతటి ఉపద్రవం జరిగిందో రామాయణం చెబుతోంది. కోరికలపై నియంత్రణ అవసరమని, సన్మార్గమే శ్రేష్టమని ఇది సందేశం ఇస్తుంది. పెట్టుబడులపై రాబడుల విషయంలోనూ కోరికలను అదుపులో పెట్టుకుని వ్యవహరించాలి. తమకంటూ ఆర్థిక సరిహద్దులు ఏర్పాటు చేసుకోవాలి. ఉద్రేకంతో కూడిన నిర్ణయాలకు చోటు ఇవ్వకూడదు. టిప్స్‌ను అనుసరించడం కాకుండా కాల పరీక్షకు నిలిచిన బలమైన పెట్టుబడుల వ్యూహాలను అనుసరించాలి. దీనివల్ల విజయం తేలిక అవుతుంది.

ఓపిక, క్రమశిక్షణ

సముద్రంలో రామసేతు వారధి నిర్మాణం ఎంతో ఓపిక, పట్టుదలతో, ఎంతో మంది కృషితో, సుదీర్ఘ కాలానికి కానీ సాధ్యం కాలేదు. సంపద సృష్టి కూడా అంతే. స్వల్ప కాలంలో కుబేరులు కావడం అనేది ఆచరణలో అంత సులభం కాదు. క్రమశిక్షణతో దీర్ఘకాలం పాటు పెట్టుబడులు కొనసాగించడం ద్వారానే ఇది సాధ్యపడుతుంది. సిప్ అవసరాన్ని ఇక్కడ గుర్తించాలి. సిప్ రూపంలో ప్రతి నెలా ఇన్వెస్ట్ చేస్తూ వెళితే, చిన్న మొత్తమే దీర్ఘకాలంలో పెద్ద మొత్తంగా మారుతుంది. దీర్ఘకాలంలో సంపద సృష్టిని సిప్ సులభతరం చేస్తుంది. స్థిరత్వం, సహనం అనేవి దీర్ఘకాల ప్రయాణానికి ఎంతో అవసరం. లక్ష్మణుడి కోసం ఆంజనేయుడు సంజీవని కోసం వెళ్లడం, దాన్ని గుర్తించలేక తన చేత్తో మొత్తం సుమేరు పర్వతాన్ని పెకిలించి చేత్తో తీసుకురావడం తెలిసిందే. ప్రతీ ఇన్వెస్టర్ సంజీవని వంటి కంపెనీలను గుర్తించలేకపోవచ్చు. అలాంటప్పుడు వారి ముందున్న మార్గం మ్యూచువల్ ఫండ్స్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్. ఇన్వెస్టర్లు ఒక్కో కంపెనీ వారీ రిస్క్‌ను తగ్గించుకునేందుకు మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. సూచీల్లో ఇన్వెస్ట్ చేసే ప్యాసివ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం వల్ల.. అందులోని కొన్ని స్టాక్స్ బలహీన పనితీరు చూపించినా కానీ, మిగిలిన వాటి అండతో దీర్ఘకాలంలో మంచి రాబడులు సొంతం చేసుకోవచ్చు.

ధర్మ మార్గం

ధర్మం పట్ల రాముడి అచంచలమైన నిబద్ధత ఆయన జీవన గమనానికి మూలస్తంభంగా కనిపిస్తుంది. వ్యక్తిగత ఆర్థిక జీవితంలో నైతిక ఆర్థిక విధానాల ఆచరణ అవసరాన్ని ఇది తెలియజేస్తుంది. ఇదే దీర్ఘకాలంలో విజయానికి బాటలు పరుస్తుంది. నిజాయితీ, చిత్తశుద్ధి, ఆర్థిక నిర్ణయాల్లో పారదర్శకత, క్రమశిక్షణ, భావోద్వేగాల నియంత్రణ, వేగంగా ధనవంతులు కావచ్చనే ప్రచారానికి ఆకర్షితులు కాకపోవడం వంటివి ఆర్థిక విజయాలకు భరోసానిస్తుంది. ఆర్థిక విషయాల్లో ధర్మానికి కట్టుబడి ఉండడం వల్ల అది స్థిరమైన, నైతిక సంపద సృష్టికి దారితీస్తుంది.

రిస్క్ నిర్వహణ

రావణుడితో రాముడు సాగించిన యుద్ధం.. ధైర్యం, రిస్క్ నిర్వహణ ప్రాధాన్యతను తెలియజేస్తుంది. వ్యక్తిగత ఆర్థిక విషయాల్లోనూ వీటి అవసరం ఎంతో ఉంది. సంపద సృష్టికి, ఆర్థిక లక్ష్యాల సాధనకు ధైర్యంగా, తమకు సరిపడే రిస్కులను తీసుకోవాల్సిందే. రిస్కులను మదించే విషయమై, అనిశ్చితులను అధిగమించేందుకు అవసరమైతే నిపుణుల సాయం తీసుకోవడాన్ని మర్చిపోవద్దు.



ధర్మం కోసం రాముడు యుద్ధం చేయక తప్పలేదు. అలాగే, సంపద సృష్టి కోరుకునే వారు కూడా రిస్క్‌తో కలసి నడవాల్సిందే. అది కూడా తాము భరించే స్థాయిలోనే రిస్క్‌ను పరిమితం చేసుకోవాలి. పెట్టుబడికి సైతం ముప్పు ఉంటుందని ఈక్విటీలకు దూరంగా ఉండడం సరికాదు. రాబడులకు, పెట్టుబడి రక్షణకూ ప్రాధాన్యం ఇవ్వాలి. ఏ ఒక్కదాని దృష్టితోనో పరుగులు తీయకూడదు.



సరళతరం

వనవాస సమయంలో రాముడి నిరాడంబర, సాధారణ జీవన శైలి.. పొదుపు ధర్మాన్ని తెలియజేస్తుంది. వ్యక్తిగత ఆర్థిక జీవితంలోనూ పొదుపుతో కూడిన జీవనశైలిని అనుసరించడం, అనవసర దుబారాని నియంత్రించడం ఆర్థిక శ్రేయస్సుకు దారి చూపుతుంది. నేడు ప్రతి ఒక్క అవసరానికీ సులభంగా రుణాలు లభిస్తున్నాయి. అవసరాలు, కోరికల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించాలి. అవసరాలకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి. రుణాలతో కోరికలు తీర్చుకోవడం ఆర్థిక శ్రేయస్సుకు మేలు చేయదు. పొదుపు మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలి. తెలివిగా ఖర్చు చేస్తూ, పొదుపు, పెట్టుబడులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా ఆర్థిక క్రమశిక్షణ ఎంతో ముఖ్యం. క్రెడిట్ కార్డ్ రుణాల నుంచి త్వరగా బయటకు రావాలి. అధిక ఖర్చుకు కళ్లెం వేయాలి. సరైన అవకాశాలు, అనుకూల సమయం కోసం వేచి చూస్తూ ఈక్విటీ మార్కెట్లో వచ్చే విలువైన అవకాశాలను కోల్పోవద్దు. సహనం, పట్టుదల కష్టపడి సంపాదించిన ధనానికి రక్షణగా నిలవాలి.

మార్గదర్శకం

రాముడి విధేయత, తన అనుచరులతో ఉన్న బలమైన బంధం గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పెట్టుబడుల విషయంలోనూ సత్సంబంధాలు ఎంతో అవసరం. పరస్పర గౌరవం, నమ్మకం, మద్దతు అనేవి ఆర్థిక సవాళ్లను అధిగమించేందుకు సాయపడతాయి. అవసరం మేరకు ఆర్థిక నిపుణుల సాయాన్ని, మద్దతును, మార్గదర్శకాన్ని తీసుకోవాలి. ఇన్వెస్టర్ రిస్క్‌ను మదింపు వేసి, అనుకూలమైన పెట్టుబడి సాధనాలు, ఆర్థిక లక్ష్యాల సాధనకు ఆచరించాల్సి మార్గాన్ని వారు సూచిస్తారు. ఆర్థిక ప్రపంచంలో ఉండే సంక్లిష్టతలను అధిగమించేందుకు సాయపడతారు.



వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియో

రాముడి సైన్యంలో కనిపించే వైవిధ్యాన్ని, తమ పెట్టుబడులకూ అన్వయించుకోవాలి. వానరాలు, ఎలుగుబంట్లు, ఉడతలు, గద్దలు ఇవన్నీ రామదండులో కనిపిస్తాయి. ఇదే మాదిరిగా పెట్టుబడుల్లోనూ వైవిధ్యం ఉండాలి. కేవలం పొదుపు, ఫిక్స్‌డ్ డిపాజిట్లకే (ఎఫ్‌డీలు) పరిమితం కాకూడదు. అన్ని ముఖ్య సాధనాల్లోకీ పెట్టుబడులు వర్గీకరించుకోవాలి.



దీనివల్ల రిస్క్‌ను తగ్గించుకోవచ్చు. రాబడులు స్థిరంగా ఉండేలా చూసుకోవచ్చు. దీన్నే అస్సెట్ అలోకేషన్ అని చెబుతారు. ఈక్విటీలు, డెట్, గోల్డ్, ఏఐఎఫ్‌లకు పెట్టుబడులు కేటాయించుకోవచ్చు.

నేనే సుపీరియర్ అనుకోవద్దు..!

పెట్టుబడుల విషయంలో అంతా తనకే తెలుసన్న అహంకారం అస్సలు పనికిరాదు. రావణుడి పతనానికి ఇదే దారితీసింది. మెరుగైన పనితీరు చూపించని సాధనాల విషయంలో అహంకారం విడిచి పెట్టి ఆలోచించాలి. నిర్ణీత కాలానికోసారి సమీక్షించుకుని పెట్టుబడుల్లో మార్పులు చేసుకోవాలి. అలా కాకుండా ఇన్వెస్ట్ చేసి పని అయిపోందని అనుకోవడం ఆర్థిక విజయాలకు దారితీయదు. సంపద సృష్టికి, పెట్టుబడుల మార్గంలో తప్పొప్పులను అంగీకరించాలి. దీనివల్ల నష్టాలను పరిమితం చేసుకునేందుకు వీలుంటుంది.



మారుతున్న పరిస్థితులను ఆహ్వానించడం ఆర్థిక శ్రేయస్సుకు అవసరం. శ్రీరాముడి జీవితంలో పొందుపరిచిన జ్ఞానం కేవలం ఆధ్యాత్మికతకు పరిమితం కాదు. ఒక వ్యక్తి జీవితంలో ఎదురయ్యే పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో తెలియచెపుతుంది. ఇన్వెస్టర్లకు విలువైన అంశాలను తెలియజేస్తుంది. రామాయణాన్ని చదవడం, అందులోని ముఖ్యమైన అంశాలను గ్రహించి, వాటిని తమ పెట్టుబడులకు అన్వయించుకోవడం వల్ల ఆర్థిక విజయాలకు మార్గాన్ని సులభం చేసుకోవచ్చు. చెడుపై మంచి విజయం సాధించడం రామాయణంలో కనిపిస్తుంది. అదే మాదిరిగా ఇన్వెస్టర్లు ఆర్థిక అవరోధాలను అధిగమించి, మంచి ఆర్థిక అలవాట్లతో, క్రమశిక్షణతో మెలగడం ద్వారా సంపద సృష్టికి చేరువకావచ్చు.

ఫండ్ స్ట్రీట్

హెచ్ఎస్‌బీసీ మల్టీ అస్సెట్ అలోకేషన్ ఫండ్



హెచ్ఎస్‌బీసీ మ్యూచువల్ ఫండ్ మల్టీ అస్సెట్ అలోకేషన్‌తో కూడిన నూతన పథకాన్ని ప్రారంభించింది. ఈ నెల 22వ తేదీ వరకు ఈ నూతన పథకం (ఎన్ఎఫ్‌వో) పెట్టుబడులకు అందుబాటులో ఉంటుంది. ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సాధనాలు, డెట్, మనీ మార్కెట్ సెక్యూరిటీలు, గోల్డ్/సిల్వర్ ఈటీఎఫ్‌లలో ఈ పథకం పెట్టుబడులు పెడుతుంది. అస్థిరతలు తగ్గించడం, వైవిధ్యం, దీర్ఘకాలంలో పెట్టుబడుల వృద్ధి లక్ష్యంగా ఈ పథకం పనిచేస్తుంటుంది. దీని వల్ల ఒకే పథకం ద్వారా ఒకటికి మించిన సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

యాక్సిస్ సెన్సెక్స్ ఇండెక్స్ ఫండ్




యాక్సిస్ మ్యూచువల్ ఫండ్ 'యాక్సిస్ సెన్సెక్స్ ఇండెక్స్ ఫండ్' పేరుతో నూతన పథకాన్ని (ఎన్ఎఫ్‌వో) ఈ నెల 8న ప్రారంభించింది. ఈ నెల 22 వరకు పెట్టుబడులు స్వీకరించనుంది. ఈ కాలంలో రూ.100 కోట్లను ఇన్వెస్టర్ల నుంచి సమీకరించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నట్టు సంస్థ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ ఆశిష్ గుప్తా తెలిపారు. భిన్న రంగాలు, పెద్ద కంపెనీలతో కూడిన సెన్సెక్స్‌లో పెట్టుబడులు ఇన్వెస్టర్లకు వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియోతోపాటు వృద్ధి అవకాశాలకు వీలు కల్పిస్తుందని ఫండ్ ఎండీ, సీఈవో బి.గోపకుమార్ ప్రకటించారు.

బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ లార్జ్, మిడ్ క్యాప్ ఫండ్



బజాజ్ ఫిన్‌సర్వ్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థ కొత్తగా లార్జ్ అండ్ మిడ్ క్యాప్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఫిబ్రవరి 20తో ముగుస్తుంది. ఇతర సంస్థలతో పోటీపడగలిగే, నిలబడగలిగే సామర్థ్యాల ప్రాతిపదికన ఇది వివిధ సంస్థల్లో ఇన్వెస్ట్ చేస్తుందని ఫండ్ వర్గాలు పేర్కొన్నాయి. వేగవంతమైన వృద్ధి, లాభదాయకత, గణనీయంగా పోటీతత్వం ప్రదర్శించగలిగే అవకాశమున్న వ్యాపారాలను గుర్తించేందుకు ఈ వ్యూహం ఉపయోగపడగలదని బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ సీఈవో గణేష్ మోహన్ తెలిపారు.

పెట్టుబడికి బదులు బంగారం తీసుకోవచ్చా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్

ఎన్‌పీఎస్ టైర్1 ఖాతాదారులకు అదనంగా రూ.50,000 పెట్టుబడి మొత్తంపై పన్ను ఆదా ఉందని తెలిసింది. నూతన పన్ను విధానంలోనూ దీన్ని వినియోగించుకోవచ్చా? – జయంతి రామన్

నూతన పన్ను విధానం కింద, ఎన్‌పీఎస్ టైర్1 ఖాతాలో ఇన్వెస్ట్ చేస్తున్నట్టు అయితే, మీరు అదనంగా రూ.50,000 మొత్తంపై పన్ను ఆదా చేసుకునేందుకు అవకాశం లేదు. పాత పన్ను విధానంలో ఉన్న వారే రూ.50,000 మొత్తంపై అదనపు పన్ను ప్రయోజనాన్ని క్లెయిమ్ చేసుకోగలరు. కాకపోతే మీరు పనిచేసే సంస్థలో మీ తరఫున యాజమాన్యం ఎన్‌పీఎస్ ఖాతాకు జమ చేస్తున్నట్టు అయితే అప్పుడు అదనపు క్లెయిమ్‌కు అవకాశం ఉంది. మీ మూల వేతనం, డీఏలో గరిష్ఠంగా 10% మేర పన్ను మినహాయింపును పొందొచ్చు. ఒకవేళ మీరు ప్రభుత్వ ఉద్యోగి అయితే మూలవేతనం, డీఏలో 14% పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు.

నా వద్ద 2016–17 సంవత్సరానికి సంబంధించి 20 యూనిట్ల సావరీన్ గోల్డ్ బాండ్లు (ఎస్‌జీబీలు) ఉన్నాయి. 2024 నవంబర్ 17తో వీటి గడువు ముగిసిపోతుంది. నగదు బదులు 20 గ్రాముల బంగారం తీసుకోవచ్చా? – వసంత పరిమి

సావరీన్ గోల్డ్ బాండ్లలో పెట్టుబడుల కాల వ్యవధి ముగిసిన సమయంలో భౌతిక బంగారాన్ని క్లెయిమ్ చేసుకునేందుకు అవకాశం లేదు. భౌతిక బంగారాన్ని కలిగి ఉండడానికి ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన సాధనం ఎస్‌జీబీ. ఎస్‌జీబీ కాల వ్యవధి ఎనిమిదేళ్లు. ఐదేళ్ల పాటు పెట్టుబడులకు లాకిన్ ఉంటుంది. ఐదేళ్లు ముగిసిన తర్వాత ఉపసంహరించుకునేందుకు అవకాశం ఉంది. లాభంపై పన్ను మినహాయింపు కోరుకునే వారు ఎనిమిదేళ్ల పాటు కొనసాగించాల్సి ఉంటుంది. మెచ్యూరిటీ ముగిసే తేదీకి మూడు రోజుల ముందు 24 క్యారట్ల బంగారం సగటు ధర ఆధారంగా చెల్లింపులు చేస్తారు. ఇన్వెస్టర్ ఎస్‌జీబీ కొనుగోలు సమయంలో ఇచ్చిన బ్యాంక్ ఖాతాతోనే గడువు అనంతరం మెచ్యూరిటీ మొత్తం జమ అవుతుంది.

పన్ను ఆదా ప్రయోజనంతో కూడిన ఈఎల్ఎస్ఎస్ పథకంలో నాకు పెట్టుబడులు ఉన్నాయి. వీటిని అదే అస్సెట్ మేనేజ్‌మెంట్ నిర్వహించే పన్ను ఆదా ప్రయోజం లేని ఇతర ఈక్విటీ పథకంలోకి మార్చుకోవచ్చా? – రవి గుప్తా

ఇందుకు అవకాశం లేదు. ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్) పెట్టుబడులకు మూడేళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. కనుక ఈ మూడేళ్ల లాకిన్ పూర్తయిన తర్వాతే సదరు ఈఎల్ఎస్ఎస్ ఫండ్‌లోని పెట్టుబడులను ఇతర పథకంలోకి మార్చుకునేందుకు వీలుంటుంది. ఒక పథకం నుంచి మరో పథకంలోకి పెట్టుబడులు మళ్లించుకోవడాన్ని స్విచింగ్‌గా పిలుస్తారు. అన్ని మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు దీన్ని ఆఫర్ చేస్తున్నాయి. అదే ఏఎంసీకి చెందిన రెండు పథకాల మధ్య పెట్టుబడులను స్విచింగ్ చేసుకోవచ్చు. బ్యాంక్ ఖాతాలోకి పంపించుకుని, ఇన్వెస్ట్ చేయాల్సిన అవసరం ఇక్కడ ఏర్పడదు. ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్ గడువులోపు (మూడేళ్లు) స్విచింగ్‌ను అనుమతించడం లేదు. ఒకవేళ ఇన్వెస్టర్ మరణించిన సందర్భంలో.. సంబంధిత పెట్టుబడికి కనీసం ఏడాది ముగిసిన తర్వాతే నామినీ ఉపసంహరించుకోవడానికి అనుమతి ఉంటుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/100కు రూ.లలో)

12-2-2024	
విశాఖ	555–00
చిత్తూరు	583–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	530–00
విజయవాడ	530–00
రిటైల్ ధర (డజను)	72.00
11-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	545–00
వరంగల్	547–00
రిటైల్ ధర	6.05

జోస్ ఆలుక్కాస్ 'ఓరిస్' వజ్రాభరణ కలెక్షన్



హైదరాబాద్: ఆభరణాల విక్రయ సంస్థ జోస్ ఆలుక్కాస్ 'ఓరిస్' పేరుతో కొత్త వజ్రాభరణాల కలెక్షన్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. తేలికపాటి, సొగసైన ఈ కొత్త కలెక్షన్‌ను మోడల్ రాఫెట్ సిక్వేరా ఆవిష్కరించారు. మహిళలు రోజువారీగా ధరించడం కోసం కచ్చితత్వంతో తీర్చిదిద్దిన ఈ అధునాతన కలెక్షన్‌లో ఒక క్యారెట్ బరువున్న స్టడ్స్ కలిగిన పెండెంట్స్ ఉన్నాయి. "నేటి మహిళల కోసం ప్రత్యేకంగా తీర్చిద్దిన బ్రాండ్ 'ఓరిస్'. అందరికీ అందుబాటు ధరల్లో వజ్రాభరణాలు అందించడానికి జోస్ ఆలుక్కాస్ అంకితమైంది" అని చైర్మన్ జోస్ ఆలుక్కాస్ తెలిపారు.

ఓఎన్‌జీసీ లాభం 14 శాతం డౌన్..



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ. 9,536 కోట్ల లాభం (స్టాండెలోన్) ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో నమోదైన రూ. 11,045 కోట్లతో పోలిస్తే ఇది దాదాపు 14 శాతం తక్కువ. సమీక్షాకాలంలో చమురు, గ్యాస్ ధరలు తగ్గడమే.. లాభాల క్షీణతకు కారణమని సంస్థ తెలిపింది. క్యూ3లో క్రూడాయిల్ ఉత్పత్తి 3.3 శాతం తగ్గి 5.2 మిలియన్ టన్నులకు పరిమితం కాగా, గ్యాస్ ఉత్పత్తి 4.3 శాతం క్షీణించి 5.12 బిలియన్ ఘనపు మీటర్లుగా నమోదైంది. క్యూ3లో స్థూల ఆదాయం 10 శాతం తగ్గి రూ. 34,789 కోట్లుగా నమోదైంది. సమీక్షాకాలానికి షేరు ఒక్కింటికి రూ. 4 చొప్పున కంపెనీ రెండో మధ్యంతర డివిడెండు ప్రకటించింది. ఇందుకోసం సుమారు రూ. 5,032 కోట్లు అవుతుందని తెలిపింది.

స్టాక్ వ్యూ

అశోకా బిల్డ్‌కాన్	ఐడీబీఐ క్యాపిటల్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 175 టార్గెట్: రూ. 206

ఎందుకంటే: మౌలిక సదుపాయాల రంగ కంపెనీ అశోక్ బిల్డ్‌కాన్ యాజమాన్యం.. భవిష్యత్ అవకాశాలపై ఇటీవల సమావేశాన్ని నిర్వహించింది. దీనిలో భాగంగా కంపెనీ ఎంవోపీఏ ఎయిర్‌పోర్ట్ లింక్ రోడ్(ఏఎల్ఆర్) ప్రాజెక్టును సందర్శించాం. ఏఎల్ఆర్ ప్రాజెక్టు సుమారు 82 శాతం పూర్తయ్యింది. ఈ ఏడాది(2024) మార్చికల్లా ప్రాజెక్టు ప్రారంభంకావచ్చని అంచనా. నిజానికి ప్రభుత్వ(ఎంవోఆర్‌టీహెచ్) మార్గదర్శకాల ప్రకారం 2024 ఆగస్ట్ కల్లా పూర్తికావలసి ఉంది. కంపెనీ ఆస్తుల మానిటైజేషన్ ప్రక్రియలో భాగంగా చేపట్టిన 9 హైబ్రిడ్ యాన్యుటీ మోడ్(హెచ్ఏఎం) ప్రాజెక్టులు పూర్తయ్యే పురోగతిలో ఉన్నాయి. ఈ మార్చికల్లా వాటా కొనుగోలు ఒప్పందం(ఎస్‌పీఏ) స్థాయికి చేరే అవకాశముంది. అయితే బీవోటీ పద్ధతిలోని ప్రాజెక్టు(చెన్నై ఓఆర్ఆర్, నయాగావ్)కు ఎన్‌వోసీ అనుమతులు లభించవలసి ఉంది. దీంతో ఈ బీవోటీ ఆస్తుల మానిటైజేషన్ వచ్చే ఆర్థిక సంవత్సరానికి(2024-25) వాయిదాపడవచ్చని అంచనా. అసెట్ మానిటైజేషన్ పూర్తయితే కన్సాలిడేటెడ్ రుణభారం రూ. 7,200 కోట్లమేర తగ్గే వీలుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) తొలి అర్ధభాగం(ఏప్రిల్–సెప్టెంబర్)లో నిర్వహణలాభ(ఇబిటా) మార్జిన్లు నిలకడను సాధించడం, ఈ ఏడాది ఆదాయానికి రెండు రెట్లు అధికంగా రూ. 14,800 కోట్ల విలువైన ఆర్డర్‌బుక్ సానుకూల అంశాలుగా పేర్కొనవచ్చు. వీటికితోడు ప్రస్తుతం 7 శాతం వాటాను ఆక్రమిస్తున్న అంతర్జాతీయ ఈపీసీ ప్రాజెక్టులు మరింత పెరిగే వీలుంది. ప్రభుత్వం రోడ్ ప్రాజెక్టులను హెచ్ఏఎం/ఈపీసీ విధానాలను వీడి బీవోటీలో కేటాయించనుంది. కంపెనీ మరిన్ని కొత్త ప్రాజెక్టులకు బిడ్డింగ్ చేయనుంది.



టార్క్	యూఎల్‌జేకే రీసెర్చ్	కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 165 టార్గెట్: రూ. 225

ఎందుకంటే: గతంలో అనంత్‌రాజ్ గ్లోబల్ లిమిటెడ్‌గా కార్యకలాపాలు సాగించిన రియల్టీ రంగ కంపెనీ టార్క్.. ప్రధానంగా ఢిల్లీలో విలాసవంత హౌసింగ్ ప్రాజెక్టులపై దృష్టిపెట్టి పనిచేస్తోంది. బహుళ అంతస్తుల(హైరైజ్) బిల్డింగుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోంది. నిర్మాణ రంగ కంపెనీగా ప్రారంభమైన సంస్థ రియల్ఎస్టేట్ అభివృద్ధిలోకి మార్పు చెందింది. దీనిలో భాగంగా న్యూఢిల్లీ, గురుగ్రామ్, మనేసర్, గ్రేటర్ నోయిడాలలో పూర్తిగా సొంతమైన 500 ఎకరాల భూమిని కలిగి ఉంది. ప్రస్తుతం త్రిపుండ్ర, కైలాస, ఇష్వా పేరుతో మూడు ప్రాజెక్టుల నిర్మాణాలను చేపట్టింది. అంతే కాకుండా మరోవైపు ఢిల్లీ, గురుగ్రామ్‌లలో అదనపు ప్రాజెక్టుల అభివృద్ధికీ ప్రణాళికలు వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం(2024-25)లో ఈ ప్రాజెక్టుల అమ్మకాలను ప్రారంభించాలని యోచిస్తోంది. వెరసి వచ్చే ఏడాది నుంచి ఈ వెంచర్ల ద్వారా రూ. 7,500 కోట్లమేర ఆదాయం సమకూరవచ్చని కంపెనీ అంచనా వేస్తోంది. 2022లో పీఈ సంస్థ బెయిన్ క్యాపిటల్ మార్పిడిరహిత డిబెంచర్ల(ఎన్‌సీడీలు) ద్వారా రూ. 1,330 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. ఫలితంగా అన్నిరకాల ఆర్థిక బకాయిల చెల్లింపులనూ పూర్తి చేసేందుకు టార్క్‌కు వీలు చిక్కింది. అంతేకాకుండా నిర్మాణం చేపట్టిన ప్రాజెక్టులను కొనసాగించేందుకు పెట్టుబడులు లభించాయి. కాగా.. ఈ ఎన్‌సీడీలను చెల్లించేందుకు అంతర్గత వనరులను వినియోగించాలని కంపెనీ ప్రణాళికలు వేసింది. ఈ నేపథ్యంలో కంపెనీ పటిష్ట అమ్మకాలు సాధించే వీలుండటం, ప్రస్తుతం చేపట్టిన మూడు ప్రాజెక్టుల నిర్మాణాలు సక్రమంగా కొనసాగుతుండటం, రానున్న కాలంలో మరో మూడు ప్రాజెక్టుల విడుదలకు సన్నాహాలు వంటి అంశాలు సానుకూలంగా కనిపిస్తున్నాయి.




గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే



భిక్షాటన చేస్తూ బిడ్డను చదివిస్తూ..

అవిటితనం శరీరానికేగానీ, ఆలోచనకు కాదని నిరూపించారు ఈ దివ్యాంగ దంపతులు. భిక్షాటన చేస్తూ జీవనం గడుపుతున్న ఈ దంపతులు కూతురిని తమ వెంట తిప్పుకోకుండా పాఠశాలకు పంపుతున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని గొల్లగూడకు చెందిన చిన్న ఆదిలింగయ్య సుతారి మేస్త్రీ పనిచేస్తూ డ్రైనేజీ కాలువలో పడటంతో కాళ్లు విరిగాయి. ఆయన భార్య రామ్మమ్మ మానసిక దివ్యాంగురాలు. వీరి కూతురు దైరేశ్వరి స్థానిక గాంధీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. శనివారం సాయంత్రం దైరేశ్వరి పాఠశాల నుంచి వచ్చి కనకదుర్గ దేవాలయం వద్ద భిక్షాటన చేస్తున్న తల్లిదండ్రుల చెంత హోంవర్క్ చేస్తూ కనిపించింది.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



హలో ఫ్రెండ్..

ఏదో చిన్నప్పటి ఫ్రెండ్‌ను చూసినట్లు తూనీగ వాలగానే ఈ తాబేలు మొహంలో ఆనందం చూడండి.. ఇజ్రాయెల్‌లోని జెజ్రీల్ లోయలో జాహీ ఫింకెల్‌స్టీన్ అనే ఫొటోగ్రాఫర్ ఈ చిత్రాన్ని తీశారు. వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పీపుల్స్ చాయిస్ అవార్డును ఇటీవలే ప్రకటించారు. అందులో దీనికి ప్రత్యేక పురస్కారం దక్కింది.



నేనొచ్చేశా...

పెళ్లి ఫొటోలు ఎంతో అపురూపం. అలాంటివాటికి కూడా ఒక అంతర్జాతీయ పోటీ ఉంది. అదే.. ఇంటర్నేషనల్ వెడ్డింగ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పురస్కారం. ఈసారి ప్రపంచవ్యాప్తంగా 300 మంది వెడ్డింగ్ ఫొటోగ్రాఫర్ల నుంచి 1700 ఎంట్రీలు రాగా.. ఈ చిత్రం విజేతగా నిలిచింది. చూశారా.. ఓవైపు వరుడు పెళ్లి ప్రమాణాలు చదువుతుండగా.. అవేమీ పట్టనట్లు.. ఎక్కడి నుంచి వచ్చిందో ఓ పక్షి వచ్చి.. నేరుగా వధువు నెత్తిన వాలింది.. తర్వాత ఏం జరిగిందో మనకు తెలియదు గానీ.. ఈ చిత్రం మాత్రం కెనడా ఫొటోగ్రాఫర్ తారా లిల్లీకి వెడ్డింగ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పురస్కారాన్ని తెచ్చిపెట్టింది.

స్వర్ణ ఉలితో మలిచిన శ్రీరామ నేత్రాలు...



అయోధ్యలో ప్రతిష్ఠించిన బాల రాముని నేత్రాలను మలిచింది సాధారణ ఇనుప ఉలి, సుత్తితో కాదని దీనికి తాను వెండి సుత్తి, బంగారపు ఉలిని వాడానని మైసూరుకు చెందిన శిల్పి అరుణ్ యోగిరాజ్ తెలిపారు. ఈ మేరకు ఆయన తన ఇన్‌స్టాగ్రాం, ఎక్స్ ఖాతాల్లో ఆదివారం సంబంధిత ఫొటోలను షేర్ చేశారు.

- మైసూరు

ఈ–కామర్స్ టు సోషల్ కామర్స్!

ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, బిగ్‌బాస్కెట్ వంటి ఆన్‌లైన్ మార్కెట్ల నుంచి తరచూ మనకు అవసరమైన వస్తువులేవో కొంటుండటం కామనే. దీన్నే ఈ–కామర్స్ అంటారు. కానీ కొంతకాలం నుంచి 'సోషల్ కామర్స్' కొనుగోళ్లు పెరుగుతున్నాయి. అంటే ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, టిక్‌టాక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు వేదికగా జరుగుతున్న ఆన్‌లైన్ కొనుగోళ్లు అన్నమాట. ఇదీ ఈ–కామర్స్‌లో భాగమే అయినా.. నెటిజన్లు రెగ్యులర్ ఆన్‌లైన్ మార్కెట్ల నుంచి, మెల్లగా సోషల్ కామర్స్ వైపు మళ్లుతున్నారని స్టాటిస్టా మార్కెట్ ఇన్‌సైట్స్ అధ్యయనంలో తేలింది. 2018తో పోలిస్తే.. సోషల్ కామర్స్ పుంజుకుందని, 2028కి మరింత ఆదరణ పెరుగుతుందని వెల్లడైంది.



15 నుంచి శ్రీశారదాపీఠం వార్షికోత్సవాలు

పెందుర్తి (విశాఖ జిల్లా): విశాఖ శ్రీశారదాపీఠం వార్షిక మహోత్సవాలు ఈ నెల 15 నుంచి 19 వరకు ఐదు రోజుల పాటు జరుగనున్నాయి. ఉత్సవాల్లో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ రాజశ్యామల యాగం నిర్వహించనున్నారు. 16న శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి కల్యాణం, 17న టీటీడీ ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం, 18న వల్లీ కల్యాణం జరుగనున్నాయి.

ప్రేమికులూ జరభద్రం!

వాలెంటైన్స్ డే పేరిట సైబర్ మోసాలు

సర్‌ప్రైజ్ గిఫ్ట్‌లంటూ బురిడీ కొట్టిస్తున్న కేటుగాళ్లు

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు ఇప్పుడు ప్రేమికులపై ఫోకస్ పెట్టారు. వాలెంటైన్స్ డే దగ్గర పడుతుండడంతో డిస్కౌంట్‌లు, ఆఫర్లు, సర్‌ప్రైజ్ గిఫ్ట్ లు, గిఫ్ట్ కూపన్లు అంటూ సరికొత్త మోసాలకు తెరతీస్తున్నారు. ఏటా ఈ తరహా మోసాలు షరామామూలే అయినా.. ఎప్పటికప్పుడు సైబర్ నేరగాళ్ల బారిన పడే బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉందని సైబర్ భద్రత నిపుణులు పేర్కొంటున్నారు. సైబర్ నేరగాళ్లు కొత్త తరహాలో మోసాలకు తెరతీస్తున్నారు. మీకు అత్యంత సన్నిహితులు వాలెంటైన్స్ డే సందర్భంగా మీకు సర్‌ప్రైజ్ గిఫ్ట్ పంపారు.. దాన్ని పొందాలంటే మేం చెప్పిన ఖాతాకు కస్టమ్స్ చార్జీ కోసం కొంత మొత్తం పంపండి అంటూ వల వేస్తున్నారని పోలీసులు పేర్కొంటున్నారు. ప్రధానంగా చేస్తున్న మోసాలు చూస్తే..

షాపింగ్ ఫ్రాడ్స్..:

ఆన్‌లైన్ షాపింగ్, బెస్ట్ ఆఫర్స్, గిఫ్ట్‌లు, డిన్నర్‌లు అంటూ సోషల్‌మీడియా ఖాతాల్లో మోసపూరిత యాడ్స్ ఇస్తున్నారు. ఈ ఆఫర్ల కోసం సంప్రదించే వారి నుంచి వ్యక్తిగత, బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకుని మోసం చేస్తున్నారు.

ఫిషింగ్ ఈమెయిల్స్..

సైబర్ నేరగాళ్లు వాలెంటైన్స్ డేకు సంబంధించి ప్రత్యేక కొటేషన్లు, మెసేజ్‌లు, ఎమోజీలు, గ్రాఫిక్ వీడియోలు అంటూ ఫిషింగ్ లింక్‌లను ఈమెయిల్స్‌కు పంపుతున్నారు. వీటిపై క్లిక్ చేసిన వెంటనే మన మొబైల్, ల్యాప్‌టాప్‌లోకి మాల్‌వేర్ వచ్చేలా చేస్తూ మోసాలకు తెరతీస్తున్నారు.

ఈ విషయాలు మరవొద్దు..:

వాలెంటైన్స్ డే ప్యాకేజీలు, గిఫ్ట్‌ల పేరిట నమ్మశక్యం కాని ఆఫర్లు ఉంటే అది సైబర్ మోసగాళ్ల అనుమానాస్పద ప్రకటనగా గుర్తించాలి.

ఆన్‌లైన్‌లో వాలెంటైన్స్ డే గిఫ్ట్‌లు కొనాలంటే నమ్మదగిన ఈ కామర్స్ వెబ్‌సైట్లనే ఉపయోగించాలి. కొత్త యాప్స్ వినియోగించాల్సి వస్తే వాటి రేటింగ్ తప్పక చూసుకోవాలి.

అనుమానాస్పద మెసేజ్‌లు, ఈ మెయిల్స్‌లోని లింక్‌లపై క్లిక్ చేయవద్దు. మీ వ్యక్తిగత, బ్యాంకు ఖాతా నంబర్లు, క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాలు, పిన్ నంబర్లు, సీవీవీ నంబర్లు ఎవరితోనూ పంచుకోవద్దు.



యాదాద్రి పైకి ఆటోలు

రెండేళ్ల తర్వాత అనుమతి.. జెండా ఊపి ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఐలయ్య

యాదగిరిగుట్ట : రెండేళ్ల తర్వాత యాదాద్రి కొండపైకి ఆటోల రాకపోకలు షురూ అయ్యాయి. యాదాద్రి ప్రధానాలయ ఉద్ఘాటన జరిగిన 2022 మార్చి 28వ తేదీ నుంచి కొండపైకి ఆటోలు నడపడం నిషేధించారు. దీంతో ఆటోడ్రైవర్లు నిరసనకు దిగారు. మొదటి ఘాట్ రోడ్డులోని యాదరుషి ఆలయం వద్ద వివిధ రూపాల్లో వారు దీక్షలు, ఆందోళనలు చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పోలీసుల సూచన మేరకు నవంబర్ 2023లో దీక్షలు విరమించారు. అధికారంలోకి వస్తే గుట్టపైకి ఆటోలు నడిచేలా చూస్తామని కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల ఐలయ్య ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రెండు, మూడుసార్లు ఆటో డ్రైవర్లు, దేవాలయ, పోలీసు అధికారులతో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చర్చలు జరిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖలతో మాట్లాడి ఆదివారం నుంచి కొండపైకి ఆటోలు నడిచే విధంగా చూశారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా

ఆటోడ్రైవర్లకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నానని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. యాదాద్రి కొండపైకి ఆటోలను అనుమతించే కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ హనుమంతు కె.జెండగే, డీసీపీ రాజేష్ చంద్ర, ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తిలతో కలిసి జెండా ఊపి పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఐలయ్య మాట్లాడుతూ



కలెక్టర్, డీసీపీలను ఎక్కించుకొని ఆటో నడిపిస్తున్న విప్ బీర్ల ఐలయ్య.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆటో డ్రైవర్లకు మంచి రోజులు వచ్చాయన్నారు. అనంతరం కలెక్టర్ జెండగే, డీసీపీ రాజేష్ చంద్రా, ఈఓ రామకృష్ణారావులను బీర్ల ఐలయ్య ఆటోలో గుట్టపైకి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు బండ్రు శోభారాణి, కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఏసీపీ శివరాంరెడ్డి, సీఐ రమేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ తదితరులు పాల్గొన్నారు.

ఆటోలకు స్టిక్కర్లు..

యాదాద్రి కొండపైకి నడిచే ఆటోలకు ట్రాఫిక్ పోలీసులు, ఆటో కార్మిక యూనియన్ నేతలు సీరియల్ నంబర్, శ్రీస్వామి వారి చిత్రపటంతో కూడిన స్టిక్కర్లు అతికించారు. ఆటో డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్ పత్రాలను పరిశీలించారు. తొలి రోజు అధికారులు చెప్పిన ప్రకారం 100 ఆటోలను కొండపైకి నడిపించారు.



అమ్మవార్ల గద్దెల వద్ద కిక్కిరిసిన భక్తులు

సర్వం సిద్ధం..

- మేడారం కుంభమేళాపై సీతక్క.. సమ్మక్క–సారలమ్మలను దర్శించుకున్న మంత్రి

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం మహాజాతర కుంభమేళాకు సర్వం సిద్ధం చేశామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఆదివారం ములుగు జిల్లా ఎస్ఎస్‌తాడ్వాయి మండలం మేడారంలో శ్రీ సమ్మక్క–సారలమ్మలను దర్శించుకుని పూజలు చేసిన అనంతరం మంత్రి మాట్లాడారు. ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే మహాజాతరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని, జంపన్నవాగుపై స్నాన ఘట్టాలు, క్యూ లైన్లు, తాగునీరు, రోడ్లు, బస్టాండ్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈనెల 23న సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్‌తో పాటు రాష్ట్రపతి మేడారానికి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజ, ఐటీడీఏ పీఓ అంకిత్, ఎస్పీ డాక్టర్ శబరీశ్, ఈఓ రాజేంద్రం పాల్గొన్నారు.

ఈనెల 14న మండమెలిగె పండుగ

మహాజాతర ప్రారంభానికి ఇంకా తొమ్మిది రోజుల సమయం మాత్రమే ఉంది. ఇప్పటికే లక్షల సంఖ్యలో భక్తులు వనదేవతలను దర్శించుకున్నారు. ఆదివారం కూడా తెలుగు రాష్ట్రాలతోపాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర నుంచి లక్షలాది మంది తరలివచ్చారు. 14న బుధవారం సమ్మక్క– సారలమ్మ పూజారులు మండమెలిగె పండుగ నిర్వహించనున్నారు.

ఉత్సవ కమిటీ చైర్మన్‌గా లచ్చుపటేల్

సమ్మక్క–సారలమ్మ మహాజాతర ఉత్సవ కమిటీని దేవాదాయ శాఖ నియమించింది. చైర్మన్‌గా అరెం లచ్చుపటేల్, కమిటీ సభ్యులుగా మిల్కూరి అయిలయ్య, కోడి గోపాల్, గంగెర్ల రాజారత్నం, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, యాప అశోక్, పోరిక నారాయణ్‌సింగ్, ముంజల భిక్షపతి, సుంచ హైమావతి, చామర్తి కిషోర్, కొరం అబ్బయ్య, ఆలం శశిధర్, వద్దిరాజు రవిచంద్ర, అంకం క్రిష్ణస్వామి, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావును నియమించారు. చైర్మన్‌తో పాటు డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం త్వరలో చేయనున్నట్లు తెలిసింది.

టీబీ రోగులకు డ్రోన్ సేవలు

- 'బీబీనగర్ ఎయిమ్స్'లో ఫలించిన ప్రయోగం.. డ్రోన్ సేవలను వివరించిన ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్‌భాటియా

బీబీనగర్ : టీబీ రోగుల కోసం బీబీనగర్ ఎయిమ్స్ ప్రయోగాత్మకంగా చేపట్టిన డ్రోన్ సేవలు విజయవంతమయ్యాయి. టీబీ రోగులు, అనుమానితుల నుంచి రక్త పరీక్షలకు నమూనాలు సేకరించి వెనువెంటనే ల్యాబ్‌లకు పంపించడం, తిరిగి అవసరమైన మందులను రోగులకు పంపేందుకు డ్రోన్ సాయం తీసుకున్నారు. గ్రామీణ ప్రాంతాలు, తండాలపరిధిలో 150 మంది నమూనాలను సేకరించి డ్రోన్ ద్వారా ల్యాబ్‌లకు పంపి.. తిరిగి మందులు చేరవేశారు. ఆదివారం ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్‌భాటియా డ్రోన్ సేవల గురించి వెల్లడించారు.రెండు నెలలుగా డ్రోన్ సేవలపై చేపట్టిన ప్రయోగాలు ఫలించడంతో టీబీ రోగులకు చాలా సులువుగా సేవలు అందుతున్నాయి. పైలెట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన డ్రోన్ సేవలను ఇటీవల ఎయిమ్స్‌కు వచ్చిన కేంద్రమంత్రి ఆర్‌కే.సింగ్ పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు.

పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లకు అనుసంధానం

భువనగిరి, రామన్నపేట, బీబీనగర్ బొమ్మలరామారం మండలాల పరిధిలోని పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లకు డ్రోన్‌లను అనుసంధానం చేశారు. ఇక్కడి నుంచి రోగుల నమూనాలను సేకరించి రిమోట్ ద్వారా జిల్లా కేంద్రంలోని క్షయవ్యాధి యూనిట్‌లకు డ్రోన్ ద్వారా పంపుతారు. తిరిగి అక్కడి నుంచి రోగులకు అవసరమయ్యే టీబీ మందులు, ట్యాబ్‌లు, రియాజెంట్‌లను డ్రోన్‌లో అమర్చి రోగులకు పంపుతారు. దీని కోసం ప్రస్తుతం ఎయిమ్స్‌లోని 3 డ్రోన్ పైలెట్లు, 2 డ్రోన్‌లు అందుబాటులో ఉంచారు.



రోగుల ఖర్చు తగ్గించేందుకు సహాయపడుతుంది



డ్రోన్ సేవల ద్వారా టీబీ నిర్ధారణలో ట్యూమరౌండ్ సమయం తగ్గించడం, దూర ప్రాంతాల్లో, రవాణా సరిగ్గా లేని చోట నివసించే వ్యక్తులకు రవాణా ఖర్చులు తగ్గించేలా డ్రోన్ సేవలు సహాయపడతాయి. జిల్లా టీబీ కార్యాలయం నుంచి డ్రోన్ కార్యకలాపాలను పీహెచ్‌సీలతో పాటు సబ్‌సెంటర్లకు సైతం విస్తరిస్తున్నాం.

- వికాస్‌భాటియా, డైరెక్టర్, ఎయిమ్స్

ఎడవల్లి శివారులో పులి సంచారం?

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం మాధవఎడవల్లి, పోతేనపల్లి గ్రామాల శివారులో పులి సంచరిస్తున్నట్లు తెలిసింది. పోతేనపల్లి గ్రామానికి చెందిన ఆదిమళ్ల వెంకన్న భార్యతో కలిసి శనివారం కారులో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి వెళ్లారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో నార్కట్‌పల్లి మీదుగా కాకుండా.. కామినేని ఆస్పత్రి పక్కనే ఉన్న హెరిటేజ్ పాల ఉత్పత్తి కేంద్రం ఎదురుగా ఉన్న వెంచర్ నుంచి స్వగ్రామానికి బయల్దేరారు. ఎడవల్లి శివారు(ఏపీ లింగోటం చెరువు సమీపం) చేరుకోగానే 50 మీటర్ల దూరంలో పులి నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాన్ని వెంకన్న భార్య చూసి భర్తను అప్రమత్తం చేసింది. పులి వెళ్లిన అనంతరం ఈ విషయాన్ని ఏపీ లింగోటం మాజీ సర్పంచ్ నూకల శంకర్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. ఆయన నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం దృష్టికి తీసుకెళ్లడంతో.. స్పందించి నార్కట్‌పల్లి ఎస్‌ఐ అంతిరెడ్డి, అటవీశాఖ అధికారులను అప్రమత్తం చేశారు. ఆయుధాలు, కర్రలు పట్టుకొని గుంపులు గుంపులుగా వెళ్లాలని ఆదివారం ఏపీ లింగోటం గ్రామంలో చాటింపు వేయించారు. ఆయా గ్రామాల పరిసరాల్లో ఎలాంటి పులి ఆనవాళ్లు కనిపించలేదని అధికారులు తెలియజేశారు.

వేర్వేరుచోట్ల నీట మునిగి నలుగురు చిన్నారుల మృతి

మల్హర్/తొర్రూరు రూరల్: జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల్లో ప్రమాదవశాత్తు చెరువుల్లో మునిగి నలుగురు చిన్నారులు మృత్యువాతపడ్డారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్లకు చెందిన రాజు– అనూష దంపతుల సంతానం అరుణ్‌కుమార్(12), కార్తీక్(9). తల్లితో కలిసి వారు ఆదివారం ఉదయం మేకలను మేపడానికి ఊరి బయటకు వెళ్లారు. అనంతరం మేకలను మేపుకుని వస్తామని పిల్లలు చెప్పడంతో ఆమె ఇంటికి వెళ్లిపోయింది. అయితే ఎంతసేపటికీ పిల్లలు, మేకలు ఇంటికి చేరకపోవడంతో తల్లి చుట్టుపక్కల ప్రదేశాల్లో వెతికింది. చెరువు వద్ద ఎవరివో చెప్పులు ఉన్నాయని పలువురు గ్రామస్తులు తెలపడంతో అనూష కుటుంబసభ్యులు వెళ్లి గజ ఈతగాళ్ల సహాయంతో వెతికించగా ఇద్దరు చిన్నారుల మృతదేహాలు లభ్యమయ్యాయి. అరుణ్‌కుమార్ తొర్రూర్ సమీపంలోని నన్నూర్ హాస్టల్‌లో చదివేవాడు. మూడు నెలల క్రితం ఇంటి వచ్చి మళ్లీ హాస్టల్‌కు వెళ్లకపోవడంతో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో చేర్పించారు. కార్తీక్ కూడా ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. కాగా, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి చెందిన గంధం స్వామి–రూప దంపతుల కుమారుడు యాకూబ్(12), కిన్నెర మహేశ్–సావిత్రి దంపతుల కుమారుడు జంపన్న(10) ఆదివారం స్నేహితులతో కలిసి చెరువులో ఈత నేర్చుకునేందుకు వెళ్లారు. అయితే ప్రమాదవశాత్తు వారు నీట మునిగిపోవడంతో తోటి పిల్లలు గమనించి కేకలు వేశారు. పశువుల కాపరులు వచ్చి వారిని బయటకు తీయగా అప్పటికే మృతిచెందారు. యాకూబ్ అమ్మాపురం ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి, జంపన్న ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.